సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 12
సంచిక: 141

SUNDAY Special

ఆదివారం 11-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



## టైటిల్‌కు గెలుపు దూరంలో...

హైదరాబాద్ ఓపెన్ డబుల్స్ ఫైనల్లో సిక్కి రెడ్డి–అశ్విని జంట

– స్పోర్ట్స్‌లో



## ఆడొచ్చు... అవాంతరం లేకుండా

నేడు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో వన్డే

– స్పోర్ట్స్‌లో



శనివారం హైదరాబాద్‌లో జరిగిన సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్-2018 కార్యక్రమంలో అవార్డుగ్రహీతలతో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సాక్షి గ్రూప్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి - 2లో



కృష్ణంరాజుకు జీవిత సాఫల్య పురస్కారం అందిస్తున్న హీరో రామ్‌చరణ్. చిత్రంలో కృష్ణంరాజు సతీమణి

## వరద విలయం

- వారం రోజులుగా కురుస్తున్న వానలతో కేరళ, కర్ణాటక, తమిళనాడుతోపాటు మహారాష్ట్ర, గుజరాత్ అతలాకుతలమవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ ఐదు రాష్ట్రాల్లో 119మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో అత్యధికంగా 57 మంది, కర్ణాటకలో 26 మంది చనిపోయారు. గుజరాత్‌లో భారీ వర్షాల కారణంగా 19 మంది, మహారాష్ట్రలో 12 మంది మృతి చెందారు.

- వివరాలు 5లో

# ఇక.. పక్కా లోకల్

## పంచాయతీరాజ్ వ్యవస్థ వికేంద్రీకరణ

- పంచాయతీ నుంచి జిల్లా పరిషత్‌ల వరకు విధులపై త్వరలో స్పష్టత
- జిల్లా, మండల పరిషత్‌లకు విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలు
- ఇకపై అవి ఏ పనీ లేకుండా ఉత్సవ విగ్రహాలుగా ఉండవు
- స్థానిక సంస్థలకు అధికారాల బదిలీ
- విద్య, వైద్యం, పచ్చదనం, పారిశుద్ధ్యం అంశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు పాత్ర
- ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కొత్త పంచాయతీరాజ్ చట్టం వెలుగులో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్‌ల వరకు ఎవరు ఏ విధులు నిర్వర్తించాలనే విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు ఇప్పటి మాదిరిగా ఉత్సవ విగ్రహాలుగా ఉండబోవని, అధికార వికేంద్రీకరణ ద్వారా వారికి విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలవడానికి ముందే స్థానిక సంస్థలకు అప్పగించే విధులు, నిధులు, బాధ్యతల విషయంలో స్పష్టత ఇస్తామని వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచే



కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి గ్రీన్ కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీరాజ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ''గ్రామాలు బాగుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పట్టుబట్టి పని చేస్తే గ్రామాల్లో తప్పక మార్పు వస్తుందనే నమ్మకం నాకుంది. పల్లెల రూపురేఖలు మార్చడం కోసం ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టం తెచ్చింది. ప్రజా ప్రతినిధులు, అధికారుల బాధ్యతలు స్పష్టంగా నిర్వచించాం. ఇప్పుడు ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధికారాలను బదిలీ చేయాలని నిర్ణయించింది. సహాయ మంత్రి హోదాగల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కూడా ప్రస్తుతం ఏ పనీ లేకుండా ఉండటం సమంజసం కాదు. ప్రజల ద్వారా ఎన్నికైన ఎంపీపీలు, జెడ్పీటీసీలదీ ఇదే కథ. భవిష్యత్తులో ఇలా జరగడానికి వీల్లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు పాలనలో పూర్తిగా భాగస్వాములు కావాలి. విద్య, వైద్యం, పచ్చదనం, పారిశుద్ధ్యం.. ఇలా ఏ విషయంలో ఎవరి పాత్ర ఎంత అనేది నిర్ధారిస్తాం. గ్రామ పంచాయతీలు ఏం చేయాలి? మండల పరిషత్‌లు ఏం చేయాలి? జిల్లా పరిషత్‌లు ఏం చేయాలి? అనే మిగతా 2వ పేజీలో ▶

# సోనియా ఈజ్ బ్యాక్..



- కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా నియామకం
- రోజంతా హైడ్రామా.. రాత్రి 11 గంటలకు నిర్ణయం
- పార్టీ రాజ్యాంగంలోని నిబంధనల మేరకు నియమించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ
- రాహుల్ గాంధీ రాజీనామాకు ఆమోదం

- వివరాలు 5లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి ... గెలవండి

17
కూపన్

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| గుడ్ల రిటైల్ ధర | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 73 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 138 కిలో |
|---|---|---|---|---|
| ₹ 44 డజన్ | రిటైల్ లైవ్ బర్డ్ | 95 కిలో | స్కిన్‌లెస్ | 157 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



139 మెగావాట్ల సామర్థ్యం గల బాహుబలి మోటార్

- కాళేశ్వరంలో మరో అద్భుతం
- రెండో దశ ఎత్తిపోతలకు సర్వం సిద్ధం
- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపు పనులు పూర్తి
- నేడు లేదా రేపు బాహుబలి మోటార్లకు వెట్ రన్
- ఆ వెంటనే 3–4 రోజుల్లో పూర్తిస్థాయి ఎత్తిపోతలు

# రన్ 'బాహుబలి' రన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి నీటిని ఎత్తిపోసి మొదటి దశను విజయవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ ఎత్తిపోతలకు సిద్ధమైంది. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీటిని తరలించేలా పనులన్నీ పూర్తి చేసింది. నంది మేడారం, రామడుగు పంప్‌హౌస్‌లలో ఏడు మోటార్లకుగాను 5 మోటార్లను సిద్ధం చేయడంతోపాటు అత్యంత కీలకమైన ప్యాకేజీ-7 టన్నెల్ పనులను పూర్తి చేసింది. ప్యాకేజీ-8లో భాగంగా ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన రామడుగు పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆసియాలోకెల్లా పెద్దవైన బాహుబలి మోటార్లకు ఆదివారం లేదా సోమవారం నుంచి ట్రయల్ రన్ జరగనుంది. ఒకట్రెండు రోజుల్లో ట్రయల్ రన్ పూర్తి చేసి ఆ వెంటనే 3-4 రోజుల్లో పూర్తిస్థాయి ఎత్తిపోతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరై మిగతా 3వ పేజీలో ▶




## నేడు సాగర్ కాల్వల గేట్ల ఎత్తివేత!

**తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల నిర్ణయం**

**పాల్గొననున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, అనిల్**

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ కాల్వల గేట్లను ఎత్తి ఆదివారం నీటిని విడుదల చేయనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని రైతులకు సాగునీరివ్వడానికి సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల గేట్లు ఎత్తాలని ఉభయరాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఉదయం నాగార్జునసాగర్‌లో తెలంగాణ విద్యామంత్రి జి.జగదీశ్‌రెడ్డి, ఏపీ నీటిపారుదల మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కలసి కుడి, ఎడమకాల్వల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి లోలెవల్ కెనాల్(ఎల్ఎల్‌సీ), ఎలిమినేటి మాధవరెడ్డి(ఏఎంఆర్) కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారు. కార్యక్రమంలో పాల్గొనాలని నల్లగొండ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను జగదీశ్‌రెడ్డి ఆహ్వానించారు. కుడికాల్వ ద్వారా ఏపీకి, ఎడమ కాల్వ ద్వారా సాగర్ ఆయకట్టుకు నీరందనుంది.

## చట్టం వేరు.. ప్రభుత్వ నిర్ణయాలు వేరు



- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్
- విధుల్లో సవాళ్లను అధిగమిస్తేనే పురోగతి
- పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసిన ఐపీఎస్‌లకు సూచన

3లో

## కశ్మీర్‌పై భారత్‌కు రష్యా మద్దతు

- కశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలకు రష్యా మద్దతు ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి రద్దు, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం వంటివి భారత రాజ్యాంగానికి లోబడే జరిగాయని స్పష్టం చేసింది.

- వివరాలు 5లో





రేపు International Youth day

# యువజనోత్సాహం

దేహముంది.. ప్రాణముంది.. నెత్తురుంది.. సత్తువుంది అంతకంటే సైన్యముండునా అని ఒక సినీకవి చెప్పినట్లు యువతకు మించిన శక్తి లేదు. వారు ఉంటేనే దేశ భవితకు పటిష్టమైన పునాదులు పడతాయి. దేశాల సమగ్రాభివృద్ధి జరుగుతుంది. అందుకే యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు.. భవిష్యత్‌పై భరోసా కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ఏటా ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుతోంది. 2000 సంవత్సరం నుంచి ఐరాస ఒక్కో ఏడాది ఒక్కో థీమ్‌తో ముందుకొస్తోంది. అలా చేయడం వల్ల ఆ అంశంపై యువతలో, వివిధ దేశాల ప్రభుత్వాల్లో, యువత సంక్షేమం కోసం పనిచేసే సంస్థల్లో అవగాహన పెరిగి, ఆ రంగంలో యువత పాత్రను పెంపొందించే దిశగా కృషి చేస్తోంది. 'విద్యావ్యవస్థలో మార్పులు'అన్న థీమ్‌తో యువజన దినోత్సవాన్ని జరుపుతోంది. జీవనం సాగించేందుకు అవసరమయ్యే విద్య యువతరానికి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా 2030 నాటికి ప్రపంచదేశాలు సుస్థిర అభివృద్ధి సాధించాలన్న సందేశాన్నిస్తోంది. నిపుణుల కొరత తీరాలంటే అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలన్న నినాదంతో ఈసారి అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఐరాస సభ్యదేశాల్లో ప్రభుత్వాలు, యువత సంక్షేమం కోసం పనిచేసే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు 2030 నాటికి విద్యావ్యవస్థలో మార్పుల ద్వారా యువత బంగారు భవిష్యత్‌కు ఎలాంటి బాటలు వేయొచ్చో.. వారు తీసుకునే చర్యలేంటో ఐరాస పరిశీలించనుంది. నిరుపేద దేశాల్లో 10 శాతం యువత సెకండరీ ఎడ్యుకేషన్ మాత్రమే పూర్తి చేయగలుగుతోంది. ప్రపంచ జనాభాలో 40 శాతం మందికి మాతృ భాషలో విద్యాబోధన జరగట్లేదు. శరణార్థుల్లో 75 శాతానికి పైగా మందికి సెకండరీ విద్య కూడా అందుబాటులో లేదు. ఇలాంటి అసమానతలు తొలగిపోయి అందరికీ విద్య అందుబాటులోకి వస్తేనే ఏ దేశ ప్రగతి అయినా సాధ్యమని ఐరాస అంటోంది.



## క్లుప్తంగా...

### బ్యారేజీలకు దేవతామూర్తుల పేర్లు

**ఖరారు చేసిన ముఖ్యమంత్రి**



**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు, పంపుహౌజ్‌లకు దేవతామూర్తుల పేర్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శనివారం ఖరారు చేశారు. మేడిగడ్డ బ్యారేజీకి లక్ష్మీ బ్యారేజీగా, కన్నెపల్లి పంపుహౌజ్‌కు లక్ష్మీ పంపుహౌజ్‌గా నామకరణం చేశారు. అన్నారం బ్యారేజీకి సరస్వతి బ్యారేజీగా, సిరిపురం పంపుహౌజ్‌కు సరస్వతి పంపుహౌజ్‌గా నామకరణం చేశారు. ఇక సుందిళ్ల బ్యారేజీకి పార్వతి బ్యారేజీగా, గోలివాడ పంపుహౌజ్‌కు పార్వతి పంపుహౌజ్‌గా నామకరణం చేశారు. దీంతో పాటు నంది మేడారం రిజర్వాయర్, పంపుహౌజ్‌కు నంది పేరు ఖరారు చేయగా, లక్ష్మీపురం పంపుహౌజ్‌కు గాయత్రి పేరు పెట్టారు.

### జెండా వందనం

**ఏ జిల్లాలో ఎవరు?**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 15వ తేదీన జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలకు నేతృత్వం వహించే బాధ్యతలను మంత్రులు, జెడ్పీ చైర్మన్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించారు. సిద్దిపేటలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండలో మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, రంగారెడ్డిలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. మహమూద్ అలీ (భద్రాద్రి కొత్తగూడెం), కొప్పుల ఈశ్వర్ (జగిత్యాల), తలసాని శ్రీనివాస్ యాదవ్ (ఖమ్మం), ఈటల రాజేందర్ (కరీంనగర్), వి.శ్రీనివాస్‌గౌడ్ (మహబూబ్‌నగర్), సీహెచ్ మల్లారెడ్డి (మేడ్చల్–మల్కాజ్‌గిరి), ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), వేముల ప్రశాంత్‌రెడ్డి (నిజామాబాద్), జి.జగదీష్‌రెడ్డి (సూర్యాపేట), సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (వనపర్తి), ఎర్రబెల్లి దయాకర్‌రావు (వరంగల్ అర్బన్) జిల్లా కేంద్రాల్లో జరిగే ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. జెడ్పీ చైర్మన్లు జనార్దన్ రాథోడ్ (ఆదిలాబాద్), జక్కు శ్రీహర్షిణి (భూపాలపల్లి), పాగాల సంపత్‌రెడ్డి (జనగామ), సరిత (జోగులాంబ గద్వాల), దఫేదార్ శోభ (కామారెడ్డి), కోవ లక్ష్మి (కుమ్రం భీం ఆసిఫాబాద్), అంగోత్ బిందు (మహబూబాబాద్), నల్లాల భాగ్యలక్ష్మి (మంచిర్యాల), ర్యాకల హేమలత (మెదక్), పెద్దపల్లి పద్మావతి (నాగర్‌కర్నూల్), విజయమ్మ (నారాయణ్‌పేట), పుట్టా మధుకర్ (పెద్దపల్లి), అరుణ న్యాలకొండ (రాజన్న సిరిసిల్ల), పటోళ్ల సంజుశ్రీ (సంగారెడ్డి), పట్నం సునీత (వికారాబాద్), ఎలిమినేటి సందీప్‌రెడ్డి (యాదగిరి భువనగిరి) ఆయా జిల్లాల్లో జరిగే ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు (ములుగు), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (వరంగల్ రూరల్) జిల్లాల్లో జరిగే వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు

**మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి**



**సాక్షి హైదరాబాద్:** కేసీఆర్ కిట్‌ను అమల్లోకి తెచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌ఓఏ), ఇన్నోవేటివ్ అలయన్స్ ఫర్ పబ్లిక్ హెల్త్ (ఐఏపీహెచ్) సంయుక్తంగా సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న జాతీయ నర్సింగ్ సదస్సును శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిజేరియన్లు తగ్గి, సహజ ప్రసవాలు పెరగడంతో పాటు, వ్యాధుల నివారణ చర్యలు, చికిత్సలపై ప్రచారంతో ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగిందన్నారు. వైద్యుల మాదిరిగా నర్సులు కూడా ఎప్పటికప్పుడు చికిత్సల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బంగారు తెలంగాణ ఎంత ముఖ్యమో ఆరోగ్య తెలంగాణ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. నర్సింగ్ సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకొనేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిత్యం ప్రజాసేవలో తరించే నర్సులు వివిధ రంగాల్లో ఎలా రాణించాలో తెలియజేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఎండీ అండ్ సీఈవో డాక్టర్ బి.భాస్కర్ రావు, ఎన్ఓఏ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్ రుధావత్, వెల్ టెక్ ఫౌండేషన్ చైర్మన్ కె.వీ రాచారి తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి స్ఫూర్తిదాతలు

- తోటివారికోసం పాటుపడేవారికి అవార్డులివ్వడాన్ని ఆహ్వానించాలి
- 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డులు–2018'ప్రదానోత్సవంలో గవర్నర్ నరసింహన్
- విద్య, ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- మీడియా పెడధోరణులపైనా చురకలు.. సమాజంలో భాగంగా మెలగాలని సూచన
- తెలుగు సీరియళ్లతో సమాజంపై చెడు ప్రభావమని మండిపాటు
- హాజరైన సాక్షి మీడియా గ్రూప్ మాజీ చైర్‌పర్సన్ భారతీరెడ్డి, ఇరురాష్ట్రాల ముఖ్య అధికారులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్

**సాక్షి, హైదరాబాద్:** సమాజంలో సభ్యుడిగా ఉంటూ. సమాజం కోసం పాటుపడేవారిని 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు'కు ఎంపిక చేయడం ఆహ్వానించదగిన అంశమని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. ఈ అవార్డులు పొందిన వారిని చూసి సమాజం స్ఫూర్తి పొందుతుందని ఆయన అన్నారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డులు 2018'కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఆరోగ్యం, విద్య తదితరరంగాల్లో విశేష కృషిచేస్తున్న వారిని అవార్డులకు ఎంపిక చేసిన జ్యూరీకి అభినందనలు. సమాజం సుఖ, సంతోషాలతో ఉండేందుకు ఆరోగ్య పరిరక్షణ, విద్య అత్యంత కీలకం.ఈ రెండు రంగాలను అందరికీ అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఈ రెండు రంగాలపైనా ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరముందనే విషయాన్ని 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డులు 2018'కార్యక్రమం నొక్కి చెప్పింది'అని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు.

**ఇలాంటి వార్తలను నివారించలేమా?**

'సమాజంలో ప్రతికూల ధోరణి క్రమంగా పెరుగుతోంది. పత్రికల మొదటి పేజీ, ఎలక్ట్రానిక్ మీడియాలో విచారకరమైన వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడంతో.. సమాజంలో చెడు తప్ప మరేదీలేదనే అభి ప్రాయం ప్రజల్లో ఏర్పడే ప్రమాదముంది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా (ఫోర్త్ ఎస్టేట్) చెప్పుకునే మీడియాకు సంబంధించి.. నేను ఐదో లేదా ఆరో స్తంభంగా నా మనస్సాక్షి మేరకు మాట్లాడాలని అనుకుంటున్నా. నా మాటలు ఫోర్త్ ఎస్టేట్‌తో విభేదించేలా ఉన్నా.. సమాజంలో సానుకూల ధోరణి పెరిగేందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నా. ఉదయాన్నే ఎస్వీబీసీ లాంటి భక్తి ఛానెల్‌ను చూస్తే ఓ రకమైన సంతృప్తి లభిస్తుం ది. కానీ ఆ తర్వాత పేపర్ తెరిచి చూసినా.. టీవీ ఆన్ చేసినా అన్నీ చెడు వార్తలే కనిపిస్తాయి. ఇలాం టి వార్తలను మొదటి పేజీలు, టీవీ హెడ్‌లైన్లలో రాకుండా నివారించలేమా'అని గవర్నర్ నరసిం హన్ ప్రశ్నించారు. తాను ఏ ఒక్క మీడియా సంస్థనుద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, 130 కో ట్ల మంది ప్రజలున్న దేశంలో ఇలాంటి సంస్కృతి ప్రబలకుండా ఉండాలన్నదే తన ఉద్దేశమన్నారు.

**నివారించాల్సిన బాధ్యత మీడియాపైనా..**

'వరకట్న వేధింపులు, గృహహింస తదితరాలను పదే పదే చూపే బదులు.. వాటిని నివారించేందుకు మీడియా ఎందుకు ప్రయత్నించదు. ప్రతీ దృశ్యాన్నీ ఫోటోలు, వీడియోలు తీసి చూపడం ద్వారా ఒరిగేదేమిటో నాకు అర్థం కావడంలేదు. ఈ విషయాలను గవర్నర్ హోదాలో కాకుండా.. నా మనస్సాక్షి మేరకు చెప్తున్నా'అని నరసింహన్ వ్యాఖ్యానించారు. 'ఫోర్త్ ఎస్టేట్‌గా చెప్పుకునే పత్రికలు, టీవీ చానళ్లు సమాజంలో అంతర్భాగమే. అందరికీ ఉపయోగపడే విధానాలు రూపొందించేలా మీడియా మార్గనిర్దేశనం చేయాలి. అందులో లోటు పాట్లపై నిర్మాణాత్మక విమర్శలు చేయాలి. తద్వారా సమాజం మార్పు దిశగా సాగుతుంది'అని గవర్నర్ నరసింహన్ వ్యాఖ్యానించారు. ప్రమాదాలు, వరదలు సంభవించినపుడు మీడియా అనుసరించే ధోరణిపై కూడా గవర్నర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాల్లో మీడియా కూడా తన వంతు సామాజిక బాధ్యతగా సహాయ సామగ్రి వంటివి చేరవేయడం ద్వారా ప్రజల్లో సానుకూల దృక్పథం పెరిగేలా చూడాలన్నారు.

**ఎవరైనా వెళ్లాల్సిందే.. సెన్సేషనలిజం వద్దు**

'ఈ రోజు సమాజంలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెల్చుకోలేని పరిస్థితి కనబడుతోంది. సత్యమేవ జయతే నినాదం ఉన్న దేశంలో సెన్సేషనలిజం పెరుగుతోంది. సెన్సేషనలిజం ద్వారా పాఠకుల సంఖ్య, టీఆర్పీ రేటింగ్ పెరిగినా.. సమాజానికి మాత్రం నష్టమే చేకూరుతోంది. నిజాలను వెలికితీయడంలో మీడియా మార్గదర్శకత్వంతో వ్యవహరించాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. ఓ వ్యక్తి మరణించకముందే బ్రేకింగ్ అంటూ వార్తలు వేస్తున్న పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. 'ఈ గవర్నర్ వెళ్తున్నాడు.. వెళ్తామని మేము ముందే చెప్పాం'తరహా వార్తలపై నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఏదో ఒక గవర్నర్ వెళ్లక తప్పదు అని వ్యాఖ్యానించారు. వార్తల ప్రచురణ, ప్రసారంలో మీడియా సంస్థలు నైతిక విలువలు పాటించాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా చర్చలను అరుపులు కేకలు లేకుండా అర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమాజంపై చెడు ప్రభావాన్ని చూపే డైలీ సీరియళ్లకు బదులుగా సంతోషకరమైన కుటుంబ వాతావరణం ఉండేలా వాటిని ప్రసారం చేయాలని గవర్నర్ నరసింహన్ హితవు పలికారు.



సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్–2018 కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సాక్షి గ్రూప్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి. చిత్రంలో ఏపీ డీజీపీ గౌతమ్ సావంగ్, ఏపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లం, సాక్షి సీఈవో వినయ్ మహేశ్వరి తదితరులు

### ఇతరులు స్ఫూర్తి పొందేలా అవార్డులు

సమాజంలో వివిధరంగాల్లో కృషి చేసిన వారికి గుర్తించి అవార్డులు ఇవ్వడం ద్వారా మరికొందరికి స్ఫూర్తి లభిస్తుందని సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి అన్నారు. నాలుగేళ్లుగా సాక్షి మీడియా గ్రూప్ ఎక్సలెన్స్ అవార్డులు ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సాక్షి మీడియా గ్రూపు మాజీ చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు, రిటైర్డు ఐఎఎస్ అధికారి అజేయ కల్లం, ఏపీ డీజీపీ దామోదర్ గౌతమ్ సవాంగ్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్, జ్యూరీ చైర్మన్ పద్మ శ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతా సిన్హా, జ్యూరీ సభ్యులు ప్రణతి రెడ్డి, అరుణా బహుగుణ, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మ రాజే, దొంతి నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, నరేంద్ర సురానా, వినోద్ కె అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా.. సాక్షి అవార్డుల పండుగ

- ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్
- సామాజిక సేవ, సినిమా రంగాల్లో కృషి చేసిన వారికి అవార్డులు
- 'సాక్షి'మీడియా గ్రూప్ చొరవను ప్రశంసించిన ప్రముఖులు

**సాక్షి, హైదరాబాద్:** సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డులు 2018'కార్యక్రమం శనివారం కన్నుల పండువగా సాగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా, సాక్షి గ్రూపు మాజీ చైర్‌పర్సన్ వైఎస్ భారతీరెడ్డి గౌరవఅతిథిగా పాల్గొన్నారు. 2014లో ప్రారంభమైన 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డులు'ఐదో ఎడిషన్‌లో భాగంగా 2018కి సంబంధించి వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. సామాజిక సేవ, విద్య, ఆరోగ్య పరిరక్షణ, క్రీడలు, సినిమా రంగాల్లో విశేష ప్రతిభ చూపిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. సినీ నటి ఝాన్సీ వ్యాఖ్యానం, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దీపికారెడ్డి బృందం 'స్వాగతాంజలి'కూచిపూడి నాట్యంతో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, గౌరవ అతిథి వైఎస్ భారతీరెడ్డి చేతుల మీదుగా వ్యవసాయ రంగంలో చెరుకూరి రామారావు, విద్యారంగంలో పెరవలి గాయత్రి, ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్‌గా డాక్టర్ రమేశ్ కంచర్ల, తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ అవార్డులు అందుకున్నారు. సామాజిక సేవారంగంలో మల్లికాంబ ఇనిస్టిట్యూట్ ఫర్ మెంటల్లీ హ్యాండీకాప్డ్ సంస్థ వ్యవస్థాపకురాలు రామలీల, విద్యారంగంలో డాక్టర్ ఐవీ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య పరిరక్షణ విభాగంలో డాక్టర్ బిందు మీనన్, క్రీడారంగానికి సంబంధించి గరికపాటి అనన్య, షేక్ మహ్మద్ అరీ ఫుద్దీన్ తరపున అతడి సోదరుడు అవార్డులు అందుకున్నారు. ఆరోగ్య పరిరక్షణ, సామాజిక సేవా రంగాల్లో డాక్టర్ యాదయ్య, హుసాముద్దీన్ తోపాటు సబీనా జేవియర్ తరపున దినేశ్ అవార్డులు స్వీకరించారు.

**ప్రభుత్వ అధికారులు, ప్రముఖుల చేతుల మీదుగా**

ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్‌ను వైఎస్ భారతీరెడ్డి సన్మానించారు. అవార్డు గ్రహీతలను ఎంపిక చేసిన జ్యూరీ చైర్‌పర్సన్, పద్మ శ్రీ అవార్డు గ్రహీత శాంతా సిన్హాతో పాటు, జ్యూరీ సభ్యులుగా వ్యవహరించిన రెయిన్‌బో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రణతీరెడ్డి, రిటైర్డు ఐపీఎస్ అధికారి అరుణా బహుగుణ, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్జీ రంగా యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ పద్మరాజు, కాటన్ బోర్డు మాజీ సలహాదారు దొంతి నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు, సురానా టెలికాం ఎండీ నరేంద్ర సురానా, రిటైర్డు ఐఏఎస్ అధికారి వినోద్ అగర్వాల్ తదితరులకు సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ రాణిరెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. భారతి సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సీఈఓ అనూప్ కుమార్ సక్సేనా, వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉపాధ్యక్షులు శేఖర్ విశ్వనాథన్, శంకర్ విశ్వనాథన్, సాక్షి సీఈఓ వినయ్ మహేశ్వరి, సాక్షి మీడియా డైరెక్టర్లు ఎ.లక్ష్మీనారాయణ రెడ్డి, కేఆర్‌పీ రెడ్డి, వైఈపీ రెడ్డి, పీవీకే ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సినీ రంగంలో...

సినిమా ఇండస్ట్రీకి సంబంధించి పలు విభాగాల్లో సాక్షి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం జరిగింది. 'జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సీనియర్ నటుడు కృష్ణంరాజు, ఉత్తమ నటుడిగా రామ్‌చరణ్, ఉత్తమ నటిగా పూజాహెగ్డే, ఉత్తమ దర్శకుడిగా నాగ్‌అశ్విన్, ఉత్తమ చిత్రంగా 'మహానటి'కి అవార్డులు ప్రదానం చేశారు. ఇంకా పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్నారు.

*మిగతా విశేషాలు ఫ్యామిలీలో....*

## ఇక పక్కా లోకల్

▶ మొదటి పేజీ తరువాయి

విషయాలపై పూర్తి స్పష్టత ఇస్తాం. త్వరలోనే కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయి. దానికి సమానంగా రాష్ట్ర వాటా కేటాయిస్తాం. ఆ నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేస్తాం. విధులను స్పష్టంగా పేర్కొన్న తర్వాత, నిధులు విడుదల చేశాకే గ్రామాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభిస్తాం' అని సీఎం కేసీఆర్ చెప్పారు.

**విస్తృత చర్చలు, అధ్యయనం తర్వాత తుది రూపం...**

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ఏ విధులు నిర్వర్తించాలి? ఏయే అంశాల్లో వారి బాధ్యతలు ఎంత వరకుంటాయి? ఎలాంటి అధికారాలుంటాయి? తదితర విషయాలపై సమగ్ర చర్చ, పూర్తి స్థాయి అధ్యయనం జరపాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ విభాగంలో పని చేసిన అనుభవంగల నాయకులు, అధికారులు, నిపుణులతో విస్తృతంగా చర్చించి ముసాయిదా రూపొందించాలని సూచించారు. ముసాయిదాపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో చర్చిస్తామని, తర్వాత మంత్రివర్గ ఆమోదం అనంతరం అసెంబ్లీలోనూ విస్తృతంగా చర్చిస్తామని వెల్లడిం చారు. ఆయా సందర్భాల్లో వచ్చిన సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తై మున్సిపల్ ఎన్నికలు కూడా ముగిశాక గ్రామాల్లో, పట్టణాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని చెప్పారు.

**ఖాళీలన్నీ భర్తీ చేయాలి...**

పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా పరిషత్ సీఈవో వరకు అన్ని ఖాళీలను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈవోపీఆర్డీ పోస్టులను ఇకపై మండల పంచాయతీ అధికారులుగా పరిగణిస్తామని చెప్పారు. గ్రామ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ సీఈవోలు, డీపీఓలు, సీఈవోలు.. ఇలా అన్ని విభాగాల్లో అవసరమైన వారికి పదోన్నతులు కల్పిస్తూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల ఎంపికకు నేరుగా నియామకాలు జరపాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్.కె.జోషి, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సీఎంవో కార్యదర్శులు స్మితా సబర్వాల్, భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్ రెడ్డి, తేరా చిన్నపురెడ్డి, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, గట్టు రామచందర్‌రావు పాల్గొన్నారు.

# హరితహారానికి అంతా సిద్ధం

**సాక్షి, హైదరాబాద్:** పల్లె సీమల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేందుకు చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికలో హరితహారం కీలకం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో '60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక'అమలుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపడుతోంది. ఇందులో గ్రామస్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులని భాగస్వాములను చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ దిశలో కట్టుదిట్టమైన ప్రణాళిక అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అరవై రోజుల కార్యాచరణలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి, మంచి ఫలితాలను సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తమ విధులు నిర్వర్తించి గ్రామాభివృద్ధికి పాటుపడేలా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ నిర్దేశించారు.

**నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు**

కొత్త పంచాయితీరాజ్ చట్టం పచ్చదనం పెంపు, మొక్కలు నాటడాన్ని తప్పనిసరి చేస్తూ, ప్రతీ గ్రామ పంచాయితీకి ఈ ఏడాది నుంచే ఒక నర్సరీ ఏర్పాటు కూడా ప్రతిపాదించింది. గ్రామానికి ఒక నర్సరీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రకారం 12,571 గ్రామ పంచాయితీలకుగాను, 11,944 నర్సరీలు ఏర్పాటయ్యాయి. అటవీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల సమన్వయంతో నర్సరీల ఏర్పాటు జరుగుతోంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మొక్కల రక్షణకు బాధ్యత వహించని వ్యక్తులు, సంస్థలపై తగిన చర్యలు చట్టంలో ప్రతిపాదించింది. ఇందులో భాగం గా ఆస్తిపన్నుకు సమానమైన ఫైన్ విధించే అవకాశముంది.

**పీఆర్ రోడ్ల వెంట 91 శాతం బతికాయి**

హరితహారం కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచాయతీ రాజ్ రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల్లో 91 శాతం బతికినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అంచనా ప్రకారం ప్రభుత్వానికి చెందిన నిరుపయోగంగా ఉన్న, రక్షిత చర్యలున్న (ఫెన్సింగ్, కాంపౌండ్, నీటి వనరు) ప్రాంతాల్లో నాటిన మొక్కల్లో 60 శాతం, ఖాళీ స్థలాలు, పోరంబోకు భూముల్లో నాటిన మొక్కల్లో 53 శాతం మొక్కలు బతికినట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు, ప్రతీ గ్రామానికి దారి తీసే రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. మున్సిపాలిటీలు, అన్ని పంచాయితీ రోడ్ల వెంట నీడను ఇచ్చే మొక్కలతో పాటు, పూలతో ప్రయాణం అహ్లాదంగా ఉండాలనే స్ఫూర్తితో ఈ ప్రణాళిక అమలు కానుంది.

### ఏడాది పొడుగునా బాధ్యత

వర్షాల సీజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని హడావుడి చేయటం మాత్రమే కాకుండా, ఏడాది పొడవునా మొక్కల సంరక్షణకు ఆయా శాఖలు బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రక్షణ చర్యలు చేపట్టడం, నీటి సౌకర్యం కల్పించటం, మొక్కలు నాటిన ప్రదేశాలను జియోట్యాగింగ్ చేయటం, అటవీ శాఖ నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయటం చేయాలని, తద్వారా నిరంతర పర్యవేక్షణ సాధ్యం అవుతుందని శాఖాధిపతులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రతినెలా ఆ మొక్కల ఎదుగుదలను, బతికిన మొక్కల శాతాన్ని నమోదు చేయాలని సూచించింది. ప్రతీ శాఖ ప్రాంతాలవారీగా కొందరు ఉద్యోగులతో బృందాలను ఏర్పాటుచేసి, వారంలో ఒక రోజు మొక్కల పర్యవేక్షణకు కేటాయించాలని తెలిపింది. అలాగే గత నాలుగేళ్లుగా మొక్కలు నాటిన ప్రాంతాల్లో ఎండిపోయిన మొక్కలను గుర్తించి కొత్త వాటిని నాటాలని తెలిపింది.




అవున్సార్! నాకూ అర్థం కావడంలేదు
13 వస్తే ఎక్కువ అనిపించింది!

# ఆదాయం అదుర్స్

- ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రంలో స్థిరంగా పన్ను రాబడి
- తొలి త్రైమాసికంలో రూ. 10 వేల కోట్లకు పైమాటే..
- ప్రతినెలా 3 వేల కోట్ల ఆదాయం.. జూలైలో 4 వేల కోట్ల పైచిలుకు
- మద్యం, పెట్రోల్ విక్రయాలతోనే రూ. 6,180 కోట్లు
- ఈ ఏడాది మందకొడిగానే జీఎస్టీ వసూళ్లు
- కార్ల అమ్మకాలు, ఇసుక రవాణా తగ్గడమే కారణమా?
- జూలై నెలలో వెయ్యి కోట్లు దాటుతుందని అంచనా

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పన్నుల రాబడి స్థిరంగా కొనసాగుతోంది. గత ఏడాదితో పోలిస్తే కొంత మెరుగ్గానే గత నాలుగు నెలలుగా ఆదాయం వస్తోందని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది తొలి నాలుగు మాసాల్లో కలిపి మొత్తం రూ. 14,500 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్టు ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్రైమాసికాల వారీగా పోలిస్తే తొలి త్రైమాసిక పన్ను రాబడులు రూ.10,455 కోట్లు వచ్చాయి. నెలల వారీగా చూస్తే ప్రతి నెలా రూ.3 వేల కోట్ల ఆదాయం వస్తున్నా జూలై నెలలో మాత్రం రూ.4వేల కోట్లకు పైగా నమోదయింది. కేవలం మద్యం, పెట్రో ఉత్పత్తుల అమ్మకాల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 6వేల కోట్లకు పైగా పన్నుల రూపంలో ఆదాయం వచ్చింది. జీఎస్టీ, ఇతర పన్నుల్లో కొంత మందకొడితనం కనిపిస్తున్నా జూలై నెలలో జీఎస్టీ ఆదాయం పుంజుకుందని, రూ. వెయ్యి కోట్లకు పైగా రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వచ్చే అవకాశం ఉందని వాణిజ్య పన్నుల శాఖ వర్గాలు చెపుతున్నాయి.

**గత ఏడాదితో పోలిస్తే..**

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆదాయంలో మంచి పెరుగుదలే కనిపిస్తోంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలలకుగాను రూ. 12,680 కోట్లు పన్నుల రూపంలో ఖజానాకు చేరగా, 2018–19 సంవత్సరంలో అదికాస్తా రూ.13,700 కోట్లకు చేరింది. అదే ఈ ఏడాది జూలై నెలలో జీఎస్టీని కలపకుండానే రూ. 13,675 కోట్ల ఆదాయం సమకూరింది. జీఎస్టీ రూపంలో వస్తుందని అంచనా వేస్తున్న రూ.1000 కోట్లను కలిపితే అది రూ.14,500 కోట్లు దాటే అవకాశముంది. అయితే, జీఎస్టీ రాబడులు ఈ ఆర్థిక సంవత్సరంలో దూకుడు కొనసాగించడం లేదు. గత ఏడాదితో సమానంగా, అటూ ఇటూ వస్తున్న ఈ రాబడులు కొంత తగ్గేందుకు కార్ల అమ్మకాలు తగ్గడంతో పాటు ఏపీ నుంచి రావాల్సిన ఇసుక తగినంత రాలేకపోవడమూ కారణమని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, ఎక్కువగా సేవారంగంలో జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి ఎక్కువగా ఆదాయం సమకూరుతుండడం గమనార్హం.

**నెలనెలా... నిచ్చెనలా**

గత నాలుగు నెలల పన్నుల రాబడులను పరిశీలిస్తే మద్యం, పెట్రో ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వ్యాట్ పెద్ద ఎత్తున వస్తోంది. ఈ ఆదాయంలో ప్రతినెలా పెరుగుదల కనిపిస్తోంది. మద్యం, పెట్రో ఉత్పత్తుల అమ్మకాల ద్వారా ఏప్రిల్ నెలలో రూ. 1,360 కోట్లు, మేలో రూ. 1,420 కోట్లు, జూన్‌లో రూ. 1,600 కోట్లు ఆదాయం రాగా, జూలై నెలలో అది రూ. 1,800 కోట్లకు చేరింది. అంటే ప్రతి నెలా ఈ అమ్మకాలు పెరుగుతున్నాయన్నమాట. గత ఏడాది తొలి నాలుగు నెలల్లో ఈ అమ్మకాల ద్వారా రూ.5,350 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది కాస్తా రూ. 6,180 కోట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే మద్యం, పెట్రో ఉత్పత్తుల అమ్మకాలు దాదాపు 15 శాతం పెరిగాయని ప్రభుత్వ పన్ను లెక్కలు చెబుతున్నాయి.




ఈ ఏడాది జూలై నెలలో జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం వచ్చే నెలలో తేలుతుంది. ఈ నెల 15 వరకు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది కనుక ఆ ఆదాయం లెక్క కట్టకుండానే రూ. 13,675 కోట్లు వచ్చింది. ఈనెలలో జీఎస్టీ ఆదాయం రూ.1000 కోట్లు ఉంటుందన్నది అధికారుల అంచనా. దీన్ని కలిపితే రూ.14,500 కోట్లకు పైగా పన్ను రాబడి లెక్క తేలనుంది.

## స్టాంపుల ఆదాయం మరో 2 వేల కోట్ల పైమాటే

ఇక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం కూడా దూసుకుపోతోంది. తొలి నాలుగు నెలల్లో ఇప్పటివరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 2,349 కోట్లు వచ్చాయి. ప్రతినెలా రూ.500 కోట్లకు పైగానే ఆదాయం లభిస్తోంది. ఆషాఢమాసంలో కూడా సెంటిమెంట్‌ను పక్కన పెట్టిన క్రయవిక్రయదారులు జరిపిన లావాదేవీల ద్వారా రూ.500 కోట్లకు పైగా ఆదాయం రావడం గమనార్హం.





పవిత్రోత్సవాలకు అంకురార్పణగా హృత్విక్‌వరణం నిర్వహిస్తున్న రుత్వికులు

## నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

- ఘనంగా అంకురార్పణ
- మూడు రోజులపాటు అన్ని ఆర్జిత సేవలు రద్దు

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 7 గంటలకు శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనుల వారు ఉరేగింపుగా శ్రీవారి ఆలయం నుంచి బయలుదేరి నైరుతి దిక్కున ఉన్న వసంత మండపానికి చేరుకున్నారు. అక్కడ మేథిని దేవిపూజ, మృత్సంగ్రహణం, ఆస్థానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి పవిత్రమైన పుట్టమన్నును సేకరించారు. అనంతరం రాత్రి 9 నుంచి 10 గంటల వరకు సంపంగి ప్రాకరంలోని కల్యాణోత్సవ మండపంలో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు.. అష్టదళ పాదపద్మారాధన, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ అధికారులు రద్దు చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్

## చట్టం వేరు.. ప్రభుత్వ నిర్ణయాలు వేరు

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్
- విధుల్లో సవాళ్లను అధిగమిస్తేనే పురోగతి
- పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసిన ఐపీఎస్‌లకు సూచన

**సాక్షి, హైదరాబాద్:** నిజమైన ప్రజాస్వామ్యం అంటే న్యాయపరమైన సంయమనం, రాజకీయ స్వేచ్ఛ, చట్టబద్ధపాలన ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. ఈ విధంగా జరిగినప్పుడే ప్రజాతంత్ర వ్యవస్థ నిజమైన మనుగడ సాధ్యం అవుతుందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధతకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ అధికారుల శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో 'ఆధునిక ప్రజాస్వామ్యంలో చట్టబద్ధ పాలన'అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వ్యక్తి పాలనకు, చట్టబద్ధ పాలనకు తేడా ఉంటుందని, చట్టపాలనకు కచ్చితంగా ప్రభుత్వ విధానాలతో పెనవేసుకుని ఉండనవసరం లేదని, ఈ తేడాను విధి నిర్వహణలో గుర్తించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందన్నారు. చట్టబద్ధ పాలనకు న్యాయసమీక్ష మూలాధారం అవుతుందన్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా, చట్టబద్ధంగా వ్యవహరించాలని, ఇలాంటి సమయంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటన్నింటినీ అధిగమించినప్పుడే సమర్థత బయటపడుతుందని ఆయన యువ ఐపీఎస్ అధికారులకు సూచించారు. దేశానికి సేవలు అందించేందుకు కదనరంగంలోకి దిగే సమయంలో ఎదురయ్యే సవాళ్లను చట్టబద్ధంగానే అధిరోహించాలన్నారు. మీకున్న అధికారాలను నీతి, నిజాయితీతో సహేతుకంగా వినియోగించుకోవా లని వారికి విజ్ఞప్తి చేశారు. దేశం కోసం సరిహద్దుల్లోనూ, ఇతర చోట్ల ప్రాణాలను ఫణంగా పెట్టిన సైనికుల సేవలకూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే పోలీసులకు పెద్దగా తేడాలేదని, రెండు త్యాగాలూ వెలకట్టలేనివే అని జస్టిస్ రంజన్ గొగోయ్ కొనియాడారు. పోలీస్ అకాడమీ 1983లో ఏర్పాటైందని, ఆ తర్వాత ఏడాది ఆనాటి జమ్మూకాశ్మీర్ గవర్నర్ బీకే నెహ్రూ నుంచి ఎంతో మంది ప్రముఖులు ఇదే వేదిక నుంచి ప్రసంగించారని డైరెక్టర్ డాక్టర్ అభయ్ చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ జనరల్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఏపీ డీజీపీ గౌతం సవాంగ్, అకాడమీ పూర్వ డైరెక్టర్, రిటైర్డు ఐపీఎస్ అధికారి అరుణ బహుగుణ తదితరులు పాల్గొన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన తొలి దశ శిక్షణలో ఉన్న 156 మంది ఐపీఎస్‌లు, నేపాల్, భూటాన్, మాల్దీవులకు చెందిన 15 మంది విదేశీ అధికారులు, 2017 బ్యాచ్‌కు చెందిన రెండో దశ ట్రైనింగ్ ఐపీఎస్‌లు హాజరయ్యారు.

## ఆహ్లాదానికి 'అర్బన్' టచ్!

- ఆహ్లాదాన్ని పంచుతున్న అర్బన్ పార్కులు
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాలు, నగరాల్లో 77 ఏర్పాటుకు చర్యలు
- పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న ప్రాంతాలకు ఉపయుక్తం

**సాక్షి, హైదరాబాద్:** రోజువారీ టెన్షన్లతో గజిబిజి జీవితాలు వెళ్లదీస్తున్న సగటు నగర జీవి సేదతీరి సాంత్వన పొందేలా అటవీ ఉద్యానవనాలు (అర్బన్ ఫారెస్ట్ పార్కులు) రూపొందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాలు, నగరాల్లోని శివారు ప్రాంతాల్లో మొత్తం 25వేల హెక్టార్ల పైబడి విస్తీర్ణంలో వచ్చే నవంబర్ చివర్లోగా మొత్తం 77 అర్బన్ పార్కులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగరాల శివార్లలోని అటవీభూముల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, మానసికోల్లాసాన్ని అందించేందుకు ఇవి దోహదపడనున్నాయి. ఇప్పటికే 26 పార్కుల వరకు వివిధ నగరాల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చి ప్రకృతిలో సేద తీరుతున్న అనుభవాన్ని అందిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కలే (హెచ్ఎండీఏ పరిధిలో) 50కు పైగా పార్కులు ఏర్పాటవుతున్నాయి. వాటిలో కొన్ని ఈ వారంలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడంతోపాటు రోజంతా వాటిలో ఉల్లాసంగా గడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ పార్కుల్లో సహజమైన అటవీ సంపద దెబ్బతినకుండా, సందర్శకులకు తగిన సౌకర్యాలు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రకృతి ఒడిలో అత్యున్నతస్థాయి ప్రమాణాలతో ఈ అర్బన్ పార్కులు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే మూడోవంతు పార్కులు పట్టణ, నగర ప్రజలకు అందుబాటులోకి రాగా.. మరికొన్నింటిని త్వరలోనే ప్రారంభించనున్నారు.

**ఈ పార్కుల్లో ఏమేం ఉంటాయి?**

వాకింగ్, పాథ్ వే, సైక్లింగ్ ట్రాక్, చిల్డ్రన్ కార్నర్స్, యోగా, జిమ్ చేసుకునేందుకు షెడ్, భారీ వృక్షాల కింద రచ్చబండలు, వాష్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, క్యాంటీన్, సెక్యూరిటీ ఏరియాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

**129 అటవీ ప్రాంతాలు గుర్తింపు**

రాష్ట్రంలోని మొత్తం 129 అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు గుర్తించారు. వీటిలో 77 అర్బన్ పార్కులుగా, మిగతా ప్రాంతాలను అటవీ అభివృద్ధి జోన్లుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్కుల్లో ఇప్పటికే 26 పార్కులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని పార్కుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగతా 21 పార్కులకు సంబంధించి టెండర్లు ఖరారు కావటంతో పాటు, పనులు మొదలయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి.

**మొదటిదశలో 59 పార్కులు**

మొదటి దశలో హెచ్ఎండీఏ పరిధిలో 59 పార్కుల అభివృద్ధి జరగనుంది. అటవీ శాఖ 15, హెచ్ఎండీఏ 17, జీహెచ్ఎంసీ 3, టీఎస్ఐఐసీ 11, ఫారెస్ట్ కార్పొరేషన్ 4, మెట్రో రైల్ 2, టూరిజం 7 పార్కులను అభివృద్ధి చేస్తున్నాయి. సామాజిక బాధ్యతగా అర్బన్ పార్కులను అభివృద్ధి పరిచేందుకు ముందుకు వచ్చే కార్పొరేట్ సంస్థలను కూడా భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. పార్కులని సహజంగా, పర్యావరణహితంగా ఉండేలా, ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి మంచి అనుభూతిని మిగిల్చే ప్రయత్నం జరుగుతోంది.



## 'రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయండి'

**సాక్షి, హైదరాబాద్:** జంటనగరాల్లో ఆరు నెలల కాలంలో 800 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డ నేపథ్యంలో వెంటనే సంబంధిత విభాగాలు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలని సీనియర్ కార్మిక నేత, ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు.

**APSRTC**
**TENDER NOTIFICATION**
APSRTC invites e-bids for new buses of 2019 BS-IV make through MSTC portal from entrepreneurs, registered as vendors for APSRTC on MSTC portal, for supply of Express, Palleveluqu, Metro Express and City Ordinary buses under **"APPLICANT RATE QUOTE SYSTEM"** for operation on the identified routes of APSRTC. Detailed particulars viz. List of Routes, Daily KMs, Security Deposit, Model and Specifications of Bus, Body Standards, Seating Capacity, Seating Pattern, Colour scheme, Criteria for Selection of Entrepreneurs, Agreement Period, Terms and Conditions of bid, Schedule (dates) of Tenders, are placed in the APSRTC website **http://apsrtc.ap.gov.in.** Corporation reserves the right to cancel this notification without assigning any reason.
No:P9/359(15)/2019 -OPD(P), Dt:09-08-2019 Sd/- Vice Chairman & Managing Director




# రన్ 'బాహుబలి' రన్

▶ మొదటి పేజీ తరువాయి

మోటార్లను ఆన్ చేసి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టనున్నారు.

**ఆవిష్కృతం కానున్న అద్భుతం...**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మొదటి దశలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లి బ్యారేజీకి నీటి ఎత్తిపోతల ప్రక్రియ విజయవంతమైంది. ప్రస్తుతం పరీవాహకం నుంచి వస్తున్న ప్రవాహాలతో ఎల్లంపల్లి నుంచి నీరు దిగువకు వెళ్లిపోతోంది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి నుంచి నీటిని మిడ్‌మానేరుకు తరలించే పనులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం ఎల్లంపల్లి దిగువన ఉన్న నందిమేడారం పంప్‌హౌస్ పరిధిలో 124.5 మెగావాట్ల విద్యుత్‌తో నడిచే 7 మోటార్లలో ఐదింటికి ఇప్పటికే వెట్ రన్ నిర్వహించారు. రెండ్రోజుల కిందట ప్యాకేజీ–7లోని టన్నెళ్ల పనులు పూర్తి చేసి పరీక్షలు నిర్వహించారు. ఇవన్నీ సఫలం కావడంతో ప్యాకేజీ–8లోని బాహుబలి మోటార్లను పరిశీలించేలా ఫోర్ బేకి నీటిని వదిలారు. ప్యాకేజీ–8లోని సర్జ్‌పూల్‌ని శనివారం 227 మీటర్లకుగాను 214 మీటర్ల లెవల్ వరకు నింపారు. దశలవారీగా సర్జ్‌పూల్‌ను నింపుతూ లీకేజీలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ ఆదివారం పూర్తయితే పూర్తిస్థాయిలో సర్జ్‌పూల్‌ను నింపి ఒకటి లేదా రెండు మోటార్లకు వెట్ రన్ నిర్వహిస్తారు.

**115 మీటర్ల లోతు నుంచి నీటి ఎత్తిపోత...**

ప్యాకేజీ–8లోని ప్రపంచంలోనే అతిపెద్ద పంపింగ్ స్టేషన్‌ను భూగర్భానికి 330 మీటర్ల దిగువన మేఘా ఇంజనీరింగ్ సంస్థ నిర్మించింది. 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ఒక్కొక్కటీ 139 మెగావాట్ల సామర్థ్యంగల 7 మోటార్లలో ఐదింటిని సిద్ధం చేశారు. ఒక్కో మోటారు సుమారు 15 మీటర్ల ఎత్తు, వ్యాసం 22 మీటర్లు, బరువు 2,376 మెట్రిక్ టన్నులు ఉంటుంది. ఈ మోటార్లు 115 మీటర్ల లోతు నుంచి 3,200 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నీటిని ఎత్తిపోస్తాయి. ట్రాన్స్‌ఫార్మర్ బేలు, కంట్రోల్ రూంలు రెండు చొప్పున, బ్యాటరీ రూం, మోటార్ రూమ్ ఒక్కొక్కటి నిర్మించగా, ఎల్‌టీ ప్యానెల్స్, పంప్ ఫ్లోర్, కంప్రెషర్‌లు కలిపి మొత్తం 4 అంతస్తులతో నిర్మించారు. మొత్తం పనిలో 40 శాతం వాటా కింద మోటార్లు, పంపులు, యంత్ర పరికరాలు, విడిభాగాల రూపంలో బీహెచ్ఈఎల్ సరఫరా చేయగా వాటిని ప్యాకేజీ–8 వద్దకు తీసుకొచ్చాక బిగించే 60 శాతం పనిని మేఘా సంస్థ పూర్తి చేసింది. ఈ మోటార్లకు కరెంట్ సరఫరా చేసేందుకు 400 కేవీ విద్యుత్ సబ్ స్టేసన్ ఇప్పటికే సిద్ధమైంది. మోటార్ల వెట్ రన్ పూర్తయ్యాక వచ్చే వారం నుంచే పూర్తిస్థాయి ఎత్తిపోతలు చేపట్టనున్నారు. మోటార్ల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఇక్కడి నుంచి నీటిని మిడ్‌మానేరుకు ఎత్తిపోసే రెండు మోటార్లను స్విచ్ ఆన్ చేయనున్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టులో సిద్ధమైన ప్యాకేజీ-8 టన్నెల్ వ్యవస్థ



ప్యాకేజీ-8 సర్జ్‌పూల్‌లో నీటి మట్టాలను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీధర్





## అరవైలో ఇరవై!



అరవయ్యేళ్లు దాటితే చాలు కృష్ణా రామా అనుకుంటూ మూలన కూర్చొనే వయసు వచ్చిందనుకుంటాం. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 65 ఏళ్ల వయసు మీద పడినా ఇంకా యుక్త వయసులో ఉన్నట్టే లెక్క. ఒకప్పుడు అంటే 18వ శతాబ్దంలో 50 ఏళ్ల వయసొస్తే.. వృద్ధులు అనే వారు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం తర్వాత 60 ఏళ్ల వయసు వస్తే వృద్ధులుగానే పరిగణించాలని చెప్పింది. కానీ సగటు ఆరోగ్య ప్రమాణాలు, జీవన కాల పరిమితి వంటి వాటిని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిగణనలోకి తీసుకొని 65 ఏళ్లు వచ్చినా యువతేనన్న అంచనాకు వచ్చింది. 17 ఏళ్లు వచ్చే వరకు బాలబాలికలు, 18–65 వయసున్న వాళ్లు యువతీయువకులు, 66–79 మధ్య వయసున్న వాళ్లు మధ్య వయస్కులు 80–99 మధ్య వాళ్లు సీనియర్లు, 100 ఏళ్లకు పైగా వయసున్న వారు సంపూర్ణ ఆయువు కలిగిన వారని కొత్త విభజన చేసింది. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, సామాజికంగా పోషించే పాత్ర వంటివన్నీ అంచనా వేసుకుంటే 60 ఏళ్లు పైబడిన వారు కూడా కుర్రోళ్ల మాదిరిగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చింది. అమెరికా, కెనడా వంటి దేశాలు పదవీ విరమణ వయసును 67 ఏళ్లుగా నిర్ణయించాయి. 2013 నాటికి ప్రపంచ జనాభాలో 65 ఏళ్ల వయసు దాటిన వారు 5 శాతం ఉన్నారు. 2050 నాటికి 10 శాతం ఉంటారని అంచనా.

## యూత్ వాయిస్



మన దేశ యువ జనాభాలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశ జనాభాలో సగానికి సగం మంది 25 ఏళ్ల కంటే తక్కువ ఉన్నవారే. 60 కోట్ల మందికి పైగా వారే ఉన్నారు. కానీ వారికి ఉపాధి అవకాశాలే కనిపించట్లేదు. 15–29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 18 శాతం మంది నిరుద్యోగులే. నైపుణ్యం కలిగిన యువతలో కూడా 33 శాతం మందికి ఉద్యోగాల్లేవు. అయినా నిరాశా నిస్పృహలను దరి చేరనీయడం లేదు ఈతరం యువత. ఇటీవల జరిగిన సర్వేలను పరిశీలిస్తే నేటి తరం యువత మనోగతం ఇలా ఉంది. యువతీయువకుల్లో 80 శాతం మంది ఫ్రీలాన్స్ జాబ్స్ చేయాలని అనుకుంటున్నారు. అలా చేస్తే మిగిలిన సమయం తమకు నచ్చిన పని చేసుకోవచ్చనుకుంటున్నారు. 41.5 శాతం మంది తమ భవిష్యత్ ఆనందంగా ఉంటే చాలనుకుంటున్నారు. 30 శాతం మంది ధనవంతులు కావాలని, 23 శాతం మంది డాక్టర్ కావాలని అనుకుంటే, 23 శాతం మంది ఇంజనీరింగ్‌కు ఓటేశారు. 16 శాతం మంది సాఫ్ట్‌వేర్ రంగాన్ని ఏలేయాలని కలలు కంటున్నారు. 31.8 శాతం మంది చదువుతో పాటు ఆయా ఆన్‌లైన్ కోర్సులు చేస్తున్నారు. 72 శాతం విద్యార్థులు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొంటున్నారు.

### క్లుప్తంగా...

### రాహుల్ గాంధీయే కావాలని చెప్పాం: భట్టి



సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీయే కొనసాగాలని టీపీసీసీ తరఫున ఏకగ్రీవంగా తమ అభిప్రాయం తెలిపామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మీడియాకు తెలిపారు. శనివారం ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో మతతత్వ పార్టీలు రాజ్యమేలుతున్న ఈ తరుణంలో రాహుల్ గాంధీ మాత్రమే గట్టి నాయకత్వాన్ని అందించగలరని దక్షిణ జోనల్ కమిటీకి వివరించినట్లు పేర్కొన్నారు. ఏపీసీసీ నేతలంతా రాహుల్ గాంధీయే ఏఐసీసీ అధ్యక్షుడిగా కొనసాగాలని కోరినట్టు ఏపీ నేత శైలజానాథ్ తెలిపారు.

### బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలి

కేంద్ర హోం సహాయ మంత్రిని కోరిన కృష్ణయ్య బృందం



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను 22 నుంచి 52 శాతంగా పెంచే విధంగా పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పెంచిన రిజర్వేషన్ల ప్రకారమే రాబోయే, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోరింది. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బృందం కేంద్ర హోం సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించింది. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా కోతలు పెట్టి తగ్గిస్తున్నారని ఆరోపించారు. బీసీ జనాభా దేశంలో 50 శాతానికి పైగా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో 20 శాతం పెట్టడం న్యాయం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రతీ కులానికి వారి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అలాగే కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలకు ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని కోరారు. సమావేశంలో గుజ్జకృష్ణ, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, భూపేశ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీవి పగటికలలు: కాంగ్రెస్ నేత మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 105 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయి కేవలం 4 ఎంపీ స్థానాల్లో గెలిచిన బీజేపీ ఏదేదో ఊహించుకుంటోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఎద్దేవా చేశారు. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్‌యేనని, బీజేపీవి పగటికలలేనని శనివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన లక్ష్మణ్‌కు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత లేదన్నారు. గాంధీభవన్ మూతపడుతుందని ఆయన అవాకులు, చెవాకులు పేలుతున్నారని, అధికార గర్వంతో ఆ పార్టీ చేస్తున్న కుట్ర రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### దేశానికి కాంగ్రెస్ పార్టీ అవసరమా?: కృష్ణసాగర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ దేశానికి అవసరమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ దేశ ప్రజల వైపు నిలబడకపోతే, వారి అవసరాల కోసం పోరాడకపోతే ఇంకా ఆ పార్టీ ఎందుకు అని, ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దితే కాంగ్రెస్ పార్టీకి ఎందుకింత బాధ కలుగుతోందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ దేశ ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తుందా? లేదా పాకిస్తాన్, చైనాలకు ప్రాతినిథ్యం వహిస్తుందో చెప్పాలని ఒక ప్రకటనలో నిలదీశారు. కశ్మీర్ విషయంలో కాంగ్రెస్ నిర్ణయాలను ఆ పార్టీ సీనియర్ నేత జనార్దన్ ద్వివేది, కరణ్ సింగ్, జోతిరాధిత్య సింధియా బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారని, రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ ఖలిత్.. పార్టీ వైఖరి నచ్చక బీజేపీలో చేరారని తెలిపారు. కాంగ్రెస్ ప్రస్తుతం ఆత్మలేని పార్టీగా మిగిలిపోయిందని పేర్కొన్నారు.

# ఉగ్రవాదుల డేటాబ్యాంక్ రూపకల్పన!

- లైంగిక, సైబర్ నేరస్తుల డేటాబ్యాంక్ కూడా..
- భవిష్యత్తులో వారికి ఉద్యోగాలు, రుణాలు ఇవ్వరు
- పౌరులకు స్మార్ట్ గుర్తింపుకార్డులు అవసరం
- సైబర్ భద్రత సదస్సులో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



శనివారం సైబర్ సెక్యూరిటీ సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వ్యక్తులను ఉగ్రవాదులుగా ప్రకటించే చట్టాన్ని తీసుకొచ్చామని, అలాంటివారి డేటా బ్యాంక్‌ను తయారు చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి (యూఎన్)తో కలసి జాతీయ, అంతర్జాతీయ ఉగ్రవాదుల డేటాబ్యాంక్‌ను రూపొందిస్తామని తెలిపారు. లైంగిక, సైబర్, ఇతర నేరాలకు పాల్పడేవారి డేటాబ్యాంక్‌ను సైతం తయారు చేస్తున్నామని, భవిష్యత్తులో వారికి ఉద్యోగాలు, బ్యాంకు రుణాలు లభించవని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ అనే అంశంపై శనివారం ఇక్కడ జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని పోలీసుస్టేషన్లను ఆన్‌లైన్ ద్వారా అనుసంధానించే ప్రక్రియ 90 శాతం పూర్తి అయిందని, ఏ పోలీసుస్టేషన్‌లో ఎన్ని ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయో ఎక్కడి నుంచైనా చూసుకోవచ్చని అన్నారు. బంగ్లాదేశ్‌సహా ప్రపంచంలోని చాలా దేశాలు తమ పౌరులకు స్మార్ట్ గుర్తింపు కార్డులు జారీ చేశాయని, మనదేశంలో సైతం అలాంటివి జారీ చేస్తే బాగుంటుందని అన్నారు. స్మార్ట్‌కార్డు ద్వారా పౌరుల పూర్తి సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని, అయితే, ఆధార్‌కార్డునే సరిగ్గా అమలు చేయనీయడం లేదని, స్మార్ట్‌కార్డులను తెస్తే అంగీకరించే పరిస్థితులు లేవన్నారు.

**సరిహద్దులకు సైబర్ ఫెన్సింగ్**

దేశ సరిహద్దులకు మానవరహిత రక్షణ కల్పించేందుకు సైబర్ టెక్నాలజీతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామని, ఇండో–పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లో 'హై టెక్నికల్ సర్వైలెన్స్ సిస్టం'ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా భూమి, నీరు, గాలి, భూగర్భంలో నిఘా ఉంచేందుకు వీలు కలుగుతుందని, చొరబాటుదారులను ఏరివేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా చైనా సరిహద్దులో ఏం జరుగుతుందో తామే ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కూర్చొని ప్రత్యక్షంగా చూసుకోవచ్చని పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు వ్యక్తులపై సైబర్ దాడులు జరగకుండా ఐటీ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సైబర్‌నేరాలు పెద్దఎత్తున పెరిగే అవకాశమున్నందున కొత్త చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**మహిళల భద్రతకు పెద్దపీట**

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి వారి కోసం హోంశాఖలో వుమెన్ సేఫ్టీ డివిజన్‌ను ఏర్పాటు చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. మహిళలపై సైబర్ నేరాల నిర్మూలనకు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలను నియంత్రించేందుకు జాతీయస్థాయిలో హిమ్మత్ పేరుతో 112 అత్యవసర కాల్ సదుపాయాన్ని ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కశ్మీర్ ప్రశాంతంగా ఉంది !**

జమ్మూ కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొందని, ప్రజలు రోడ్లమీద స్వేచ్ఛగా తిరుగుతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. కశ్మీర్‌లోని చాలాప్రాంతాల్లో శనివారం కర్ఫ్యూ ఎత్తివేశామని, ప్రజలందరూ సంతోషంగా బక్రీద్, ఇతర పండుగలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సదస్సు అనంతరం కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దుపై పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ హెచ్చరించిన నేపథ్యంలో అంతర్గతంగా, సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. పాకిస్తాన్ చెప్పినంత తేలికగా భారతదేశంలో ఏదైనా చేసే పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 కారణంగా దేశానికి జరుగుతున్న నష్టాన్ని పూరించేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, దీని వల్ల జమ్మూకశ్మీర్‌తోపాటు దేశానికి కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో అక్కడికి పరిశ్రమలు వస్తాయని, స్థానికులకు ఉద్యోగాలొస్తాయన్నారు. ఇక నుంచి అక్కడ భారతీయ చట్టాలు అమలవుతాయని, ఆహార భద్రత, విద్యాహక్కు వంటి చట్టాలతో ప్రజలు లబ్ధిపొందుతారన్నారు.

### జాగ్రత్తగా మాట్లాడండి.. పీఎం హెచ్చరిక

ఎవరి దగ్గర ఏం మాట్లాడినా జాగ్రత్తగా మాట్లాడాలని ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే తమను హెచ్చరిస్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. స్నేహితులే కదా అని వారి వద్ద క్యాజువల్‌గా మాట్లాడినా రికార్డు చేసే అవకాశముండటంతో అప్రమత్తతతో ఉండాల్సి వస్తోందన్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నాయని చెప్పారు.

# భిన్నాభిప్రాయాలకు విలువ లేదు

- దేశంలో పరిస్థితులపై కేటీఆర్ ఆందోళన
- దేశ రాజకీయాలపై పలు సంచలన వ్యాఖ్యలు
- జాతిపితకే గౌరవం లేకుండా పోతోందంటూ ఆవేదన





శనివారం తెలుగు వర్సిటీలో జరిగిన సభలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో చర్చకు, తర్కానికి, విభిన్న అభిప్రాయాలకు, వైరుధ్యాలకు, మిత్ర వైరుధ్యాలకు విలువలేని పరిస్థితి వస్తోందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అఫ్గానిస్తాన్, ఇరాక్‌లపై యుద్ధం ప్రకటించిన జార్జిబుష్ తనతో లేని వారిని వ్యతిరేకులుగానే లెక్కగడతానని ప్రకటించారని, ప్రస్తుతం మనదేశ రాజకీయ పరిస్థితి కూడా అలాగే కనిపిస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నాతో ఉంటే దేశభక్తుడివి.. లేకపోతే దేశ ద్రోహివి'అనే విధానం దేశంలో ఉంది. సెక్యులర్ రాష్ట్రం అంటే మతాన్ని రద్దు చేయడం కాదు'అని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన తెలంగాణ వికాస సమితి మూడో రాష్ట్ర మహా సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**జాతిపితకే గౌరవం లేకపోతే ఎలా..**

నాథూరాం గాడ్సే గొప్ప దేశ భక్తుడంటూ ఎంపీ సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తాను ట్వీట్ చేశానని కేటీఆర్ చెప్పారు. దీనికి వచ్చిన సమాధానాలు అంతకంటే ఎక్కువ బాధ కలిగించాయని చెప్పారు. 'చాలా మంది ఆమెను సమర్థిస్తూ మాట్లాడితే అసలు మనం ఎలా స్పందించాలి.. ఎటు పోతోంది దేశం.. ఎక్కడున్నాం.. జాతిపితనే గౌరవించుకోలేని జాతి ఎటు పోతోంది.. మతం, రాజకీయం, జాతీయవాదం పరస్పరం వీడదియ లేనంతగా పెనవేసుకుపోయాయి. మతం అనేది ఒకరినొకరు గౌరవించుకునే స్థాయి నుంచి ఉన్మాద స్థాయికి ప్రబలితే, మతోన్మాదమే కేంద్రంగా మారితే భవిష్యత్ తరాలకు ఇప్పటి పరిస్థితులు ఉండకపోవచ్చు'అని కేటీఆర్ పేర్కొన్నారు. మతానికి భాష ఉంటుంది.. కానీ భాషకు మతం ఉండదని ప్రొఫెసర్ జయశంకర్ చాలాసార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. పలు అంశాలపై ఢిల్లీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ మీరాచందోక్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్, బేవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాజీ వీసీ సీతారామరావు, ఉన్నత విద్యామండలి సభ్యులు నర్సింహారెడ్డి, సీఎం ఓఎస్డీ, తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామిక వేత్తల సంఘం అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా..

**కేటీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ధ్వజం**



సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దేశ భక్తి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని బీజేపీ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ స్టేట్‌ను విలీనం చేసి దేశానికి ఒక సమగ్ర స్వరూపాన్ని తీసుకొచ్చిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గౌరవించే పరిస్థితిలో లేని టీఆర్‌ఎస్ దేశభక్తి కోసం మాట్లాడడమా అని ప్రశ్నించారు. దేశభక్తులని అనిపించుకోవాలంటే బీజేపీలోనే ఉండాలా అని ఒక సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఓ విలేకరి ప్రస్తావించగా లక్ష్మణ్ పైవిధంగా స్పందించారు. ఎంఐఎం వంటి మతతత్వపార్టీతో టీఆర్‌ఎస్ అంటకాగుతూ బీజేపీ దేశభక్తిని ప్రశ్నిస్తారా అని నిలదీశారు. పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్ శనివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ విషయంలో అటు కేటీఆర్, ఇటు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒకేలా మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం బాట చేపట్టిన సీఎం కేసీఆర్ ప్రజలకు రంగుల కల చూపెడుతున్నారని విమర్శించారు. ఆర్థిక వనరుల నిర్వహణ సరిగ్గా లేక రాష్ట్రం దివాళా తీసిందన్నారు.

### వచ్చేనెల 17న అమిత్‌షా రాక...

సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే బహిరంగ సభకు బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతారని లక్ష్మణ్ చెప్పారు. తన ప్రాథమిక సభ్యత్వం ,క్రియాశీలక సభ్యత్వం తెలంగాణ లోనే తీసుకుంటానని అమిత్‌షా చెప్పారన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఈ నెల 18న తెలంగాణకు వస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలో టీటీడీపీ నేతలు పార్టీలో చేరుతున్నారని, దీంతో ఆ పార్టీ పూర్తిగా బీజేపీలో విలీనం కాబోతోందన్నారు. ఆదివారం జరిగే పార్టీకోర్ కమిటీ సమావేశం అనంతరం తాను జహీరాబాద్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మహబూబ్‌నగర్లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొంటామని చెప్పారు. కాగా జమ్మూ,కశ్మీర్ విభజన, 370 ఆర్టికల్ రద్దు అంశంపై బీజేపీ చర్చకు సిద్ధంగా ఉందని దీనిపై తాము ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసురుతున్నామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి 'ఫర్ సేల్ బోర్డ్ 'పెట్టుకోవడమేనన్నారు.

# మూడు వైపుల నుంచి.. వరద

- కృష్ణా, భీమా, తుంగభద్రల నుంచి దిగువకు ఉధృతంగా ప్రవాహం
- జూరాల వద్ద కృష్ణమ్మ మహోగ్ర రూపం
- 2009 తర్వాత తొలిసారి జూరాలకు 6.1 లక్షల క్యూసెక్కుల వరద
- రోజుకి 57.27 టీఎంసీల నీరు దిగువకు విడుదల
- సాగర్‌లోకి 5.34 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. మరింతగా పెరిగే అవకాశం



శనివారం శ్రీశైలంలో 10 గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

సాక్షి, హైదరాబాద్: ఎగువన కుండపోత వర్షాలు, ఉప్పొంగుతున్న వాగులు, వంకలు, ఉపనదుల్లో పెరుగుతున్న వరద ఉధృతితో కృష్ణానది రోజురోజుకూ మహోగ్ర రూపం దాల్చుతోంది. పదేళ్ల తర్వాత అంతటి స్థాయిలో భీకరంగా ఉరకలెత్తుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలో 15రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి ఏకంగా 6.30 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తోంది. జూరాల దిగువకు 2009 తర్వాత అంతటి స్థాయిలో శనివారం 6.10 లక్షల క్యూసెక్కులు (57.27 టీఎంసీల) మేర ప్రవాహం నమోదైంది. ఓ పక్క ఎగువ కృష్ణా నుంచి, మరోపక్క భీమా, ఇంకోపక్క తుంగభద్ర నుంచి వరద వస్తుండటంతో ఈ ప్రవాహాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు వరద పోటెత్తింది. ఇప్పటికే శ్రీశైలం నిండటంతో 5.34 లక్షల క్యూసెక్కుల మేర నీటిని దిగువ సాగర్‌కు వదులుతున్నారు. వరద ఉధృతి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జల సంఘం అన్ని కృష్ణా పరీవాహక రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

**మూడు నదుల ఉరకలు**

కృష్ణానది జన్మస్థానమైన మహాబలేశ్వర్ పర్వతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎగువ నుంచి ఆల్మట్టి, నారాయణపూర్‌లలోకి భారీగా వరద వస్తోంది. ఈ ప్రాజెక్టులు నిండి ఉండటంతో కేంద్ర జలసంఘం హెచ్చరికల మేరకు ఈ రెండు జలాశయాల నుంచి శనివారం సాయంత్రం నీటి విడుదలను 6.25 లక్షల క్యూసెక్కులకు పెంచారు. కృష్ణానదికి ప్రధాన ఉపనది అయిన భీమాపై మహారాష్ట్రలో నిర్మించిన ఉజ్జయిని ప్రాజెక్టు పూర్తిగా నిండింది. వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తుండటంతో 95 వేల క్యూసెక్కుల నీరు జూరాలకు చేరుతోంది. దీంతో జూరాలకు శనివారం సాయంత్రం 6.10 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. 2009లో గరిష్టంగా జూరాలకు 10 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రాగా, అంతటి స్థాయిలో వరద ఇప్పుడే నమోదైందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి. ఇక జూరాల నుంచి 6.30 లక్షల క్యూసెక్కుల నీటిని శ్రీశైలాన్ని చేరుతున్నాయి. బుధవారం శ్రీశైలం ప్రాజెక్టులోకి 4.49 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా నీటి నిల్వ 215 టీఎంసీలకు గానూ 205 టీఎంసీలకు చేరింది. ఈ వరద ఉధృతి ఆదివారానికి 5.50 లక్షలకు చేరుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 10 గేట్ల ద్వారా 5.65 లక్షల క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. ఇప్పటికే సాగర్‌కు 5.34 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, నిల్వ 312 టీఎంసీలకు గానూ 162 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి వరద మరిన్ని రోజులు కొనసాగే అవకాశాల నేపథ్యంలో ఆదివారం నుంచి సాగర్ కుడి, ఎడమ కాల్వల గేట్లు ఎత్తి వాటి ద్వారా నీటిని ఆంధ్రప్రదేశ్ తాగు, సాగు అవసరాలకు వదలనున్నారు. మరోవైపు.. కృష్ణా ప్రధాన ఉపనది అయిన తుంగభద్రలోనూ వరద రోజురోజుకూ పెరుగుతోంది. తుంగభద్ర జలాశయంలోకి 2.11 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 84 టీఎంసీలకు చేరింది. దీంతో ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి 63,440 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారానికి ఈ వరద జలాలు సుంకేసుల బ్యారేజీకి చేరనున్నాయి. సుంకేసుల బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 1.2 టీఎంసీలే. సుంకేసుల నుంచి తుంగభద్ర వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తారు. ఈ జలాలు కృష్ణా ప్రవాహంతో కలిసి శ్రీశైలాన్ని చేరనున్నాయి. మూడు వైపుల నుంచి శ్రీశైలానికి వరద చేరితే కృష్ణమ్మ మరింత ఉగ్రరూపం దాల్చనుంది. సాగర్‌కు రోజుకి 40 టీఎంసీలకు తగ్గకుండా ప్రవాహాలు కొనసాగే అవకాశాల నేపథ్యంలో ప్రాజెక్టు నాలుగైదు రోజుల్లోనే పూర్తి స్థాయి జలకళను సంతరించుకోనుంది.

**పదేళ్లలో ఇదే ప్రథమం**

పదేళ్లలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 2009–10లో గరిష్టంగా 1,218.55 టీఎంసీల జలాలు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలం జలాశయంలోకి 230 టీఎంసీలకుపైగా వచ్చాయి. వరద ప్రవాహ ఉధృతికి గతంలో ఎన్నడూలేని రీతిలో.. ఆగస్టు 9నే శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడం గమనార్హం. పరీవాహక ప్రాంతంలో ఎగువన జలాశయాలన్నీ నిండుకుండల్లా మారడం.. ఈనెలతో పాటు సెప్టెంబరులోనూ భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటం వల్ల కృష్ణానదిలో ఈ ఏడాది నీటి లభ్యత భారీగా పెరిగే అవకాశం ఉంది.

**గత పదేళ్లలో శ్రీశైలం జలాశయం వద్ద నీటి లభ్యత**

| సంవత్సరం | శ్రీశైలంలోకి వచ్చిన జలాలు (టీఎంసీల్లో) |
|---|---|
| 2009–10 | 1,218.55 |
| 2010–11 | 1,024.54 |
| 2011–12 | 727.26 |
| 2012–13 | 197.53 |
| 2013–14 | 842.77 |
| 2014–15 | 614.05 |
| 2015–16 | 58.56 |
| 2016–17 | 337.95 |
| 2017–18 | 485.48 |
| 2018–19 | 583.68 |
| 2019–20 | 230 |

(ఆగస్టు 10 సాయంత్రం 6 గంటల వరకు)

**కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు**
**(సాయంత్రం 6 గంటలకు విడుదల చేసిన అధికారిక బులెటిన్ ప్రకారం)**
**(నిల్వ టీఎంసీల్లో-ఫ్లో క్యూసెక్కుల్లో)**

| ప్రాజెక్టు | పూర్తి సామర్థ్యం | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 89.29 | 6,00,833 | 5,30,000 |
| నారాయణపూర్ | 37.64 | 26.61 | 6,30,000 | 6,25,200 |
| ఉజ్జయిని | 117.24 | 117.24 | 47,109 | 95,935 |
| జూరాల | 9.65 | 5.9 | 6,10,000 | 6,30,642 |
| తుంగభద్ర | 100.86 | 83.72 | 2,12,625 | 63,440 |
| శ్రీశైలం | 215.81 | 205.22 | 4,49,950 | 5,65,977 |
| నాగార్జునసాగర్ | 312.04 | 159.12 | 5,34,079 | 39,972 |

## ● ఐస్ మ్యాన్




**మనకు తెలీకుండా మంచు ముక్క శరీరానికి తగిలితేనే చటుక్కున ఒళ్లు జలదరిస్తుంది. అలాంటిది ఒంటి మీద అసలేం లేకుండా మెడదాకా మంచుముక్కల్లో మునిగిపోతే ఎంతటి జలదరింత వస్తుందో కదా.. అయినా సరే 2 గంటల 8 నిమిషాల 47 సెకన్లపాటు ఇలా మంచుముక్కల్లో నిల్చొని కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడీ ఐస్‌మ్యాన్. ఇతని పేరు జోసెఫ్ కోబెల్. ఆస్ట్రియా దేశస్తుడైన ఇతను శనివారం వియన్నాలో ఈ సాహసం చేశాడు. ఐస్ క్యూబ్‌ల్లో కూల్‌గా ఉన్నప్పటి ఫొటో ఇది.**

# ఇక కశ్మీర్ వధువులను తెచ్చుకోవచ్చు

- హరియాణా సీఎం ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు



**చండీగఢ్:** తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచే హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు పరిణామాలపై స్పందిస్తూ 'గతంలో బిహార్ నుంచి కోడళ్లను తెచ్చుకునేవారమని, ఇకపై కశ్మీర్ నుంచి అందమైన వధువులను తెచ్చుకోవచ్చు' అంటూ వ్యాఖ్యానించారు. ఫతేబాద్‌లో శనివారం లింగ నిష్పత్తిపై జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు వివాదం కావడంతో, మీడియా తనను అపార్థం చేసుకుందంటూ తను అన్న మాటలను వీడియో ఆధారాలతో ట్విట్టర్‌లో పోస్టు చేశారు. కాగా, హరియాణా ముఖ్యమంత్రివి హేయమైన మాటలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కఠోరమైన ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ కూడా ఆ బలహీన మనస్తత్వం ఉన్న మనిషిపై ప్రభావితం చూపలేకపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ, 'ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఉన్న మహిళలకు కూడా అవమానంగా భావించాలి'అని అన్నారు.



# హజ్ యాత్రలో 20 లక్షలు

**మౌంట్ అరాఫత్:** హజ్ యాత్రలో భాగంగా ఇప్పటివరకూ దాదాపు 20 లక్షల మంది ముస్లింలు సౌదీలోని 'అరాఫత్' కొండను దర్శించుకున్నారని సౌదీ అరేబియా ప్రభుత్వం శనివారం తెలిపింది. ఈ యాత్ర సందర్భంగా ఎలాంటి తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. హజ్ యాత్రలో భాగంగా భక్తులు తొలుత మక్కాను దర్శించి కాబా చుట్టూ ఏడుసార్లు తిరుగుతారు. మరుసటి రోజూ మినా నుంచి అరాఫత్ పర్వతం వద్దకు చేరుకుంటారు. మహమ్మద్ ప్రవక్త తన చివరి ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఇక్కడి నుంచే అందించారు.

# సోనియా ఈజ్ బ్యాక్

- కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక చీఫ్‌గా సోనియా గాంధీ నియామకం
- సీడబ్ల్యూసీలో రోజంతా హైడ్రామా
- రాహుల్ రాజీనామాకు ఆమోదం



శనివారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్‌సింగ్

**న్యూఢిల్లీ:** ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. కాంగ్రెస్ పార్టీలో గత రెండున్నర నెలలుగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. రాహుల్ తర్వాత తదుపరి పార్టీ పగ్గాలు ఎవరు చేపడతారంటూ సాగిన ఊహాగానాలకూ తెరదించుతూ పార్టీ నూతన అధ్యక్షురాలిగా యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ మరోసారి ఎంపికయ్యారు. రాహుల్ రాజీనామా తర్వాత తాత్కాలిక బాధ్యతలు స్వీకరించేందుకు నో చెప్పిన సోనియా ఎట్టకేలకు ఆ బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించారు. తదుపరి చీఫ్‌ను ఎన్నుకునేంత వరకు సోనియా తాత్కాలిక బాధ్యతలు నిర్వర్తిస్తారని సీడబ్ల్యూసీ రాత్రి 11 గంటలకు తీర్మానం చేసింది. ఏఐసీసీ చీఫ్‌ను ఎన్నుకునేందుకు శనివారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీ నాటకీయ పరిణామాల మధ్య ముగిసింది. తొలుత ఉదయం భేటీ అయిన సీడబ్ల్యూసీ (కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ) ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే రాత్రికి వాయిదా పడింది. తర్వాత రెండోసారి రాత్రి 9 గంటల సమయంలో సీడబ్ల్యూసీ భేటీ జరిగింది.

**రాహుల్ రాజీనామా ఆమోదం**

శనివారం రెండోసారి జరిగిన భేటీలో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ చేసిన రాజీనామాను సీడబ్ల్యూసీ ఆమోదించింది. తర్వాత పార్టీ రాజ్యాంగాన్ని అనుసరించి సోనియాను కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక చీఫ్‌గా నియమించింది. సీడబ్ల్యూసీ భేటీ తర్వాత పార్టీ సీనియర్ నేత ఆజాద్ ఈ విషయాన్ని ప్రకటించారు. 2017, డిసెంబర్ 16న కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ బాధ్యతలు స్వీకరించారు. అయితే 2019 లోక్‌సభ ఎన్నికల్లో 52 సీట్లకు పరిమితం కావడంతో మే 25న అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు.

**రాహుల్.. థ్యాంక్యూ: సీడబ్ల్యూసీ**

సీడబ్ల్యూసీ భేటీలో భాగంగా మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించామని కాంగ్రెస్ నేతలు రణ్‌దీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్ తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీకి రాహుల్ అందించిన అద్భుతమైన నాయకత్వానికి సీడబ్ల్యూసీ కృతజ్ఞతలు తెలుపుతోంది. పార్టీని క్రమశిక్షణ, అకింతభావంతో నడిపించారు. తన దూకుడుతో కాంగ్రెస్ యువనాయకత్వానికి రాహుల్ ఆదర్శంగా నిలిచారు. ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్నారు' అని వెల్లడించారు. కశ్మీర్‌లో పరిస్థితిపై, రాజకీయ నేతల నిర్బంధం, మీడియాపై ఆంక్షలను ఖండిస్తూ సీడబ్ల్యూసీలో తీర్మానం చేశామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ప్రతిపక్ష పార్టీల ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

**కశ్మీర్‌పై కేంద్రం స్పందించాలి: రాహుల్**

సీడబ్ల్యూసీ భేటీకి హాజరైన రాహుల్ గాంధీ సమావేశం కొనసాగుతుండగానే మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ..'జమ్మూకశ్మీర్‌లో ఏం జరుగుతుందో బయటపెట్టాల్సిన బాధ్యత ప్రధాని మోదీ, భారత ప్రభుత్వంపై ఉంది. అక్కడ భారీ హింస జరుగుతున్నట్లు, శాంతిభద్రతలు దిగజారుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి' అని తెలిపారు.

**ఐదు సీడబ్ల్యూసీ బృందాల ఏర్పాటు..**

కాంగ్రెస్‌కు పార్టీ నూతన అధ్యక్షుడి నియామకం విషయమై చర్చించేందుకు పార్టీ ముఖ్యనేతలు మన్మోహన్, ప్రియాంక, అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, ఆజాద్, చిదంబరం తదితరులు శనివారం ఉదయం 11 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. దేశవ్యాప్తంగా ఉండే కాంగ్రెస్ శ్రేణులతో సంప్రదింపులు జరిపాకే తుది నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ భేటీలో అంగీకరించారు. ఇందుకోసం ఈశాన్య, తూర్పు, ఉత్తర, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఐదు సీడబ్ల్యూసీ బృందాలను నియమించారు. ఈశాన్య సీడబ్ల్యూసీ బృందంలో అహ్మద్ పటేల్, అంబికాసోనీ, మాజీ సీఎం హరీశ్‌రావత్ ఉండగా, తూర్పు సీడబ్ల్యూసీ గ్రూపులో వేణుగోపాల్, అస్సాం మాజీ సీఎం తరుణ్ గొగోయ్, కుమారి సెల్జా సభ్యులుగా ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాల బృందంలో ప్రియాంక, జ్యోతిరాదిత్య సింధియా, చిదంబరం ఉండగా, పశ్చిమ రాష్ట్రాల సీడబ్ల్యూసీ గ్రూపులో ఆజాద్, ఖర్గే, ఆంటోనీ, మోతీలాల్ వోరా ఉన్నారు. అలాగే దక్షిణ రాష్ట్రాల బృందంలో మన్మోహన్, ఆనంద్ శర్మ, ముకుల్ వాస్నిక్ సభ్యులుగా ఉన్నారు. ఈ సీడబ్ల్యూసీ బృందాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ రాష్ట్రాల అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంప్రదింపులు జరిపాయి.

**మెజారిటీ నేతలు మద్దతిచ్చినా..**

ఈ సందర్భంగా మెజారిటీ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలు రాహుల్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని కోరినట్లు సమాచారం. కొంతమంది నేతలు మాత్రం ప్రియాంక పేరును ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీయే పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని ఏపీ కాంగ్రెస్ నేత శైలజానాథ్, తెలంగాణ తరపున ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టివిక్రమార్క, రేవంత్ రెడ్డిలు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని సీడబ్ల్యూసీ బృందాన్ని కోరారు. ఈ విజ్ఞప్తిని రాహుల్ తిరస్కరించారు.

### సంప్రదింపులకు మేం దూరం: సోనియాగాంధీ

గాంధీయేతర కుటుంబానికి చెందిన వ్యక్తే ఈసారి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపడతారని రాహుల్ గాంధీ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రియాంక అధ్యక్ష బాధ్యతలు చేపడతారన్న వాదనలకు తెరపడింది. నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియకు తాము దూరంగా ఉంటామని సోనియాగాంధీ తెలిపారు. సీడబ్ల్యూసీ భేటీకి ముందు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'నేను, రాహుల్ గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేశాం. కాబట్టి శనివారం జరిగే సీడబ్ల్యూసీ సంప్రదింపుల సమావేశాలకు హాజరై పార్టీ నేతల అభిప్రాయాలను ప్రభావితం చేయాలనుకోవడం లేదు. అందుకే ఈ అధ్యక్ష ఎంపిక ప్రక్రియలో మేం పాల్గొనడం లేదు' అని స్పష్టం చేశారు. సంప్రదింపుల బృందాల్లో తమ పేర్లను పొరపాటున చేర్చిఉంటారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు. ఈ ఏడాదిలోనే మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున అధ్యక్షుడిని ఎంత త్వరగా ఎంపిక చేస్తే అంత మంచిదని పార్టీ హైకమాండ్‌కు నేతలు సూచించినట్లు పేర్కొన్నాయి.

### సోనియా... శక్తిమంతమైన మహిళ

**అసలు పేరు:** సోనియా మైనీ
**తల్లిదండ్రులు:** స్టెఫానో మైనీ, పౌలా ప్రిడెబాన్
**జననం:** డిసెంబర్ 9, 1946 ( ఇటలీలో)
**ఉన్నత విద్యాభ్యాసం:** కేంబ్రిడ్జి, బ్రిటన్
**పెళ్లి:** 1968లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో
**సంతానం:** రాహుల్, ప్రియాంక

1991లో రాజీవ్ గాంధీ ఎల్టీటీఈ తీవ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మరణించారు. అనంతరం జరిగిన వివిధ పరిణామాల నేపథ్యంలో 1997లో ఆమె రాజకీయ ప్రవేశం చేశారు. 1998లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా గాంధీ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 ఏళ్ల పాటు కొనసాగి, 2017లో కొడుకు రాహుల్ గాంధీకి పార్టీ పగ్గాలు అప్పగించారు. ఆరోగ్య సమస్యలతో గత కొంతకాలంగా ఆమె క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండగా పార్టీకి చెందిన ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ (2004–2014) రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. 1999లో అమేథీ నుంచి, ఆ తర్వాత రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా ఉన్నారు. ఆమె ప్రత్యక్షంగా ఏ ప్రభుత్వ హోదాలో లేనప్పటికీ దేశంలోనే కాదు, ప్రపంచంలోనే శక్తిమంతమైన మహిళల్లో ఒకరిగా పేరుతెచ్చుకున్నారు.

### మయన్మార్‌లో విరిగిపడిన కొండచరియలు

**మావ్లమయిన్ (మయన్మార్):** తూర్పు మయన్మార్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో 34 మంది మృతి చెందారు. ఇప్పటి వరకూ 47 మంది గాయపడ్డారని, 80 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బురద కింద కూరుకుపోయిన మృతదేహాలను అత్యవసర విభాగ బృందాలు వెలికి తీస్తున్నాయి. యే ప్యార్ కోనే గ్రామంలో వరద బురద రావడంతో 16 ఇళ్లు కొట్టుకుపోయాయి. ఈ వరదలో మునిగిపోయిన వారిని యంత్రాల సహాయంతో బయటకు తీస్తున్నామని అధికారులు తెలిపారు.

### పార్లమెంట్‌కు కొత్త భవనం అవసరం: స్పీకర్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌కు కొత్త భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అభిప్రాయపడ్డారు. ఈ విషయానికి సంబంధించి పార్లమెంట్ సభ్యులు సహా పలువురి అభిప్రాయాలను తీసుకున్నామని చెప్పారు. దీనికి సంబంధించిన అంశం పరిశీలనలో ఉందని.. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ భవనాన్ని ఆధునీకరించవచ్చని తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. 'న్యూ ఇండియా'సంస్కరణల్లో భాగంగా పార్లమెంట్ భవనం విస్తరణ, ఆధునీకరణ చేపట్టాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు అత్యద్భుతమైన పార్లమెంట్ భవనం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లోక్‌సభ కొనసాగింపు సమావేశాల్లో సభ ఒక్కసారి కూడా వాయిదా పడలేదని ఆయన వెల్లడించారు. ఫలితంగా సభకు కేటాయించిన సమయం కంటే 72 గంటలపాటు అధికంగా జరిగిందని చెప్పారు.

# కశ్మీర్‌పై భారత్‌కు రష్యా మద్దతు

**మాస్కో/న్యూఢిల్లీ/ఇస్లామాబాద్:** కశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలకు రష్యా మద్దతు ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి రద్దు, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం వంటివి భారత రాజ్యాంగానికి లోబడే జరిగాయని స్పష్టం చేసింది. భారత్, పాక్‌ల మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి రావాలని కోరుతున్నాం. ఇందుకోసం రెండు దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను సిమ్లా ఒప్పందం, లాహోర్ ప్రకటనపాతిపదికన రాజకీయంగా, దౌత్యపరంగా పరిష్కరించుకుంటాయని ఆశిస్తున్నాం' అని రష్యా విదేశాంగ శాఖ తెలిపింది.

**నేవీలో హై అలర్ట్**

భారత నేవీలో శనివారం హై అలర్ట్ ప్రకటించారు. ఎలాంటి సముద్ర దాడులనైనా సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తాము అప్రమత్తంగా ఉన్నట్లు నావికాదళం తెలిపింది. 'తీర ప్రాంత భద్రతా చర్యలు వేగవంతమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ చర్యలు జరగకుండా ఉండేందుకు భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నాయి'అని నావికాదళ సిబ్బంది డిప్యూటీ చీఫ్ మురళీధర్ పవార్ వెల్లడించారు. 'సముందరి జిహాద్'పేరుతో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు సముద్రంలో దాడులు చేసేందుకు తమ కేడర్‌కు శిక్షణ ఇస్తున్నట్లు విశ్వసనీయంగా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో అన్ని నేవీ స్టేషన్లలో హై అలర్ట్ విధించారు.



ఐదు రోజుల తర్వాత స్కూళ్లు తెరవడంతో జమ్మూలో స్కూల్ బాటపట్టిన విద్యార్థులు

**లాహోర్–ఢిల్లీ బస్ సర్వీసులు నిలిపివేత**

లాహోర్–ఢిల్లీల మధ్య నడుస్తున్న బస్ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు పాక్ ప్రకటించింది. జాతీయ భద్రతా సంఘం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచార, పోస్టు సేవల మంత్రి మురద్ సయీద్ అన్నారు. కరాచీ నుంచి వచ్చే థార్ ఎక్స్‌ప్రెస్ 165 మంది ప్రయాణికులతో శనివారం భారత్ సరిహద్దుకు చేరుకుంది. అక్కడి నుంచి మరో లింకు రైలు ద్వారా ప్రయాణికులను భారత్ తీసుకొచ్చారు. దీనికి ముందు ఈ రైలును సరిహద్దు వరకు తీసుకురావడానికి పాక్ అనుమతించింది.

# 370 రద్దుపై ఎన్‌సీ సవాల్

కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ అమలును ఆపాలని సుప్రీంలో పిటిషన్



**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌కు ఉన్న రాజ్యాంగబద్ధ హోదాను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర పౌరుల సమ్మతి లేకుండానే వారి హక్కులను కేంద్రం లాగేసుకుందని పేర్కొంది. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన చట్టం అమలు కాకుండా చూడాలని ఎన్‌సీకి చెందిన ఎంపీలు మహమ్మద్ అక్బర్ లోనె, హస్నైన్ మసూదీ తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. 'కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ శాశ్వతమైంది. కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2019, రాష్ట్రపతి ఉత్తర్వుల ఫలితంగా ఆర్టికల్ 370, 35ఏ రద్దయ్యాయి. రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి ప్రజల హక్కులను కాలరాశారు. కేంద్ర ప్రభుత్వం చర్యలు రాజ్యాంగవిరుద్ధం. భారత సమాఖ్య వ్యవస్థ, ప్రజాస్వామ్యం, చట్ట పాలనకు సంరక్షకుడిగా ఉన్న సుప్రీంకోర్టు ఈ విషయమై స్పందించాలి. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాలను అమలు కాకుండా రద్దు చేయాలి' అని కోరారు.

**మీడియాపై ఆంక్షలను ఎత్తివేయాలి**

జమ్మూకశ్మీర్‌లో మీడియాపై కొనసాగుతున్న ఆంక్షలను ఎత్తివేయాలంటూ కశ్మీర్ టైమ్స్ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఆగస్టు 4వ తేదీ నుంచి కొనసాగుతున్న నియంత్రణల కారణంగా కశ్మీర్‌తో పాటు జమ్మూలోని కొన్ని జిల్లాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయన్నారు.

### చైనాలో భారీ తుపాను

**బీజింగ్:** చైనాను భారీ తుపాను వణికించింది. తుపాను ధాటికి 18 మంది మృతిచెందగా, మరో 14 మంది గల్లంతయ్యారు. లెకీమాగా వ్యవహరిస్తున్న ఈ తుపాను గాలులు, గంటకు 187 కిలోమీటర్ల వేగంతో విరుచుకుపడడంతో రెడ్ అలర్ట్ జారీ చేశారు. జెజింగ్ ప్రావిన్స్‌లో ఈ గాలి తుపాను ధాటికి కొండ చరియలు విరిగి పక్కనే ఉన్న నదిలో పడ్డాయి. దీంతో నది మట్టం పది నిమిషాల్లోనే పది అడుగులకు పెరిగింది. దీంతో నదీ తీరం వెంట ఉన్న 120 గ్రామాలను నీరు ముంచెత్తిందని జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. పోలీసులు, ప్రజారక్షణ అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ తుపాను ధాటికి 500లకు పైగా విమానాలు రద్దయ్యాయి.



అగ్నికి ఆహుతైన ట్యాంకర్, వాహనాలు

# ట్యాంకర్ పేలి 62 మంది మృతి

టాంజానియాలో ఘటన

**దార్ ఎస్ సలామ్ (టాంజానియా):** తూర్పు ఆఫ్రికా దేశమైన టాంజానియాలో ఆయిల్ ట్యాంకర్ పేలింది. ఈ దుర్ఘటనలో 62 మంది ప్రాణాలు కోల్పోయారు. శనివారం మొరోగొరో పట్టణంలో ఆయిల్‌ను వెలికితీయడానికి కొందరు వ్యక్తులు ఓ ఆయిల్ ట్యాంకర్ చుట్టూ చేరారు. ఆ ట్యాంకర్ అప్పటికే శిథిలావస్థలో ఉండడంతో పేలుడుకు గురైంది. ఈ ఘటనలో 62 మంది మరణించగా, 70 మంది గాయపడ్డారని స్థానిక పోలీస్ కమిషనర్ స్టీవెన్ కాబ్వే తెలిపారు. ఆయిల్ ట్యాంకర్ల నుంచి అక్రమంగా ఆయిల్‌ను దొంగిలించడం ఈ దేశంలో సాధారణంగా జరిగే విషయమే. 2013లో సైతం ఇలాంటి పేలుడులో 29 మంది మృతిచెందారు. ట్యాంకర్లనుంచి ఆయిల్‌ను తీసేటపుడు జరిగే పేలుళ్ల గురించి అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని రోడ్డు భద్రతా నిపుణుడు హెన్రీ బంటు అన్నారు.

# అమెరికా వ్యాపారి జైలులో ఆత్మహత్య

ట్రంప్ వంటి ప్రముఖులతో సంబంధాలు



**న్యూయార్క్:** బాలికల విక్రయం, వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారి జెఫ్రీ ఎప్‌స్టీన్(66) జైలులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. బాలికలను, ముఖ్యంగా 14 ఏళ్లలోపు వారిని విక్రయిస్తున్నాడన్న ఆరోపణలపై అతడు ప్రస్తుతం మన్‌హట్టన్‌లోని మెట్రోపాలిటన్ కరెక్షనల్ జైలులో ఉన్నాడు. ఎప్‌స్టీన్ గతంలో ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు క్లింటన్, బ్రిటన్ యువరాజు ఆండ్రూ వంటి పలువురు రాజకీయనేతలు, సెలబ్రిటీలతో సన్నిహిత సంబంధాలు సాగించేవాడు. మన్‌హట్టన్, పామ్‌బీచ్‌లలోని తన నివాసాల్లో 2002–2005 మధ్య టీనేజీ బాలికలను వాడుకోవడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. ఆరోపణలు రుజువైతే 45 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది.

### ఎన్‌టీపీసీ లాభం రూ.2,840 కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ, ఎన్‌టీపీసీ ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) తొలి త్రైమాసిక కాలంలో రూ.2,849 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం, రూ. 2,689 కోట్లుతో పోల్చితే 6 శాతం వృద్ధి సాధించామని తెలిపింది. మొత్తం ఆదాయం రూ.24,149 కోట్ల నుంచి రూ.26,272 కోట్లకు పెరిగిందని పేర్కొంది. గత క్యూ1లో 76.92 బిలియన్ యూనిట్లుగా ఉన్న మొత్తం విద్యుదుత్పత్తి ఈ క్యూ1లో 76.63 బిలియన్ యూనిట్లకు తగ్గిందని తెలిపింది. సగటు టారిఫ్ ఒక్కో యూనిట్‌కు రూ.3.63గా ఉందని వివరించింది. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల పీఎల్‌ఎఫ్(ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) 77.98 శాతం నుంచి 73.91 శాతానికి తగ్గిందని ఎన్‌టీపీసీ తెలిపింది.

# వరద విలయం

- ఐదు రాష్ట్రాల్లో మృతులు: 119.. కేరళలో అత్యధికంగా 57 మంది
- ఆగని వర్షాలతో సహాయక చర్యలకు అంతరాయం

**చెన్నై/తిరువనంతపురం/బెంగళూరు/ముంబై:** వారం రోజులుగా కురుస్తున్న వానలతో దక్షిణాది కేరళ, కర్ణాటక, తమిళనాడుతోపాటు మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ ఐదు రాష్ట్రాల్లో 119 మంది ప్రాణాలు కోల్పోయారు. వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో కేరళలో అత్యధికంగా 57 మంది, కర్ణాటకలో 26 మంది చనిపోయారు. గుజరాత్‌లో భారీ వర్షాల కారణంగా 19 మంది, మహారాష్ట్రలో 12 మంది మృతి చెందారు. 11న కేరళలోని వయనాడ్‌లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ తెలిపారు.

**రెండు జిల్లాలపై తీవ్ర ప్రభావం**

భారీ వర్షాలతో కేరళలోని 8 జిల్లాలు ముఖ్యంగా వయనాడ్, కోజికోడ్ జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో వర్షం సంబంధిత ఘటనల్లో ఇప్పటి వరకు 57 మంది మృతి చెందారని యంత్రాంగం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం సహాయక శిబిరాలకు తరలించిన 1.25 లక్షల మందిలో వయనాడ్, కోజికోడ్ జిల్లాల వారే 50 వేల మంది వరకు ఉన్నారు. మలప్పురం జిల్లా కవలప్పర వయనాడ్ జిల్లా పుత్తుమల కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కుకుని ఉంటారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో వర్షం ఉధృతి కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. వయనాడ్ జిల్లాలోని బనసురసాగర్ డ్యాం నిండటంతో నాలుగు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. దేశంలో మొదటిది, ఆసియాలోనే రెండో పెద్దది ఎర్త్‌డ్యామ్ బనసురసాగర్. కొచ్చి విమానాశ్రయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలకు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 23 రైళ్లను పూర్తిగా లేదా పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది.



మహారాష్ట్రలోని సాంగ్లీలో హెలికాప్టర్ ద్వారా వరద బాధితుల తరలింపు



కేరళలోని కోజికోడ్‌లో పగిలిన వాటర్ ట్యాంక్‌ను ఆసరాగా చేసుకుని..

**వరదలో చిక్కుకున్న మాజీ ఎంపీ కుటుంబం**

కర్ణాటకలోనూ వానలు, వరద తీవ్రత కొనసాగుతోంది. వివిధ ఘటనల్లో రాష్ట్రంలో 26 మంది ప్రాణాలు కోల్పోగా 2.35 లక్షల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. దక్షిణ కన్నడ జిల్లా బంట్వాల్‌లో కేంద్ర మాజీ మంత్రి జనార్ధన్ పుజారి నివాసం వరదల్లో చిక్కుకుంది. దీంతో అధికారులు ఆయనతోపాటు కుటుంబసభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తమిళనాడులోని నీలగిరి జిల్లాలోని అవలాంచిలో గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన కుంభవృష్టితో కొండ, అటవీప్రాంతాల్లో చిక్కుకుపోయిన ఇద్దరు శిశువులు సహా 11 మందిని వైమానిక దళం సురక్షిత ప్రాంతాలకు తరలించింది.గుజరాత్‌లో వర్షాల కారణంగా చోటుచేసుకున్న ఘటనల్లో ఇప్పటివరకు 19 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి విజయ్ రుపానీ తెలిపారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి శు.ఏకాదశి ప.12.53 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం మూల రా.3.07 వరకు, తదుపరి పూర్వాషాఢ వర్జ్యం ఉ.10.42 నుంచి 12.20 వరకు, తిరిగి రా.1.28 నుంచి 3.06 వరకు, దుర్ముహూర్తం సా.4.43 నుంచి 5.34 వరకు అమృతఘడియలు..రా.8.33 నుంచి 10.11 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.26
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాహుల్ గాంధీ

## రాయని డైరీ

**మాధవ్ శింగరాజు**

ఆర్టికల్ 370 రద్దు మీద స్టేట్‌మెంట్ రిలీజ్ చెయ్యడానికి అంతా కూర్చొని ఉన్నాం. గులామ్ నబీ ఆజాద్, పి.చిదంబరం ఆర్టికల్ 370 హిస్టరీ గురించి చెప్పారు.

'త్రీసెవెంటీ హిస్టరీ మాకు తెలుసు. ప్రెజెంట్ ఏమిటో చెప్పండి' అన్నారు పంజాబ్ స్టేట్ చీఫ్ సునీల్ జాఖడ్.

ఆజాద్ ఆయన వైపు అసహనంగా చూసి, 'మీరు ప్రెజెంట్‌లోనే ఉన్నారా?' అని అడిగారు.

'ప్రెజెంట్‌లోనే ఉన్నాను. ఎట్ ప్రెజెంట్ కాంగ్రెస్‌లోనే ఉన్నాను. చెప్పండి. మీరేం చెబితే అది వినాలని ఉంది' అన్నారు జాఖడ్.

ఆజాద్‌ని ఆగమన్నట్లు చూసి...

'నేను చెప్పొచ్చా జాఖడ్‌జీ ప్రెజెంట్ ఏమిటో..' అన్నారు చిదంబరం.

'ఎవరు చెప్తే ఏంటి? చెప్పాల్సింది చెప్పాలి గానీ' అన్నట్లు చూశారు జాఖడ్.

'త్రీసెవెంటీకి ప్రెజెంట్ లేదు. కశ్మీర్‌కు ఫ్యూచర్ లేదు' అని చెప్పారు చిదంబరం.

'నేనడిగింది త్రీసెవెంటీ ప్రెజెంటూ, కశ్మీర్ ఫ్యూచరూ కాదు. మన పార్టీ ప్రెజెంట్ ఏమిటని! మన ప్రెజెంట్ ఏమిటో తెలిస్తే, మన ఫ్యూచర్ ఏంటో కూడా తెలుస్తుంది' అన్నారు జాఖడ్. ఆయనెందుకో సమావేశం మొదలైనప్పట్నుంచీ ఉత్సాహలేమితో బాధపడుతున్నారు. ఆజాద్‌కి ముందే చెప్పాను. 'సీడబ్ల్యూసీ సమావేశాన్ని నలుగురైదుగురితో కానిచ్చేద్దాం. స్టేట్ ప్రెసిడెంట్‌లు, జనరల్ సెక్రటరీలు వద్దు' అని. 'వాళ్లందర్నీ కలుపుకుంటేనే నలుగురైదుగురు అవుతున్నారు రాహుల్‌జీ' అన్నారు ఆయన!

'త్రీసెవెంటీపై మన స్టాండ్ ఏమిటో ఆల్రెడీ పార్లమెంటులో చెప్పేశాం కదా. పార్లమెంటులో చెప్పాక కూడా, మళ్లీ మనకి మనం మన స్టాండ్ ఏమిటో చెప్పుకోవడం ఏమిటి? చెప్పుకోడానికి ఈ మీటింగ్ ఏమిటి?" అన్నారు జాఖడ్.



ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, వేణుగోపాల్.. జాఖడ్ వైపు చూశారు. ఆ చూడ్డం నిశితంగా, పరిశీలనగా ఉంది. అంత నిశితంగా ఏం పరిశీలిస్తున్నారు జాఖడ్‌లో! జాఖడ్‌ని చూశాక నా వైపు చూశారు. కాంగ్రెస్‌కు ఎట్టకేలకు ఒక కొత్త అధ్యక్షుడు దొరికాడు అన్నట్లుగా ఉంది వారి చూపు!

కాంగ్రెస్‌లో ప్రశ్నించినవాళ్లు పాత అధ్యక్షులు అయినట్లు గుర్తుంది కానీ, కొత్త అధ్యక్షులు అయినట్లు గుర్తు లేదు మరి!

'పార్లమెంట్‌లో మన స్టాండ్ ఏమిటన్నది అందరికీ తెలిసిందే జాఖడ్. పార్టీలోని వారికే పార్టీ స్టాండ్ ఏమిటో తెలియాలి. అందుకే ఈ మీటింగ్. మనలోనే కొందరు త్రీసెవెంటీ రద్దును సమర్థిస్తున్నారు. మిగతా కొందరు ఆ సమర్థించే వాళ్లను సమర్థిస్తూ, రద్దును మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఒక పార్టీలో ఉన్నవాళ్లంతా ఒక స్టాండ్ మీద లేకపోతే ఇలాంటి చిన్న చిన్న మీటింగులు తప్పవు' అన్నారు ఆంటోనీ.

జాఖడ్ ప్రశ్నించడం మానలేదు. ప్రశ్నించాలనుకున్న వారందరి ప్రతినిధిగా ఆయన సీడబ్ల్యూసీ సమావేశానికి వచ్చినట్లున్నారు.

"ఇప్పడీ త్రీసెవంటీ సమావేశం తర్వాత మన రిలీజ్ చెయ్యబోయే స్టేట్‌మెంట్.. పార్టీలో అంతా ఒకే మాట మీద ఉండాలనా, పార్టీలో ఎవరి అభిప్రాయం వాళ్లకు ఉన్నా పర్వా లేదనా?" అని అడిగారు జాఖడ్.

'ఎవరికి వారిగా ఉంటూనే అందరూ ఒకే పార్టీగా ఉండాలని రాహుల్ బాబు ఆశిస్తున్నారు' అని, నా వైపు చూశారు అహ్మద్ పటేల్. ఆయనతో నేనెప్పుడు ఆ మాట అన్నానో నాకు గుర్తుకు రావడం లేదు!

"ఎవరికి వాళ్లుగా ఉండేవాళ్లు ఒకే పార్టీగా గానీ, ఒకే పార్టీలో గానీ ఎందుకు ఉంటారు పటేల్‌జీ? కన్‌ఫ్యూజన్‌లో బీజేపీలోకి వెళ్లిపోతారు" అన్నారు జాఖడ్.

పార్టీలో డెమొక్రసీ కన్నా కన్‌ఫ్యూజన్ ఎక్కువైనట్లుంది! కొత్త అధ్యక్షుడు బాధ్యతలు తీసుకోగానే పార్టీకి డెమొక్రసీ అవసరమా, కన్‌ఫ్యూజన్ అవసరమా అనే దానిపై తొలి సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేయించాలి.

# ఒక కశ్మీర్... రెండు సందర్భాలు

జనతంత్రం



వర్దెల్లి మురళి



### కశ్మీర్ కథ

శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో చెప్పే కథను అనేక మార్లు విని ఉన్నప్పటికీ వ్రతం చేసిన ప్రతిసారి విని తీరాలన్న నియమం ఉంది. అలాగే ఒక సందర్భాన్ని విశ్లేషించడానికి ముందు దాని పూర్వరంగాన్ని ప్రస్తావించడం కూడా ఒక వ్రత నియమం లాంటిదే. 'దేజావూ' అనే ఒకరకమైన భ్రాంతికి లోనుకాకుండా ఉండేందుకు 'కట్టె–కొట్టె–తెచ్చె' అనే సిద్ధాంతాన్ని అనుసరించి కశ్మీర్ భౌగోళిక, చారిత్రక అంశాలను రేఖామాత్రంగా గుర్తు చేసుకుందాము. భారతదేశ చిత్రపటంలో మకుటాయమానంగా కనిపించే ప్రాంతమే జమ్మూ–కశ్మీర్. ఇందులో దాదాపుగా సగం ప్రదేశం పాకిస్తాన్, చైనాల ఆక్రమణలో ఉంది. వారి ఆక్రమణను భారత దేశం అధికారికంగా గుర్తించదు కనుక మనం ముద్రించే పటాల్లో మొత్తం జమ్మూ–కశ్మీర్ మన దేశంగానే కనిపిస్తుంది. ఈ రాష్ట్రాన్ని నిలువునా తూర్పు–పడమరలుగా విభజిస్తే తూర్పు ప్రాంతమంతా లదాఖ్. దీనికి తూర్పున టిబెట్ ఉంటుంది. లదాఖ్ పైభాగంలో ఉండే సియాచిన్ ప్రాంతాన్ని చైనా ఆక్రమించుకుంది. పడమటి ప్రాంతంలో కొమ్ములాగా వాయువ్యం వైపు విస్తరించిన ప్రాంతమంతా గిల్గిట్–బాల్టిస్తాన్. కారాకోరం, పామిర్, హిందూకుశ్ పర్వత శ్రేణులు విస్తరించిన ప్రాంతం. గిల్గిట్‌కు దక్షిణంగా ఉన్న లోయ కశ్మీర్. దానికి దిగువన ఉండే ప్రాంతం జమ్మూ. గిల్గిట్‌లోనూ, కశ్మీర్‌లోనూ ఉన్నది ప్రధానంగా ముస్లిం మతస్తులే అయినా, వారి మధ్యన చాలా తేడాలున్నాయి. భాషాపరంగా, సాంస్కృతిక పరంగా ఏ మాత్రం సాపత్యం కుదరని భిన్న జాతులు అవి. గిల్గిట్–బాల్టిస్తాన్‌లోని తుర్కీ ఛాయలున్న గిరిజన తెగల వారు సెంట్రల్ ఏషియా దేశాల ఆచార వ్యవహారాలకు దగ్గరగా ఉంటారు. బాల్టిస్తాన్ ఉత్తర దిక్కున ట్రాన్స్‌కారాకోరం జమీన్‌ను చైనాకు పాకిస్తాన్ కట్టబెట్టింది. దీనిని 'షాక్సగమ్' అని పిలుస్తారు. ఇక్కడ గమనించదగిన అత్యంత కీలక విషయం ఒకటి ఉంది. ప్రాచీన కాలం నుంచి భారతదేశానికి, సెంట్రల్ ఏషియా దేశాలకు మధ్య రహదారిలా ఉండిన కారాకోరం కనుమ మార్గం ఈ షాక్సగమ్ అధీనంలో ఉంటుంది. వందల ఏళ్ల నాటి చైనా–యూరప్ సిల్క్‌రోడ్డు కూడా దీనికి చేరువలో ఉంటుంది. కశ్మీర్ ప్రజలు సహజంగా మర్యాదస్తులు. మతసహనం ఎక్కువగా ఉన్నవారు. శివాలయాలు ఎక్కువగా ఉన్న కశ్మీర్ లోయలో శైవం ప్రభావం కూడా ఎక్కువే ఉంది. బౌద్ధ ప్రబోధాలు, సూఫీ బోధనల ప్రభావం కూడా కశ్మీర్ ముస్లింలపై ఉంది. కశ్మీర్ ప్రజల సంస్కృతిని, జీవనవిధానాన్ని 'కశ్మీరియత్' అని పిలుస్తారు. కశ్మీరత్వం అనేది వారి ఆత్మ లాంటిది. పర్యాటక రంగం ఎక్కువ కనుక ఆతిథ్య స్వభావం వారి రక్తంలోనే ఉంది. కశ్మీర్ లోయకు దక్షిణ ప్రాంతమైన జమ్మూలో హిందువుల సంఖ్య అధికం. చైనా ఆక్రమించిన ఆక్సాయిచిన్ పోగా మిగిలిన లదాఖ్ రెండు భాగాలు. కార్గిల్ డివిజన్‌లో ముస్లిం జనాభా ఎక్కువ. లేహ్ డివిజన్‌లో బౌద్ధులు ఎక్కువ. పలుచగా హిందువులు కూడా ఉంటారు. మొత్తంగా 40 శాతం బౌద్ధ మతస్తులున్న ఏకైక భౌగోళిక యూనిట్ దేశంలో లదాఖ్ మాత్రమే. వేరువేరు భాషలూ, సంస్కృతులూ, విభిన్నమైన భౌగోళిక స్వరూపాలున్న ఈ ప్రాంతాలన్నీ కలిపి ఒక రాష్ట్రంగా ఎలా ఉన్నాయి? పంజాబ్ పాలకుడైన మహారాజా రంజిత్‌సింగ్ స్థాపించిన సువిశాల సిక్కు సామ్రాజ్యంలో ఒకప్పుడు ఇవన్నీ భాగంగా ఉండేవి. కశ్మీర్ ప్రాంతాన్ని డోగ్రా రాజవంశీకులు సామంతులుగా పాలించేవారు. తర్వాత కాలంలో ఆంగ్లేయులతో జరిగిన యుద్ధంలో సిక్కు సామ్రాజ్యం పతనమైంది. ఇంగ్లీషు వాళ్లకు అప్పటి కశ్మీర్ పాలకుడైన గులాబ్‌సింగ్ పెద్ద మొత్తంలో ముడుపులు సమర్పించుకుని, గిల్గిట్, లదాఖ్, జమ్మూ ప్రాంతాలను తన రాజ్యంలో కలిపే సుకున్నాడు. గులాబ్‌సింగ్ విశ్వాస పాత్రతను మెచ్చిన బ్రిటిష్ వాళ్లు ఒక స్వతంత్ర రాజ్యంగా జమ్మూ–కశ్మీర్‌ను కొనసాగనిచ్చారు.

### సందర్భం 1:

గులాబ్‌సింగ్ వారసుడే రాజాహరిసింగ్. దేశ విభజన నాటి జమ్మూ–కశ్మీర్ పాలకుడు. విభజన సమయంలో స్వతంత్ర రాజ్యంగానే జమ్మూ–కశ్మీర్ ఉండాలనేది రాజా హరిసింగ్ ఆకాంక్ష. ఏకకాలంలో అటు మహ్మదాలి జిన్నాతోను, ఇటు జవహర్‌లాల్ నెహ్రూతోనూ రాయబారాలు నడిపాడు. అదే సమయంలో కశ్మీర్‌ను ఆక్రమించుకోవడానికి పాక్ రంగంలోకి దిగింది. పఠాన్‌లను, గిరిజన తెగలనూ రెచ్చగొట్టి యుద్ధంలోకి దించింది. ఈ క్రమంలో గిల్గిట్–బాల్టిస్తాన్ పూర్తిగా, కశ్మీర్ లోయ, జమ్మూలోని కొన్ని ప్రాంతాలు పాక్ అధీనంలోకి వచ్చాయి. ఈ సమయంలో రాజా హరి సింగ్ భారత సహకారాన్ని అర్థించడంతో భారతసైన్యం రంగంలోకి దిగింది. దీంతో ఇప్పుడున్న ఆధీనరేఖ (ఎల్‌వోసీ) ఆవలి వైపున పాక్ నిలిచిపోయింది. హరి సింగ్ భారత సాయాన్ని అర్థించినప్పుడే జమ్మూ– కశ్మీర్‌ను భారత్‌లో కలిపేందుకు సమ్మతించాడు. అందుకు అనుగుణంగా తన జమ్మూ–కశ్మీర్ రాజ్యాన్ని (గిల్గిట్–బాల్టిస్తాన్, లదాఖ్, జమ్మూలతో సహా) భారత త్‌లో విలీనం చేస్తూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కొనసాగాలనే షరతును పెట్టాడు. అప్పుడున్న పరిస్థితుల్లో ఆ షరతును అంగీకరించడం మినహా నెహ్రూకు మరో ప్రత్యామ్నాయం కనిపించలేదు. ఎందుకంటే రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు ముస్లిం మతస్తులు. హరిసింగ్ నిర్ణయం పట్ల అప్పటికే నిరసనలు మొదలయ్యాయి. అవి మరింత పెరిగితే సమస్య జటిలమవుతుంది. రెండో విషయం, రాజా హరి సింగ్ రాష్ట్రం మొత్తాన్ని భారత్‌లో విలీనం చేసేలా సంతకం పెడుతున్నాడు. దీని ఆధారంగా ఐక్యరాజ్యసమితి జోక్యంతో పాక్‌ను దురాక్రమణదారుగా ప్రకటించి ఆక్రమిత ప్రాంతాల నుంచి తరిమివేయవచ్చని, అన్ని ప్రాంతాలూ భారత యూనియన్‌లో భాగంగా ఉంటాయని నెహ్రూ భావించాడు. ఆపై ఐక్యరాజ్యసమితిలో ఫిర్యాదు కూడా చేశాడు. కాకపోతే ఆ ఫిర్యాదు ముందుకు కదల్లేదు. మూడో అంశం, బ్రిటిష్ కాలంలోనూ జమ్మూ–కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని అనుభవించింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టు కుని షరతులకు నెహ్రూ సమ్మతించాడు. ఫలితంగా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తూ భారత రాజ్యాంగంలో 370వ అధికరణాన్ని చేర్చారు. ఈ అధికరణం ఆధారంగా కశ్మీర్ ప్రజల స్థానికతను నిర్వచిస్తూ తదనంతర కాలంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా 35ఎ అధికరణాన్ని చేర్చారు.

### సందర్భం 2:

రాజ్యాంగబద్ధమైన గౌరవాలను కశ్మీర్ ఎక్కువ కాలం అనుభవించలేకపోయింది. ప్రధానమంత్రి పదవి పోయి ముఖ్యమంత్రి పదవి మిగిలింది. పార్లమెంటు అసెంబ్లీగా మారిపోయింది. 370 అధికరణ కూడా నీరుగారిపోయింది. సంకేత ప్రాయంగా ఒక ప్రత్యేక జెండా, చెప్పుకోవడానికి ఓ రాజ్యాంగం మిగిలింది. కశ్మీర్ స్థానికత నిర్వచనం కారణంగా మిగతా దేశ ఆర్థిక అభివృద్ధితో సమన్వయం కాలేక వెనుకబడిపోయింది. చివరకు షేక్ అబ్దుల్లా లాంటి జనాదరణ కలిగిన నాయ కుడిని జైల్లో పెట్టారు. క్రమంగా కశ్మీర్ విద్యావంతులు కొందరిలో ఒక అసంతృప్తి ఏర్పడింది. కశ్మీర్ స్వతంత్ర రాష్ట్రం కోసం జేకేఎల్‌ఎఫ్ లాంటి సంస్థలు పనిచేయడం ప్రారంభించాయి. ప్రత్యక్ష యుద్ధాల్లో గెలవడం సాధ్యం కాదని భావించిన పాక్ ఇదే అదనుగా ఉగ్రవాద మూక లకు శిక్షణ ఇచ్చి కశ్మీర్‌లో చిచ్చు పెట్టడం ప్రారంభించింది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ టెర్రరిజం ప్రబలిన నేపథ్యం కూడా పాక్‌కు కలసి వచ్చింది. పెద్ద సంఖ్యలో యువకులను ప్రభావితం చేసి తన స్వార్థం కోసం మిషన్ కశ్మీర్ పేరుతో పంపించడంతో ఇక్కడ పరిస్థితులు అదుపు తప్పాయి. మత సహనానికి మారుపేరైన కశ్మీర్ యువతరం మనసుల్లో కూడా విషబీజాలను నాటగలిగారు. ఉగ్రవాదాన్ని అణచివేసే నెపంతో భారత భద్రతా దళాలు వ్యవహరించిన తీరు కూడా కశ్మీర్ ముస్లిం ప్రజలకూ–భారత్‌కూ మధ్య దూరాన్ని పెంచింది. ఈ నేపథ్యంలో కశ్మీర్ వేరు, భారత్ వేరు అనే అభిప్రాయాలను తక్షణం దూరం చేయాల్సిన అవసరం ఉంది. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని నిర్ద్వంద్వంగా ప్రకటించి అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాల్సిన అవసరం ఏర్పడింది. కశ్మీర్ ప్రజల విశ్వాసాలను చూరగొని మళ్లీ 'కశ్మీరియత్' పునరుద్ధరించడం భారతీయ సమాజం బాధ్యత. లేకుంటే ఈ రావణ కాష్టం రగులుతూనే ఉంటుంది.

ఈ 70 సంవత్సరాల కాలంలో ప్రపంచం రూపురేఖలు చాలా మారిపోయాయి. అప్పటిలాగా వలస దోపిడీ నుంచి అప్పుడే విముక్తి పొందిన తరుణ స్వతంత్ర దేశం కాదు. భారత్ ఇప్పుడొక ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న దేశం. ఈ దేశంలోని 130 కోట్ల మంది జీవన ప్రమాణాలను పెంచుకోవాలన్నా, కోటానుకోట్ల మంది నవతరం బిడ్డలకు ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించాలన్నా ఒక గ్లోబల్ పవర్‌గా భారత్ ఎదగక తప్పదు. అలా ఎదగాలంటే ప్రపంచ వర్తక – వాణిజ్యాలను, కనీసం దక్షిణాసియా ప్రాంతంలోనైనా శాసించగలిగే శక్తిని కూడదీసుకోవాలి. ఒకపక్క చైనా శరవేగంగా దూసుకొస్తున్నది. దక్షిణ చైనా సముద్రం నుంచి మలక్కా జలసంధి, బంగాళాఖాతం, అరేబియా సముద్రాల గుండా పర్షియన్ గల్ఫ్, ఎర్రసముద్రాలను దిగ్బంధం చేసే విధంగా 'ముత్యాలదండ' పేరుతో ఓడరేవుల సమీపంలో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసే సన్నాహాల్లో చైనా ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. రాజా హరిసింగ్ విలీనం చేసిన ప్రకారం భారతదేశానికి చెందిన గిల్గిట్–బాల్టిస్తాన్‌లోని ట్రాన్స్‌కారాకోరం జమీన్‌ను పాకిస్తాన్ చైనాకు అప్పగించింది. అక్కడి నుంచి గిల్గిట్–బాల్టిస్తాన్ గుండా పాకిస్తాన్ నైరుతి దిక్కున ఉన్న గ్వదర్ రేవు పట్టణం వరకు చైనా ఒక బ్రహ్మాండమైన కారాకోరం హైవేను నిర్మిస్తున్నది. గ్వదర్ రేవు పాక్ నైరుతి దిక్కున అరేబియా సముద్ర తీరంలో పర్షియన్ గల్ఫ్‌కు ముఖద్వారం లాగా ఉంటుంది. ఈ రేవును చైనాకు 40 ఏళ్ల కౌలుకు పాక్ అప్పగించింది. ఇకముందు పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు మోసుకొచ్చే నౌకలకు చైనా చెక్‌పోస్టును సిద్ధం చేస్తున్న దృశ్యమిది. కశ్మీర్ సమస్యపై మూడో శక్తి ప్రమేయానికి భారత్ వ్యతిరేకం. కానీ, ఈ సమస్యతో ముడిపడి ఉన్న గిల్గిట్–బాల్టిస్తాన్‌లో దాదాపు 10 దేశాలు నిర్మాణ కార్యక్రమాలు సాగిస్తున్నాయి. పెట్టుబడులూ పెడుతున్నాయి. ఇందులో చైనాదే సింహభాగం. విలువైన ఖనిజ సంపదకు ఈ ప్రాంతం నిలయం. హిమనీనదాల్లో అపారమైన జలసంపద నిక్షిప్తమై ఉంది. పర్వత ప్రాంతం కావడం వల్ల హైడల్ పవర్ ఉత్పత్తికి అనుకూలం. ఒక్క సింధూ నది మీదనే ఈ ప్రాంతంలో 40 వేల మెగావాట్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చట. భారతదేశంలో ఉన్న మొత్తం జలవిద్యుత్ ప్రాజెక్టుల స్థాపిత సామర్థ్యంతో ఇది దాదాపు సమానం. సింధూ ఉపనదుల మీద మరో 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చట. కారాకోరం హైవేపై ఇప్పుడు సరుకు రవాణా వాహనాలు తిరుగుతుండవచ్చు. రేపు చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వాహనాలు కూడా ఈ రహదారిపై తిరిగే అవకాశం లేకపోలేదు. ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతున్న ఈ పరిణామాలను గట్టిగా ప్రశ్నించాలంటే, అడ్డుకోవాలంటే భారత అధీనంలోని భూభాగంపై భారత సార్వభౌమాధికారం పట్ల ఎటువంటి సందిగ్ధతకు తావుండరాదు. రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు చెల్లవు. మోదీ చర్య చారిత్రక అనివార్యం. బౌద్ధ ధర్మం ఆసియా ఖండం మొత్తంలో విస్తరించినా, పాపం... భారతదేశంలో మాత్రం ఒక్క స్థావరం కూడా మిగల్లేదు. 40 శాతం బౌద్ధ జనాభా గల ఏకైక ప్రాంతం లదాఖ్. కశ్మీర్ చరిత్రకూ, పరిణామాలకూ మౌనసాక్షిగా ఉన్న లదాఖ్ లిటిల్ బుద్ధా ఇప్పుడు నోరు విప్పి చెపుతున్నాడు. 'అప్పుడు నెహ్రూ చేసింది తప్పేమీ కాదు. ఇప్పుడు మోదీ చేసింది కూడా తప్పేమీ కాదు.'

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### నేరం



"మేం ఏమైనా పెద్ద నేరం చేశామా? కశ్మీరీలమంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాళ్లు ల్యాండ్ లైన్ ఫోన్లు కూడా పని చేయకుండా చేశారు. అవి ఉంటే ఏమవుతుందట? వాళ్లు మా భావోద్వేగాలను అణచేస్తారా? ఎప్పటివరకు? ఇంతకంటే మమ్మల్నందర్నీ ఒకేసారి చంపేయడం మేలు–అంటూ ఒక తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. సమాచార వ్యవస్థను అడ్డుకోవడంతో ఆమె తన కొడుకుతో మాట్లాడలేకపోయింది. ఈద్ పండుగకు రావాల్సిన కొడుకు ఇంకా ఎందుకు రాలేదో తెలియక ఆమె ఆందోళన చెందుతోంది"

– ఉజైర్ హసన్ రిజ్వి, జర్నలిస్ట్

### వాస్తవం



"మమతా బెనర్జీ తల్లి పేరు గాయత్రీ దేవి. మమత తల్లి ముస్లిం అని రా మాజీ అధికారి ఎన్.కె.సూద్ వ్యాఖ్యానించడాన్ని బట్టి అతని ఇంటెలిజెన్స్ స్థాయి ఏంటో తెలుస్తోంది. ఒక సీనియర్ రాజకీత నేత గురించి సరైన సమాచారాన్ని సేకరించలేని ఇటువంటి వ్యక్తుల చేతిలో నడిచే మన భద్రతా సంస్థల స్థాయి ఏపాటిదో దీన్నిబట్టి తేటతెల్లం అవుతోంది. వీళ్లంతా వాట్సాప్ యూనివర్సిటీలో చేరడం వల్లే ఇలా తయారయ్యారంటారా?"

– రాకేష్ శర్మ, ఫిల్మ్ మేకర్

### ఆస్తి



"కశ్మీరీ మహిళలను ఉద్దేశించి హరియాణా సీఎం ఖత్తార్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయం. ఏళ్ల తరబడి ఆరెస్సెస్ ఇచ్చిన శిక్షణతో అతడి మెదడు బలహీనమైపోయింది. పురుషులు సొంతం చేసుకోవడానికి మహిళలు ఆస్తులు కాదు"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత

### పండుగ



"మహిళలు తమ ఆనందాన్ని పంచుకోవడానికి తీజ్ పండుగ చక్కటి అవకాశాన్నిస్తుంది. ప్రస్తుత రోజుల్లో తీజ్ మహిళా శక్తికి నిదర్శనం. మన జీవితంలోని మహిళలను గౌరవంగా, హుందాగా చూసుకున్నప్పుడు ఈ పండుగ మరింత ఆనందాన్నిస్తుంది"

– హర్సిమ్రత్ కౌర్ బాదల్, కేంద్ర మంత్రి

### ఓకే



"కశ్మీర్‌లో అంతా ఓకే. ప్రతి ఒక్కరూ చాలా సంతోషంగా ఉన్నారు. పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరపడం వల్ల కొంతమంది అంధులు అయ్యారు. కానీ, నిజానికి అంతా బ్రహ్మాండంగా ఉన్నారు"

– అమన్ సేథి, జర్నలిస్ట్

### వెన్నెముక



"ఇంకా వెన్నెముక ఉన్న కొన్ని మీడియా సంస్థల్లో అది ఒకటి. దాన్ని అణచివేయడానికి వారు చేయగలిగినదంతా చేస్తున్నారు. ప్రజల పక్షాన పని చేయడంలో ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ విజయం సాధించారు. ఈ దేశంలో ఏం జరుగుతోందో మీరు తెలుసుకోవాలనుకుంటే, మీకు కాస్త సమయం ఉంటే ఎన్డీటీవీకి మద్దతు తెలపండి"

– కరుణా నంది, అడ్వొకేట్

## పోరుబాటలో 26 వసంతాలు

భారత కార్మిక వర్గానికి సమరశీల కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ 1993లో కార్మిక వర్గ పోరాట కేంద్రంమైన ముంబైలో 30 వేల మంది సాక్షిగా ఆవిర్భవించిన ఏఐఎఫ్‌టీయూ నేటికి 26 వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంది. నేడు దేశం తీవ్రమైన ఆర్థిక, పారిశ్రామిక సంక్షోభం ఎదుర్కొంటున్న స్థితిలో ఆగస్టు 11, 2019న చారిత్రక హైదరాబాద్ నగరంలో తెలంగాణ రాష్ట్ర మహాసభలు జరుపుకుంటున్నది. స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరులక్షల కంపెనీలు మూతబడ్డాయని, మరో ఆరు లక్షలు నష్టాల బారిన పడ్డాయని, మిగతా ఆరులక్షలు దేశ విదేశీ బహుళజాతి కంపెనీల సారథ్యంలో నడుస్తున్నాయని ప్రకటించారు. ఇక రాష్ట్రంలోనూ రీ ఇండస్ట్రియలైజేషన్‌తో కంపెనీలన్నీ తెరిచి ఉపాధి మెరుగుపరుస్తారని, కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేస్తారనీ కార్మికులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలైనాయి. అందుకే కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధపడాల్సిన ఆవశ్యకత జరూరైన అంశంగా ముందుకు వచ్చింది. ఈ దిశగా ఎఐఎఫ్‌టియు తన లక్ష్యసాధనలో ముందుకు సాగాలి.

(నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ఏఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా)

సామల అనసూయ, ఏఐఎఫ్‌టీయూ
తెలంగాణ రాష్ట్ర కన్వీనర్

# వర్సిటీల్లో పరిశోధన వెనకబడుతోందా?

అభిప్రాయం



ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి

విశ్వవిద్యాలయాల్లో బోధన పరిశోధన రెండు కళ్ళలాంటివి. పరిశోధన ప్రాముఖ్యత విశ్వవిద్యాలయ పాఠ్యాంశాల బోధన పైన ఎక్కువ ప్రభావం చూపుతుంది. విశ్వవిద్యాలయాల పరిశోధన ఆర్థిక, సామాజికాభివృద్ధి, బోధనా పటిష్టతకు తోడ్పడుతుంది. అనేక దేశాలలో పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక విప్లవం విశ్వవిద్యాలయ పరిశోధనపై ఆధారపడి నడుస్తున్న దృష్టాంతాలు అనేకం. అదే విధంగా మనదేశంలో పారిశ్రామిక అభివృద్ధి విశ్వవిద్యాలయ పరిశోధనపై ఆధారపడి వుంది. విచిత్రమేమిటంటే పారిశ్రామికవేత్తలు మనదేశంలో విశ్వవిద్యాలయ పరిశోధన పటిష్టతకు ఎక్కువ చేయూతనివ్వలేదు. విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధన పారిశ్రామికవేత్తలకు ప్రత్యక్ష్యంగా ఉపయోగపడే విధంగా లేకపోవడం ఒక కారణం. సమాజాభివృద్ధికి కావల్సిన పరిశోధనా పరమైన అంశాలను విశ్వవిద్యాలయాల్లో చేపట్టకపోవడం ఒక విధమైన చేదు అనుభవం. ప్రభుత్వ ఆర్థిక సహాయం, పారిశ్రామికవేత్తల చేయూత విశ్వవిద్యాలయంలో పరిశోధనాభివృద్ధికి రెండు మూలస్తంభాలుగా భావించవచ్చు. కానీ ప్రభుత్వ ఆర్థిక సహాయం గత మూడు దశాబ్దాలుగా సన్నగిల్లి, పారిశ్రామికవేత్తలు పూర్తిగా విస్మరించడం వల్ల విశ్వవిద్యాలయ పరిశోధనా వ్యవస్థ కుంటుపడి ముందుకు నడవలేకపోతోంది. ఈ పరిశోధనా వ్యవస్థ పటిష్టం కాకపోవడానికి ఆర్థిక సహాయ లోపమే కాకుండా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పరిశోధనా పటిమ తగ్గడం ముఖ్య కారణంగా భావించవచ్చు.

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన పరిశోధనా ఫలాలు గత మూడు దశాబ్దాలుగా గణనీయంగా పడిపోయాయని మన గణాంకాలు చెబుతున్నాయి. ఈ విధమైన పరిస్థితి విశ్వవిద్యాలయాల ఉనికికే ప్రమాదకరమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే పరి శోధన విధానాలను సామాజికాభివృద్ధికి ఉపయోగంగా మలచాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇవే విశ్వవిద్యాలయాల పేరు ప్రఖ్యాతులను విశ్వవ్యాప్తం చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిద్యాలయ అధ్యాపక నియామకాలను పరిశీలించినట్లయితే 1990 తర్వాత పరిశోధన పటిష్టత లేమి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. మన ప్రభుత్వాలు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై అనేక విధాలుగా నిర్లక్ష్యం వహిస్తూండటం వల్ల వాటి ప్రమాణాలు దిగజారుతున్నాయని చెప్పవచ్చు. ప్రస్తుత దుర్భర పరిస్థితిని మార్చాలంటే మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి వుంది. ఇందులో ప్రధానంగా ప్రతిభ, దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తులను ఉపకులపతులుగా నియమించే ప్రక్రియ అత్యంత కీలకం.

గత రెండు దశాబ్దాలుగా వివిధ కారణాలవల్ల పీహెచ్‌డీ ప్రక్రియలో అనేక రుగ్మతల మూలంగా ప్రమాణాలు దిగజారుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిద్యాలయాల స్థితిగతులను పరిశీలిస్తే, ఉన్నతవిద్య ప్రమాణాలు గణనీయంగా తగ్గాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఏపీలోని 20 విశ్వవిద్యాలయాల్లోనూ బోధన చాలా తక్కువ సంఖ్యలో ఉన్న సిబ్బందితో కొనసాగుతోంది. ఉదాహరణకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నేను 1977–78లో పరిశోధక విద్యార్థిగా ఉన్నప్పుడు దాదాపు 120 మంది పరిశోధక విద్యార్థులు ఉండేవారు. అప్పటికి యూనివర్సిటీగా గుర్తింపు లేదు. పీజీ సెంటర్‌గానే వుండేది. కానీ అప్పటి ఆచార్య బృందానికి బోధనపై ఎంత పట్టు ఉండేదో, అంతే స్థాయిలో పరిశోధనపై కూడా ఉండేది. ఇది అన్ని శాఖలకు వర్తించేది. విశ్వవిద్యాలయ హోదా పొందిన తర్వాత గత ముప్ఫై ఏళ్లలో వర్సిటీల్లో బోధన పటిమ, పరిశోధనా సామర్థ్యాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఇందుకు కారణాలు అనేకం. ముఖ్యంగా బోధనా సిబ్బంది గణనీయంగా తగ్గిపోవడం, అదే సమయంలో కొత్త నియామకాలు చేపట్టకపోవడం. 1980వ దశాబ్దంలో దాదాపు 20 విభాగాల్లో 200 మంది బోధనా సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు దాదాపు 36 విభాగాల్లో 70 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఈ కారణంగా విశ్వవిద్యాలయంపై విద్యార్థులకున్న నమ్మకం సన్నగిల్లుతూ వచ్చింది. ఉపకులపతులు అనేక రకాలైన చట్టపరమైన, పాలనాపరమైన చిక్కుముడుల వల్ల అధ్యాపకుల నియామకాలు చేపట్టలేకపోయారు. పీజీ స్థాయిలో ప్రత్యేక పాఠ్యాంశాల బోధన లేకపోవడం వల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు తగ్గుముఖం పట్టాయి. ఈ విష వలయం నుండి బయటపడాలంటే ప్రస్తుత ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో, బోధన సిబ్బంది నియామకాలు త్వరితగతిన చేపట్టాల్సి వుంది.

ఏపీలోనే కాకుండా అన్ని రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు కొద్దో గొప్పో తేడాలతో ఇవే సమస్యలతోనే సతమతమవుతున్నాయి. ఏ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులైనా సరే వేగవంతం కావాలంటే ప్రధానమైన విశ్వవిద్యాలయాల్లో విద్యా విస్తరణ పటిష్టతతో ముందుకు వెళ్ళాల్సి ఉంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ఉపయోగించుకొని విశ్వవిద్యాలయాల విశిష్టతను పెంపొందించి, విద్యాభివృద్ధికి, రాష్ట్రాల మానవ వనరుల నైపుణ్యాభివృద్ధికి కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రస్తుతం ఏపీలో, కొన్ని ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బడ్జెట్ మానవ వనరుల అభివృద్ధికి కృషి చేసే దిశగా ప్రయత్నం చేస్తుండటం శుభసూచకం. ఈ ప్రయత్నం ఫలించాలని ఆశిద్దాం.

వ్యాసకర్త పూర్వ ఉపకులపతి, ఎస్కేయూ
అనంతపురం। మొబైల్ : 9440888066

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
11-8-2019

**సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2018 పురస్కార గ్రహీతలు...**

1. జీవిత సాఫల్య పురస్కారం అవార్డు - ఉప్పలపాటి కృష్ణంరాజు
2. మోస్ట్ పాపులర్ మూవీ ఆఫ్ ది ఇయర్ - మహానటి
3. మోస్ట్ పాపులర్ డైరెక్టర్ ఆఫ్ ది ఇయర్ - సుకుమార్ (రంగస్థలం)
4. మోస్ట్ పాపులర్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్ - రామ్‌చరణ్ (రంగస్థలం)
5. మోస్ట్ పాపులర్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్ (ఫిమేల్) - పూజా హెగ్డే (అరవింద సమేత వీరరాఘవ)
6. మోస్ట్ పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ - వీకే నరేష్ (సమ్మోహనం)
7. మోస్ట్ పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ (ఫిమేల్)- అనసూయ (రంగస్థలం)
8. మోస్ట్ పాపులర్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్ (నెగటివ్ రోల్)- పాయల్ రాజ్‌పుత్ (ఆర్‌ఎక్స్ 100)
9. మోస్ట్ పాపులర్ క్రిటికల్లీ ఏక్లైమ్డ్ మూవీ ఆఫ్ ది ఇయర్- గూఢచారి
10. మోస్ట్ సక్సెస్‌ఫుల్ బాక్సాఫీస్ హిట్ ఆఫ్ ది ఇయర్ (చిన్న సినిమా)- ఆర్‌ఎక్స్ 100
11. డెబ్యూడెంట్ డైరెక్టర్ ఆఫ్ ది మూవీ - రాహుల్ రవీంద్రన్ (చి!ల!సౌ)
12. డెబ్యూడెంట్ హీరోయిన్ ఆఫ్ ది ఇయర్ -నిధీ అగర్వాల్ (సవ్యసాచి)
13. మోస్ట్ పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్ ఆఫ్ ది ఇయర్- దేవిశ్రీ ప్రసాద్ (రంగస్థలం)
14. మోస్ట్ పాపులర్ సినిమాటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్- రత్నవేలు (రంగస్థలం)
15. మోస్ట్ పాపులర్ కమెడియన్ ఆఫ్ ది ఇయర్- సునీల్ (అరవింద సమేత వీరరాఘవ)
16. మోస్ట్ పాపులర్ సింగర్ ఆఫ్ ది ఇయర్ - అనురాగ్ కులకర్ణి (చూసి చూడంగానే.. (ఛలో))
17. మోస్ట్ పాపులర్ సింగర్ ఆఫ్ ది ఇయర్ - చిన్మయి (ఏంటీ ఏంటీ..(గీతగోవిందం))
18. మోస్ట్ పాపులర్ లిరిసిస్ట్ ఆఫ్ ది ఇయర్ - అనంత శ్రీరామ్ (ఇంకేం ఇంకేం కావాలే...(గీతగోవిందం))



వైఎస్ భారతి నుంచి 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకుంటున్న కృష్ణంరాజు

# సందడిగా హుందాగా
# సాక్షి అవార్డుల వేడుక

## ట్రెండ్‌ని సెట్ చేసేందుకు కష్టపడ్డా
-కృష్ణంరాజు

నేను నా సినిమాల్లో ఫైట్స్ అన్నీ డూప్ లేకుండా నిజంగా చేసినవే. అటువంటి ఫైట్స్ చేసి ప్రేక్షకుల నుంచి కాంప్లిమెంట్స్ పొందినప్పటికీ నేను మాత్రం రెండు కాళ్లు, కుడి చెయ్యి విరగ్గొట్టుకున్నాను(నవ్వుతూ). ఎన్నిసార్లు హాస్పిటల్‌కు వెళ్లానో నాకు తెలుసు(నవ్వుతూ). అప్పట్లో ఇలా ట్రెండ్‌ని సెట్ చేయడానికి నేను పనిచేశా, కష్టపడ్డాను. విలన్‌గా చేయమని దర్శకులు అడిగితే ఒప్పుకోలేదు. అయితే విలన్ పాత్రలను నా స్టైల్లో చేస్తాను, మీకు ఓకే అయితే చేస్తానన్నాను. ఫైట్స్ దగ్గర నుంచి పిస్టల్‌తో పేల్చడం వరకు ప్రతిదీ కొత్తగానే ప్రయత్నించాను. 'మదర్ ఇండియా, బంగారు తల్లి' లాంటి సినిమాల్లో చాలా డిఫరెంట్‌గా చేశా. ఒక ప్రొడక్షన్‌లోకి అడుగుపెట్టినప్పుడు చాలా అవమానాలు వచ్చాయి. అప్పట్లో హీరోయిన్స్‌ని ముట్టుకోకుండా ఆమడ దూరంలో ఉండి చేసే విధానం ఉండేది. నా ఉద్దేశం ఏంటంటే మగవాళ్లు, ఆడవాళ్లు సమానమే అనేది. అందుకే 'కృష్ణవేణి' సినిమాను తెలుగు ప్రేక్షకులు గుర్తించుకోగలిగేలా తీయగలిగాను. ఈ సినిమాను చూసిన హీరో ఎన్టీఆర్ గారు మెచ్చుకున్నారు. 'భక్త కన్నప్ప, బొబ్బిలి బ్రహ్మన్న' లాంటి సినిమాల్లో ట్రెండ్‌ని సెట్ చేశాం. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి.. నేనూ మంచి స్నేహితులం. ఆయన నన్ను ఎంతమందిలో చూసినా 'ఏం రాజా' అంటూ పిలిచేవారు. నేను కూడా ఆయన్ని 'రాజా' అంటూ పిలచేవాణ్ణి. 'సాక్షి'ని ఇంత గొప్పగా తీర్చిదిద్దిన యాజమాన్యానికి నా అభినందనలు. 'సాక్షి' నన్ను గుర్తించి 'జీవితసాఫల్య పురస్కారం' అందించడం అత్యంత సంతోషదాయకంగా భావిస్తున్నా.

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

"వైఎస్. రాజశేఖరరెడ్డిగారు అంటే నాకెంతో ఇష్టం. ఆయన నన్ను రాజా అని పిలిస్తే నేను ఆయన్ను రాజా అని పిలిచేవాణ్ణి. ఆయన కుమారుడు జగన్‌గారు పెట్టిన ఈ 'సాక్షి' భారతిగారి ఆధ్వర్యంలో బ్రహ్మాండంగా కొనసాగుతుంది."
- నటుడు కృష్ణంరాజు

"'సాక్షి' అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే చాలా హుందాగా ఉంటుంది." - దర్శకుడు పూరి జగన్నాథ్

"'సాక్షి' అవార్డులు చాలా జెన్యూన్‌గా ఉంటాయి."
- నటుడు- నిర్మాత రామ్ చరణ్

అని శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్'ని కొనియాడారు. పలు విభాగాల్లో ఈ అవార్డులను పలువురు ప్రముఖులు అందుకున్నారు. 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్' ఎంపిక జాబితాలో జాతీయ అవార్డులు సాధించిన 'మహానటి, రంగస్థలం, అ!, చి!ల!సౌ' చిత్రాలు ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో 'మధుర' శ్రీధర్, నవీన్ ఎర్నేని, రాజారవీంద్ర, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.




## అదే నిజమైన అవార్డు
- రామ్‌చరణ్

"'రంగస్థలం' సినిమా నాకే కాదు, యూనిట్ అందరికీ మరచిపోలేని చిత్రం. నిజంగా రెండు కారణాల వల్ల ఈ అవార్డు తీసుకున్నాను. ఈ మధ్య కాలంలో నిజాయతీగా జనాలు ఓటు వేసి అవార్డులు రావడం అనేది చాలా తక్కువ. ఓ జ్యూరీ కమిటీ ఉంటుంది. వారందరూ కూర్చుని ఎంపిక చేస్తారు. అయితే జనాల్లో నుంచి వచ్చినప్పుడే అది నిజమైన అవార్డు. సాక్షి మీడియా జనాల నుంచి ఓటింగ్ సిస్టమ్‌ని క్రియేట్ చేసి చాలా నిజాయతీగా ఐదేళ్ల నుంచి సౌత్ ఇండియాలో అవార్డులు ఇస్తుండటం అభినందనీయం. ఏ అవార్డు తీసుకున్నా ఆనందం రాదు.. మరి ఇలాంటి అవార్డు తీసుకున్నప్పుడు ఓ ఆర్టిస్టుకు నిజంగా ఏదో గెలిచామనే ఆనందం వస్తుంది. ఈ అవార్డు నాకు ఇచ్చినందుకు థ్యాంక్యూ.. ఇలాంటి అవార్డుల వేడుక ఇంకా ఇంకా కొనసాగాలి. మరో కారణం ఏంటంటే... ఆ వ్యక్తి లేకుంటే, నన్ను కలవకపోయి ఉంటే ఈ అవార్డు లేదు. చాలా మొండోడు.. గట్టోడు. ఏదైనా సాధించేవరకూ వదలడు. పెన్ను పట్టుకుని పేపర్ మీద రాయడం మొదలు పెడితే కథతో, డైలాగులతో, పాత్రలతో ప్రేమలో పడిపోతారు... ఆయనే సుకుమార్. ఆయన డైరెక్టర్ అయ్యారు కానీ, స్కూల్‌లో లెక్కల మాస్టారులా ఎలా ఉన్నారో షూటింగ్‌లోనూ అంతే.. ఆయన అనుకున్న లెక్కలు వచ్చే వరకూ వదలడు.. ఆ సన్నివేశం అర్థమయ్యేవరకూ మమ్మల్ని వదలడు. స్కూల్ టీచర్‌లా మమ్మల్ని అలా చెక్కుతూ చెక్కుతూ మంచి నటన రాబట్టుకున్నారు.. థ్యాంక్యూ సుక్కు. నువ్వు అలా రాబట్టుకున్నావు కాబట్టే రంగమ్మత్త నుంచి దేవిశ్రీ, రత్నవేలుగారికి.. ఇలా అందరికీ ఈ ప్రయాణం సులభమైంది ఈ సినిమా చేయడానికి.. సో హాట్సాఫ్ సుక్కు. 'రంగస్థలం' సినిమా చేయడానికి నీ ఆలోచనలే నీ బలం. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. జాతీయ అవార్డుకు ఎంపికైన వారందరికీ అభినందనలు. నన్ను హీరోగా పరిచయం చేసన మా డైరెక్టర్ (పూరి జగన్నాథ్) మొన్ననే 'ఇస్మార్ట్ శంకర్' తో హిట్ కొట్టారు.. ఈ మధ్యనే మాట్లాడాను.. ఏంటో చరణ్.. హిట్ చూసి మూడేళ్లయింది అన్నారు.. సార్.. ఇది మామూలే.. మేమూ అలాంటివి చూశాం. కానీ మీరు మంచి లవబుల్ డైరెక్టర్. ప్రేక్షకులు ఒక్కసారి ప్రేమిస్తే మళ్లీ మరచిపోరు.. మీ సినిమా కోసం వేచి చూస్తారంతే.. థ్యాంక్యూ'' అన్నారు.




## నా పుట్టిల్లు ఇచ్చిన అవార్డు ఇది
- అనసూయ

'సాక్షి' మీడియా నా పుట్టినిల్లు. అదే పుట్టినిల్లు నుంచి నా నటనను మెచ్చుకుని ఎక్సలెన్స్ అవార్డు ఇవ్వడం గర్వంగా ఉంది. నేను 'సాక్షి' ద్వారానే గుర్తింపు తెచ్చుకోగలిగాను. 'రంగమ్మత్త' లాంటి క్యారెక్టర్ ద్వారా నన్ను తెలుగు ప్రేక్షకుల్లో గుర్తుండేలా చేసిన దర్శకుడు సుకుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞులు. రామ్‌చరణ్, సుకుమార్, దేవిశ్రీప్రసాద్ లాంటి పేరుమోసిన ఆర్టిస్టులతో షూటింగ్‌లో పాల్గొనడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. 'రంగస్థలం' లోని 'ఓయ్ చిట్టిబాబూ' అంటూ హీరో రామ్‌చరణ్‌ని వేదిక మీద పిలవడంతో ప్రేక్షకులు చప్పట్లు, ఈలలతో సందడి చేశారు.



## భారతమ్మ చల్లని నీడలో 'సాక్షి'
- పూరిజగన్నాథ్

'సాక్షి' అంటే నాకు చాలా అభిమానం. 'సాక్షి'తో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎందుకంటే 'సాక్షి'ని స్థాపించింది మన పెద్దాయన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు. ఇప్పుడు ఈ మీడియా సంస్థ భారతమ్మ చల్లని నీడలో విజయపథంలో వెళ్లడం ఆనందంగా ఉంది. ప్రతిఏటా 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డులను తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రతిభావంతులికి ఇవ్వడం నిజంగా ఆనందాన్ని ఇస్తుంది. నా చేత కూడా అవార్డులు ఇప్పించినందుకు సంతోషిస్తున్నా. కృష్ణంరాజుగారి సినిమాలు చూసి పెరిగినవాణ్ణి. అప్పట్లో ఆయన సినిమాల్లోని ఫైట్స్‌కి 'డిహే డిహే' అని సౌండ్స్ వచ్చేవి. ఆ సౌండ్స్ కూడా ట్రెండే.



## తెలుగు సినిమా ఎక్సలెంట్
-రెజీనా

తెలుగు చిత్రాలు జాతీయ స్థాయిలో అవార్డులు గెలుచుకోవడం ఆనందంగా ఉంది. అటువంటి తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నేను కూడా భాగస్వామిని అవడం గర్వంగా ఉంది. తెలుగు సినిమా నిజంగా ఎక్సలెంట్. పరిశ్రమలో అడుగు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నా పాత్రలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రేక్షకులతో పాటు 'సాక్షి' మీడియా నన్ను గుర్తించి 'ఎక్సలెన్స్' అవార్డును ఇవ్వడం నిజంగా ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

## అవార్డు అందుకున్న వేదికపై అవార్డు ఇవ్వడం హ్యాపీ
-హాస్యనటుడు అలీ



'సాక్షి' మీడియా నాకు ఇదే వేదికపై అవార్డు ఇచ్చింది. ఆరోజును నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఇదే వేదికపై నా చేత అవార్డు ఇప్పించిన 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు. అప్పట్లో నరేష్‌గారిని చూస్తే హిందీ హీరో వస్తున్నాడు అనే చర్చ జరిగేది. అటువంటి మంచి నటుడికి నేను అవార్డ్ ఇవ్వడం గర్వంగా భావిస్తున్నా.




## నా తొలి అవార్డు
- రాహుల్ రవీంద్రన్

ఇది నా జీవితంలో తొలి అవార్డు. ఉద్యోగం మానేసి సినిమాల్లోకి వెళ్తానన్నప్పుడు మా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించారు. వారికి ఈ అవార్డును అంకితం ఇస్తున్నా. ఏడేళ్ల క్రితం ఇదే రోజు నేను నటించిన తొలి చిత్రం 'అందాల రాక్షసి' విడుదలైంది. ఈ సినిమా అత్యంత ప్రేక్షకాదరణ పొందినా అవార్డును అందుకోలేకపోయాను. ఆ సమయంలో హీరో నాని నాతో ఓ మాట అన్నాడు. 'రాహుల్... డెబ్యూ ఫిల్మ్‌కి అవార్డు ఒకటి కొట్టు. జీవితంలో గుర్తుండిపోతుందని అన్నాడు. కానీ నేను సాధించలేకపోయాను. నా ఏడేళ్ల సినిమా ప్రయాణంలో 'సాక్షి' అందించిన ఈ అవార్డే ఫస్ట్‌ది. అందుకు నేను సాక్షికి ధన్యవాదాలు చెబుతున్నాను. ఈ అవార్డు అందుకోవడం గర్వంగానూ ఉంది.




## 'సాక్షి' నాకు నచ్చిన మీడియా
-ఛార్మి

'సాక్షి' నాకు నచ్చిన మీడియా. చాలా హానెస్ట్, జెన్యూన్, సూపర్ టాలెంట్. ఈ మీడియాతో నేను చాలా అనుబంధంగా ఉంటాను. చాలా ఫీలింగ్స్ కూడా ఉన్నాయి. అటువంటి మీడియా సంస్థ నన్ను ఆహ్వానించి, నా ద్వారా అవార్డును ప్రదానం చేయించడం ఆనందంగా ఉంది. ఎక్సలెన్స్ అవార్డులను అందుకున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.



## చిన్న నటుడికి అవార్డు ఇచ్చినందుకు సాక్షికి థ్యాంక్స్
- సంపూర్ణేష్ బాబు

నేనొక చిన్న నటుణ్ణి. నా నటనను మెచ్చుకుని మెగా ఫ్యామిలీ నుంచి కాంప్లిమెంట్స్ రూపంలో వీడియో రావడం చాలా ఆనందంగా ఉంది. అదే విధంగా నా లాంటి చిన్న నటుణ్ణి గుర్తించి ఎక్సలెన్స్ అవార్డు ఇచ్చిన 'సాక్షి'కి థ్యాంక్స్, రుణపడి ఉంటాను. ఈ సందర్భంగా 'కొబ్బరిమట్ట' సినిమాలోని మూడు నిమిషాల నిడివిగల డైలాగ్‌ని చెప్పి అలరించాడు.

## గౌరవంగా భావిస్తున్నా
-నరేష్

నాకు ఏడేళ్లు ఉన్నప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినిమా రంగ ప్రవేశం చేశాను. దర్శకులు జంధ్యాలగారు, మా అమ్మ విజయనిర్మలగారు నా గురువులు. నా మొదటి సినిమాను జంధ్యాలగారి దర్శకత్వంలో చేయడం గర్వంగా ఉంది. అదే విధంగా బాపు, విశ్వనాథం, ఈవీవీ సత్యనారాయణ, ఎస్వీ రంగరావు గార్ల దర్శకత్వాల్లో సినిమాలు చేసి ప్రేక్షకులకు దగ్గరయ్యాను. నేను అవార్డు కోసం సినిమా చేయను. చేసిన సినిమాకు అవార్డు రావాలని ఎదురు చూస్తుంటాను. 'రంగస్థలం, మహానటి, సమ్మోహనం' లాంటి చిత్రాల్లో మంచి పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యాను. ఇందుకు నేను గర్విస్తున్నాను. 'సాక్షి'లాంటి ఉన్నత మీడియా నా నటనను మెచ్చుకుని నాకు అవార్డు ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాను.



## జీవితాంతం రుణపడి ఉంటా
-అజయ్ భూపతి

నా మనసులో ఉన్న భావాన్ని, నేను ఎలా సినిమా తీయాలనుకుంటున్నాను అనే నా ఆలోచన్ని టెక్నీషియన్స్ గుర్తించారు. 'పిల్లా రా.. ' అనే పాటలు ఊపిరిపోశాయి. నేను చెప్పిన ప్రతి సీన్‌కి వాళ్లు ఊపిరిపోయబట్టే 'ఆర్‌ఎక్స్-100' భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ




సినిమాలో హీరోయినే విలన్. అందుకే హీరోయిన్‌గా, విలన్‌గా రెండు అవార్డులు పాయల్‌కు రావడం ఆనందంగా ఉంది. డైరెక్టర్‌గా నన్ను 'సాక్షి' గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం పట్ల జీవితాంతం రుణపడి ఉంటాను.

మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ఎసిడిటీ
పేట్ సఫా
Natural Laxative GRANULES
మొదటి రోజు నుండి దీర్ఘకాలిక ఫలితాలు మరియు ఇది అలవాటుగా మారదు.
पेट सफा तो हर रोग दफा





## నిజమైన అవార్డు

కష్టపడినవాడిని గుర్తించి ఈ అవార్డు ఫలనా వ్యక్తికే చెందినది అంటూ 'సాక్షి' ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రదానం చేయడం సంతోషంగా ఉంది. ఇది నిజమైన అవార్డు. గతంలో కూడా 'సాక్షి' నాకు అవార్డు ప్రకటించింది. ఆ సమయంలో నేను ఇండియాలో లేకపోవడం వల్ల అందుకోలేని పరిస్థితి. అయినా ఆ అవార్డు దేవిశ్రీ ప్రసాద్‌కే చెందినది అంటూ నా తమ్ముణ్ణి (సాగర్)ని పిలిచి అవార్డు ఇవ్వడం ఆనందంగా అనిపించింది. అందుకే 'సాక్షి' ఎక్స్‌లెన్స్ అవార్డును రియల్ అవార్డుగా పరిగణిస్తున్నా. నేను సంగీతం అందించిన ప్రతి సినిమాని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తూ నాకు ప్రత్యేకమైన గుర్తింపును ఇస్తున్నందుకు గర్వంగా ఉంది.

– దేవిశ్రీప్రసాద్



## ఓవర్‌నైట్ స్టార్ అయిపోయా

'ఆర్‌ఎక్స్ 100' సినిమా నా జీవితంలో గుర్తుండిపోయే ఓ మైలురాయి. ఆ సినిమాతో నేను ఓవర్‌నైట్ స్టార్‌ని అయిపోయా. దర్శకుడు అజయ్ భూపతి నన్ను ఎందుకు హీరోయిన్‌గా ఎంచుకున్నారో సినిమా విడుదలయ్యాక తెలిసింది. ఆ సినిమా అత్యంత ప్రజాదరణ పొందబట్టే నన్ను ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటున్నారు. నాకు ఇంత మంచి పేరు వచ్చినందుకు దేవుడికి థ్యాంక్స్ చెబుతున్నా (ఆనంద భాష్పాలతో). తెలుగు సినీ పరిశ్రమ నాకొక మంచి అవకాశాన్ని, గుర్తింపును తెచ్చిపెట్టింది. అటువంటి ఓ మంచి సినిమాకి సాక్షి అవార్డు ఇవ్వడం నేను గర్వంగా ఫీలవుతున్నా.

– పాయల్ రాజ్‌పుత్



## గర్వంగా ఉంది

'అరవింద సమేత వీరరాఘవ' వంటి మంచి సినిమాకు నాకు అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలో నా అభినయం, అందానికి మెచ్చి నాకు ఈ సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు రావడం హ్యాపీ. అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది. అ అవార్డుకు ప్రధాన కారణం దర్శకుడు త్రివిక్రమ్. ఆయన నా మీద నమ్మకంతో ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చారు. ప్రతి ఫ్రేమ్‌లో నన్ను హుందాగా, అందంగా చూపించారు. హీరోయిన్ పాత్రతో పంచ్‌లు వేయించడం ఆయనకే చెల్లింది.

– పూజాహెగ్డే



## గోదావరి ప్రజలకు అంకితం

గోదావరి పరిసర ప్రాంతాల్లో 'రంగస్థలం' షూటింగ్ చేసి తెలుగు ప్రేక్షకులను అలరించాం. తెలుగు సినిమాటోగ్రఫీ ఇంత గొప్పగా ఉంటుందా? అంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు మెచ్చుకోవడం ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు సుకుమార్‌గారికి, రామ్‌చరణ్‌గారికి థ్యాంక్స్. సాక్షి ఇచ్చిన ఈ అవార్డుని గోదావరి ప్రజలకు అంకితం ఇస్తున్నా.

– రత్నవేలు



## కథ అమ్మలాంటిది

సినిమాల కోసం నేను హైదరాబాద్ వచ్చినప్పుడు రచయిత త్రివిక్రమ్ నన్ను ఆదరించాడు. నేను సినిమాల్లో నటించడం మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు తెలుగు ప్రేక్షకులు నన్ను చాలా బాగా ఆదరిస్తున్నారు. సినిమాకి కథ అమ్మలాంటిది. అటువంటి కథకు త్రివిక్రమ్ ప్రాణం పోస్తారు. స్క్రిప్ట్‌రాసే వాడు అమ్మలాంటి వారైతే... దర్శకుడు తండ్రిలాంటి వాడు. తల్లి, తండ్రి కలిసి సినిమాను తీసి, సినిమా ద్వారా ప్రపంచానికి మాలాంటి వారిని పరిచయం చేస్తున్నారు. ఈ రోజు 'సాక్షి' నుంచి అందుకున్న అవార్డు నాకు ఎంతో ప్రత్యేకమైనది. దీనికి ప్రధాన కారణం త్రివిక్రమే.

– సునీల్



## ఇంకేం ఇంకేం కావాలి

అత్యంత ప్రజాదరణ పొందిన 'ఇంకేం ఇంకేం కావాలే' పాటకు అవార్డు రావడం 'ఇంకేం ఇకేం కావాలే' అన్నట్టుగా ఉంది. పురస్కారం అనేది ఒక విజయం, ఒక గుర్తింపు. అటువంటి పురస్కారాన్ని సాక్షి నన్ను గుర్తించి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. 'గీత గోవిందం' సినిమా డైరెక్టర్ పరశురామ్‌గారు నాపై నమ్మకంతో పాట రాసే అవకాశం ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ పాట రాసి 300 మిలియన్ ప్రేక్షకులు ఆదరించగలిగే సామర్థ్యాన్ని తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

– అనంత శ్రీరామ్



## ప్రత్యేక గుర్తింపు

'సవ్యసాచి' సినిమాతో తెలుగు సినిమా పరిశ్రమకు నేను హీరోయిన్‌గా పరిచయం అయ్యాను. దీనికి ప్రధాన కారణం హీరో నాగచైతన్య. ఆయనకు థ్యాంక్స్. దర్శకుడు చందూమొండేటి నన్ను వెతికి మరీ హీరోయిన్‌గా సెలక్ట్ చేయబట్టే మీ ముందు ఇలా ఉన్నాను. 'సాక్షి' ప్రత్యేకంగా నన్ను గుర్తించి నా నటన మెచ్చుకుని ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేయడం సంతోషంగా ఉంది.

– నిధీ అగర్వాల్



## కష్టానికి ప్రతిఫలం

వందశాతం కష్టపడి 'గూఢచారి' సినిమాను తీశాను. సినిమా ప్రేక్షాకాదరణ పొందటమే కాకుండా నన్ను ఉన్నత శిఖరంలో నిలబెట్టింది ఈ సినిమా. వందశాతం కష్టపడి చేశాను కాబట్టే సాక్షి నన్ను గుర్తించి ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేసింది. అందుకు సాక్షికి నా ప్రత్యేక ధన్యవాదాలు. కష్టానికి ప్రతి ఫలమే ఎక్స్‌లెన్స్ అవార్డు.

–అడివి శేషు



## ఈ అవార్డు ప్రత్యేకం

గాయనిగా నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం నా కుటుంబ ప్రోత్సాహమే. ఇంతమంది కథానాయికలకు వాయిస్ ఓవర్ ఇస్తున్నాను అంటే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటమే కారణం. నా భర్త రాహుల్ రవీంద్రన్ నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, నా భుజం తడుతూ వెన్నుదన్నుగా నిలుస్తున్నాడు. ఈ రోజు సాక్షి అవార్డు అందుకోవడం ప్రత్యేకం. సోషల్ మీడియాలో అభినందనలతో పాటు తిట్లు వస్తుంటాయి. నేను కూడా అదే రీతిలో స్పందిస్తుంటాను.

– చిన్మయి












## ఆసియా అండర్-23 వాలీబాల్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్

భారత యువ వాలీబాల్ జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. ఆసియా అండర్-23 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మయన్మార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం జరిగిన సెమీఫైనల్ గ్రూప్ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 21-25, 25-16, 25-16, 25-22తో పాకిస్తాన్‌ను ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. నేడు జరిగే ఫైనల్లో చైనీస్ తైపీతో భారత్ ఆడుతుంది. అంతకుముందు సెమీఫైనల్ లీగ్ మ్యాచ్‌ల్లో చైనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లపై గెలుపొందింది.



# ఆడొచ్చు...అవాంతరం లేకుండా!

**నేడు భారత్, వెస్టిండీస్ రెండో వన్డే • మార్పుల్లేకుండానే ఇరు జట్లు**

**రాత్రి 7 గంటల నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**ఆట కంటే వర్షమే ఎక్కువ చర్చనీయాంశమైంది తొలి వన్డేలో. ఆ పరిస్థితి మళ్లీ తలెత్తకుండా ఉండాలని కోరుకుంటూ రెండో వన్డేకు సిద్ధమయ్యాయి భారత్, వెస్టిండీస్. ఇరు జట్లు ఈ మ్యాచ్ ద్వారా ప్రపంచ కప్ నైరాశ్యం నుంచి బయటపడాలని భావిస్తున్నాయి. కూర్పులో మార్పుల్లేకుండానే బరిలో దిగే ఆలోచనలో ఉన్నాయి. విండీస్ స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్‌కు ఇది 300వ వన్డే కావడం ఆతిథ్య జట్టుకు ప్రత్యేకతగా మారింది.**

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** వర్షం కారణంగా రద్దయినప్పటికీ... ఆట సాగినంత సేపు తొలి మ్యాచ్‌లో టీమిండియాదే పైచేయిగా కనిపించింది. అదే ఉత్సాహంతో కోహ్లి సేన ఆదివారం పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లోని క్వీన్స్‌పార్క్ ఓవల్ మైదానంలో జరిగే రెండో వన్డేలో వెస్టిండీస్‌తో తలపడనుంది. గురువారం నాటి మ్యాచ్ పూర్తిగా జరగనందున ఇరు జట్లు మార్పుల్లేకుండానే దిగే వీలుంది. విజయం సాధించిన జట్టు మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోని స్థితిలో నిలుస్తుంది కాబట్టి నేటి మ్యాచ్‌లో ఆసక్తికి లోటు ఉండకపోవచ్చు. అయితే... అందరి కళ్లు క్రిస్ గేల్‌పైనే ఉన్నాయి. కొంతకాలంగా అతడిని విండీస్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచే రికార్డు ఊరిస్తోంది. ఒకప్పటి గేల్ అయి ఉంటే ఆ రికార్డు ఎప్పుడో అతడి వశం అయ్యేది. కానీ, ఫామ్ లేమితో ఇబ్బంది పడుతు న్న అతడు కనీస సంఖ్యలో పరుగులు చేయలేకపోతున్నాడు. ఆదివారం వాటిని అందుకుంటే ఈ మ్యాచ్ కొంత విశిష్టత సంతరించుకుంటుంది.

### అటుఇటు వారే...

యువ పేసర్ ఖలీల్ అహ్మద్‌ను ఆడించాలా? లేదా? అనేది ఒక్కటే తుది జట్టుపై టీమిండియాకు ఉన్న సందిగ్ధత. తొలి వన్డేలో అతడు విండీస్ ఓపెనర్ ఎవిన్ లూయిస్‌కు అడ్డంగా దొరికిపోయాడు. పదేపదే లెగ్‌సైడ్ బంతులు వేసి లూయిస్ ఫామ్‌లోకి వచ్చేలా చేశాడు. ఖలీల్‌ను తప్పించినా, భువనేశ్వర్‌కు విశ్రాంతినిచ్చినా నవదీప్ సైనీకి అరంగేట్రం అవకాశం దక్కొచ్చు. పిచ్ అనుకూలిస్తుందని భావిస్తే మణికట్టు స్పిన్నర్ చహల్‌ను తీసుకునే వీలుంది. ఓవరాల్‌గా చూస్తే... మార్పుల్లేని జట్టును దింపడమే మేలని టీం మేనేజ్‌మెంట్ ప్రాథమిక ఉద్దేశంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో నంబరు స్థానంలో శ్రేయస్ అయ్యర్ పరుగులు చేస్తే చూడాలనేది అభిమానుల కోరిక. సొంతగడ్డ పైనే అయినా.. షమీ, భువీ పేస్‌ను తట్టుకోవడం ఎంత కష్టమో తొలి వన్డేలో విండీస్‌కు తెలిసొచ్చింది. ఏడో నంబరు వరకు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ప్రత్యర్థిని కట్టడి చేయాలంటే పేసర్లతో పాటు స్పిన్నర్లు జడేజా, కుల్దీప్ తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఓపెనర్ లూయిస్ పరుగులు సాధించడం విండీస్‌కు ఊరటనిచ్చినా... గేల్ ఫామ్ ఆందోళన పరుస్తోంది. ఓపెనర్లు విఫలమైనా హోప్, పూరన్, హెట్‌మైర్, చేజ్ రూపంలో విండీస్‌కు నాణ్యమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. లోయరార్డర్‌లో కెప్టెన్ హోల్డర్, బ్రాత్‌వైట్ రాణించగలరు. రోచ్, కాట్రెల్‌కు తోడు మూడో పేసర్‌గానూ వీరు బాధ్యత తీసుకుంటారు. బౌలింగ్‌లో కొంత బలహీనంగా ఉన్న కరీబియన్లు భారత బ్యాట్స్‌మెన్‌ను నిలువరిస్తేనే గెలుపు అవకాశాలుంటాయి.

### గేల్ @ 300

విండీస్ విధ్వంసక బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ ఈ మ్యాచ్‌తో 300 వన్డేలు ఆడిన 21వ ఆటగాడిగా రికార్డులకెక్కనున్నాడు. అంతేకాక లారా (299 వన్డేలు)ను అధిగమించి ఆ జట్టు తరపున ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్ కానున్నాడు. మరో 9 పరుగులు చేస్తే వన్డేల్లో లారా (10,405) అత్యధిక పరుగుల రికార్డును కూడా అతడు దాటే వీలుంది. గేల్ ప్రస్తుతం 10,397 పరుగులతో ఉన్నాడు.

### పిచ్, వాతావరణం

క్వీన్స్‌పార్క్ ఓవల్ మైదానం స్పిన్నర్లకు సహకరించే వీలుంది. ఇక్కడ 2010 నుంచి స్పిన్నర్ల సగటు 27.40 కాగా, పేసర్ల సగటు 32.12. ఈ మైదానంలో జరిగిన చివరి ఐదు వన్డేల్లో నాలుగు వర్షం ప్రభావానికి గురయ్యాయి. నేటి మ్యాచ్‌కు మాత్రం వాన ముప్పు లేదు. పాక్షికంగా మేఘావృతమై... 25 డిగ్రీల సెంటీగ్రేడ్ వాతావరణం ఆటకు అన్ని విధాల అనుకూలంగా ఉండనుంది.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, ధావన్, కోహ్లి, అయ్యర్, జాదవ్, పంత్, జడేజా, కుల్దీప్, భువనేశ్వర్, షమీ, ఖలీల్.

**వెస్టిండీస్:** గేల్, లూయిస్, హోప్, పూరన్, హెట్‌మైర్, చేజ్, హోల్డర్ (కెప్టెన్), అలెన్, బ్రాత్‌వైట్, రోచ్, కాట్రెల్.




# గేల్‌కు వీడ్కోలు టెస్టు లేదు

## వెస్టిండీస్ జట్టులో దక్కని చోటు



**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** ఒకే ఒక్క టెస్టు... సొంతగడ్డపై తన చివరి టెస్టు మ్యాచ్ ఆడి రిటైర్ అవుతానని ప్రకటించిన వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ ఆశలను ఆ దేశ సెలక్టర్లు తుంచేశారు. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం ప్రకటించిన 13 మంది సభ్యుల జట్టులో గేల్‌కు చోటు దక్కలేదు. ఈ నెల 30 నుంచి జమైకాలోని కింగ్‌స్టన్‌లో భారత్, విండీస్ మధ్య రెండో టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఆడి నిష్క్రమించాలనే కోరికను గేల్ ప్రపంచ కప్ సమయంలో వెలిబుచ్చాడు. అయితే ఐదేళ్ల క్రితం 2014లో తన చివరి టెస్టు ఆడిన గేల్‌ను ఇప్పుడు టెస్టు మ్యాచ్ కోసం పరిగణనలోకి తీసుకోవడం సరైంది కాదని రాబర్ట్ హేన్స్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భావించింది. 'గేల్ వన్డేలు, టి20ల్లో కొనసాగుతానంటే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. అతను ఆ ఫార్మాట్‌లలో ఇప్పటికీ విధ్వంసక బ్యాట్స్‌మన్. కానీ టెస్టు ఆడతానంటే మాత్రం కుదరదు. అతను ఐదేళ్లుగా టెస్టు బరిలోకి దిగలేదు. ఇప్పుడు ఒక్క మ్యాచ్ కోసం తీసుకురావడం అంటే మళ్లీ వెనక్కి వెళ్లినట్లే. యువ ఆటగాళ్లకు ఇది తప్పుడు సంకేతాలు ఇస్తుంది' అని దిగ్గజ పేసర్ కర్ట్‌లీ ఆంబ్రోస్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా సెలక్టర్లను ప్రభావితం చేసి ఉండవచ్చు. విండీస్ తరఫున 103 టెస్టులు ఆడిన గేల్ 42.18 సగటుతో 7,214 పరుగులు చేశాడు. ఇందులో 15 సెంచరీలు, 37 అర్ధ సెంచరీలు ఉండగా... అతని అత్యధిక స్కోరు 333 కావడం విశేషం.

**అల్జారీ జోసెఫ్ ఔట్!**

ఇంగ్లండ్‌తో తమ ఆఖరి టెస్టు సిరీస్ ఆడిన జట్టులో రెండు మార్పులతో వెస్టిండీస్ తమ టీమ్‌ను ప్రకటించింది. ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లో ఆడుతూ గాయపడిన అల్జారీ జోసెఫ్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దాంతో అతడిని ఎంపిక చేయలేదు. లెఫ్టార్మ్ స్పిన్నర్ జోమెల్ వారికాన్ మాత్రం జట్టులో చోటు కోల్పోయాడు. వీరిద్దరి స్థానంలో విండీస్ ఒకే మార్పు చేసింది. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ రహ్‌కీమ్ కార్న్‌వాల్‌ను తొలిసారి జట్టులోకి తీసుకుంది. తాజాగా భారత్‌తో ముగిసిన 'ఎ' సిరీస్‌లో రెండు టెస్టులు ఆడిన కార్న్‌వాల్ రెండు అర్ధసెంచరీలు చేసి 4 వికెట్లు పడగొట్టాడు. అటాకింగ్ బౌలింగ్‌తో పాటు లోయర్ ఆర్డర్‌లో ధాటిగా ఆడగల సామర్థ్యం వల్ల కార్న్‌వాల్‌కు అవకాశం కల్పించినట్లు విండీస్ సెలక్టర్లు చెప్పారు. భారత్, విండీస్ మధ్య ఆగస్టు 22 నుంచి తొలి టెస్టు జరుగుతుంది.

**విండీస్ టెస్టు జట్టు వివరాలు:** జేసన్ హోల్డర్ (కెప్టెన్), క్రెయిగ్ బ్రాత్‌వైట్, డారెన్ బ్రేవో, షమర్ బ్రూక్స్, జాన్ క్యాంప్‌బెల్, రోస్టన్ ఛేజ్, రహ్‌కీమ్ కార్న్‌వాల్, షేన్ డౌరిచ్, షనాన్ గాబ్రియెల్, షిమ్రాన్ హెట్‌మైర్, షై హోప్, కీమో పాల్, కీమర్ రోచ్.

# మళ్లీ నంబర్‌వన్‌గా ఒసాకా



**టొరంటో (కెనడా):** మహిళల టెన్నిస్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో జపాన్ ప్లేయర్ నయోమి ఒసాకా మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనుంది. మాంట్రియల్ ఓపెన్ డబ్ల్యూటీఏ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఒసాకా 3-6, 4-6తో మాజీ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. అయితే ప్రస్తుత నంబర్‌వన్‌గా ఉన్న యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా) ఈ టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఓడిపోవడంతో... సోమవారం విడుదల చేసే తాజా ర్యాంకింగ్స్‌లో ఒసాకా మళ్లీ టాప్ ర్యాంక్‌లోకి రానుంది.

# టైటిల్ పోరులో సిక్కి-అశ్విని జంట



**సాక్షి, హైదరాబాద్:** ఈ ఏడాది తొలి అంతర్జాతీయ డబుల్స్ టైటిల్ సాధించేందుకు నేలకుర్తి సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప (భారత్) జంట విజయం దూరంలో నిలిచింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-100 టోర్నమెంట్‌లో మహిళల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ సిక్కి రెడ్డి-అశ్విని ద్వయం ఫైనల్లోకి అడుగు పెట్టింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సిక్కి-అశ్విని జంట 21-12, 21-12తో ఫాన్ కా యాన్-వు యి టింగ్ (హాంకాంగ్) ద్వయంపై విజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో బేక్ హా నా-జుంగ్ క్యుంగ్ యున్ (దక్షిణ కొరియా) జోడీతో సిక్కి-అశ్విని జంట తలపడుతుంది.

**ఫైనల్లో సౌరభ్...**

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత జాతీయ చాంపియన్ సౌరభ్ వర్మ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సెమీఫైనల్లో ఏడో సీడ్ సౌరభ్ 23-21, 21-16తో ఇస్కందర్ జుల్కర్‌నైన్ (మలేసియా)పై గెలిచాడు. నేడు జరిగే ఫైనల్లో లో కీన్ యె (సింగపూర్)తో సౌరభ్ తలపడతాడు.

# ఇది సానుకూల మలుపు

**'నాడా'లో బీసీసీఐ చేరికపై క్రీడల మంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా డోపింగ్ విషయంలో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) పరిధిలోకి రావడాన్ని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతించారు. క్రీడల్లో పారదర్శకత కోసం ఇది కీలక మలుపు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఎలాంటి అంశాలు, సమస్యలు అపరిష్కృతంగా ఉండాలని నేను కోరుకోవడం లేదు. విభేదాలన్నీ పరస్పర చర్చలతో పరిష్కరించుకోవాలి. నేను క్రీడలు, క్రీడాకారుల మేలు కోరేవాడిని. వాటిలో అన్నీ పారదర్శకంగా జరగాలని భావిస్తా' అని రిజిజు అన్నారు. మరోవైపు క్రీడాశాఖతో చర్చల కోసం బోర్డు సీఈఓ రాహుల్ జోహ్రిని పంపడాన్ని బీసీసీఐ సీనియర్ సభ్యులు ఒకరు తప్పు పట్టారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ చేర్చాలని ప్రయత్నిస్తున్న ఐసీసీ బృందంలో జోహ్రి కూడా సభ్యుడని... దానికి ఉన్న డోపింగ్ అడ్డంకిని తొలగించేందుకే క్రికెట్‌నూ 'నాడా'లో చేర్చేందుకు జోహ్రి అంగీకరించారని ఆయన విమర్శించారు.

# తలైవాస్‌ను గెలిపించిన అజయ్

**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 34-28తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌ను ఓడించింది. తలైవాస్ తరఫున అజయ్ ఠాకూర్ 9 పాయింట్లతో మెరిశాడు. రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా అజయ్ తన సూపర్ రైడ్ ద్వారా మూడు పాయింట్లు సాధించి జట్టుకు ఒంటి చేత్తో విజయాన్ని అందించాడు. రెండో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 32-30తో పుణేరి పల్టన్‌పై నెగ్గింది. **నేటి మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో హరియాణా స్టీలర్స్; గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడతాయి.**

# నాలుగో స్వర్ణంపై రెజ్లర్ వినేశ్ గురి

**న్యూఢిల్లీ:** భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఈ సీజన్‌లో నాలుగో స్వర్ణానికి గెలుపు దూరంలో నిలిచింది. బెలారస్‌లో జరుగుతున్న మెద్వేద్ ఓపెన్ టోర్నమెంట్‌లో వినేశ్ 53 కేజీల విభాగంలో ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో వినేశ్ 11-0తో యాఫ్రెమెన్కా (బెలారస్)పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో రష్యా రెజ్లర్ మలిషెవాతో ఆడుతుంది. ఈ సీజన్‌లో వినేశ్ స్పెయిన్ గ్రాండ్‌ప్రి, యాసర్ డొగో టోర్నీ, పోలాండ్ ఓపెన్ టోర్నీల్లో పసిడి పతకాలు సాధించింది.





# భారత్ 'ఎ' చేజారిన విజయం

- వెస్టిండీస్ 'ఎ'తో చివరి టెస్టు 'డ్రా'
- సిరీస్ 2-0తో టీమిండియా సొంతం
- షాబాజ్ నదీమ్‌కు 5 వికెట్లు

**టరోబా (ట్రినిడాడ్ అండ్ టొబాగో):** వెస్టిండీస్ 'ఎ'తో తొలి రెండు అనధికారిక టెస్టులు గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత్ 'ఎ' క్లీన్ స్వీప్ చేసే అవకాశాన్ని మాత్రం చేజార్చుకుంది. మూడో టెస్టులో చివరి రోజు విండీస్ బ్యాట్స్‌మెన్ చక్కటి పోరాటపటిమ కనబర్చడంతో ఆ జట్టు 'డ్రా'తో గట్టెక్కింది. 373 పరుగుల విజయలక్ష్యంతో ఆడుతూ విండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో చివరకు 6 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. షాబాజ్ నదీమ్ (5/103) మరోసారి రాణించినా... ఇతర బౌలర్ల వైఫల్యంతో భారత్ తమ ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోయింది. శుక్రవారం మొత్తం 94 ఓవర్లు ఆడిన విండీస్ 6 వికెట్లు మాత్రమే కోల్పోయింది. జెరెమీ సొలొజానో (250 బంతుల్లో 92; 8 ఫోర్లు), బ్రెండన్ కింగ్ (83 బంతుల్లో 77; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), సునీల్ ఆంబ్రిస్ (142 బంతుల్లో 69; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో జట్టును ఓటమి నుంచి రక్షించారు. భారత్ 'ఎ' కెప్టెన్, ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. నదీమ్ ఈ సిరీస్ నాలుగు ఇన్నింగ్స్‌లలో మూడుసార్లు ఐదేసి వికెట్ల చొప్పున మొత్తం 15 వికెట్లు పడగొట్టడం విశేషం. ఈ పర్యటనలో 4-1తో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత్ 'ఎ', టెస్టు సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది.






# యువశక్తి పర్యావ'రణం'

వాళ్లంతా 15, 16, 17 సంవత్సరాల వయసున్న వారు. అప్పుడప్పుడే యవ్వనం రెక్కలు విచ్చుకుంటున్న వారిలో ఒక సామాజిక స్పృహ ఉద్యమం బాట పట్టించింది. ఎక్కడి యువతకైనా కెరీర్ ముఖ్యమని అనుకుంటారు. కానీ నేటితరం వాతావరణంలో మార్పులు తమ భవిష్యత్‌ను ఎక్కడ దెబ్బ తీస్తాయోనన్న ఆందోళనతో ఉంది. స్కూళ్లు, కాలేజీలు ఎగ్గొట్టి మరీ దాదాపు 125కు పైగా దేశాల్లో యువతీ యువకులు పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని మొదలుపెట్టారు. వాతావరణంలో అనూహ్యమైన మార్పులు వస్తున్నా, కాలుష్యం పెరిగిపోతూ అందరి ఉసురుతీస్తున్నా, ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాల వైఖరిపై యువశక్తి నిరసన గళమెత్తుతోంది. 'భూమి తప్ప మనకు వేరే దిక్కు లేదు. మీరు మా భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. మీరు కాస్త పెద్దల్లా ప్రవర్తించండి.. లేదంటే ఆ పని మేమే చేస్తాం'అంటూ వీధుల్లోకి వచ్చి నినదిస్తున్నారు. 16 ఏళ్ల వయసున్న స్వీడిష్ బాలిక గ్రేటా థున్ బెర్గ్ గతేడాది బడి మానేసి మొదలుపెట్టిన ఈ ఉద్యమం అంతకంతకూ కార్చిచ్చులా వ్యాపించింది. ఆ అమ్మాయి ఇచ్చిన స్ఫూర్తితో ప్రపంచదేశాల్లో యువతరం చేతులు కలిపింది. 'మాకిప్పుడు 16 ఏళ్లు. మరో రెండేళ్లలో ఓటు హక్కు వస్తుంది. పాలకులారా ఇకనైనా కళ్లు తెరవండి. మాకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇచ్చే బాధ్యత మీదే. పర్యావరణ పరిక్షణకు మీరేం చేస్తే అది చెయ్యండి. లేదంటే మా ఓట్లు మీకు పడవు'అంటూ హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం యువతరం చేస్తున్న ఈ ఉద్యమం ఈ ఏడాది అందరినీ ఆకర్షిస్తోంది. నోబెల్ శాంతి బహుమతి కోసం కూడా నామినేట్ అయిన గ్రేటా థున్ బెర్గ్ 'అంతం కాదిది ఆరంభం'అంటూ చేసిన ట్వీట్ సంచలనం సృష్టించింది. యూత్ యాక్షన్ ఆన్‌క్లైమేట్ చేంజ్ పేరిట సదస్సులు నిర్వహిస్తూ పర్యావరణం తమ భవిష్యత్‌ను దెబ్బతీస్తుందన్న ఆందోళనతో యువత కదంతొక్కుతోంది.



● గ్రేటా థున్ బెర్గ్



## క్లుప్తంగా...



### తెప్పపై బైకు!

**అర్వపల్లి:** మూసీనది ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో స్థానికులు కొందరు తెప్పలు ఏర్పాటు చేసి నది అవతలి ఇవతలి వైపునకు ప్రయాణికులను దాటిస్తున్నారు. ఒక బైక్‌ను తెప్పపై తీసుకెళ్తే రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు.

### తగ్గుతూ..పెరుగుతున్న గోదావరి

**మేడిగడ్డ బ్యారేజీలో 65 గేట్లు, అన్నారంలో 10 గేట్లు ఎత్తివేత**

**కాళేశ్వరం:** కాళేశ్వరం వద్ద గోదావరి తగ్గుతూ.. పెరుగుతూ ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం 8.65 మీటర్ల ఎత్తులో ప్రవహించిన గోదావరి శనివారం 9.41 మీటర్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో గేట్లు ఎత్తడంతో నీరు దిగువకు తరలిపోతోంది. మేడిగడ్డ బ్యారేజీలో 65గేట్లు ఎత్తగా 2.69 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు పోతుండగా.. ఇన్‌ఫ్లో 2.69 లక్షల క్యూసెక్కు లు ఉంది. బ్యారేజీ వద్ద నీటి నిల్వ 3.352 టీఎంసీలు ఉంది. అన్నారం బ్యారేజీలో మానేరు, సుందిళ్ల నుంచి వచ్చే వరదతో ఉధృతి పెరిగింది. 10 గేట్లు ఎత్తగా దిగువకు 45,310 క్యూసెక్కుల వరద పోతుండగా.. ఇన్‌ఫ్లో 23,240 క్యూసెక్కులు వస్తుంది. బ్యారేజీలో నీటినిల్వ 7.58 టీఎంసీలు కాగా.. గోదావరి నీటి లెవల్ 117.50 మీటర్లు ఉంది. కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటార్లు నడపడం లేదు.

### రామ మందిరం నిర్మించి తీరుతాం

**ఎంపీ బండి సంజయ్‌కుమార్**



**కరీంనగర్ కల్చరల్:** ఆరు నూరైన రామ మందిరాన్ని నిర్మించి తీరుతామని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో జరుగుతున్న మన్మహాభారత ప్రవచనాను తొమ్మిదో రోజు శనివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం గొప్పదని, హిందువుగా భారతదేశంలో పుట్టడం భారతీయులందరి అదృష్టమని పేర్కొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతానన్నారు.

### టీకా వికటించి చిన్నారి మృతి

**విచారణ చేపట్టిన డీఎంహెచ్‌వో**



**మోపాల్:** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం శ్రీరాంనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల శివలాల్ తండాలో శనివారం టీకా వికటించి ఓ చిన్నారి మృతి చెందింది. తండాలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. అరుణ, హన్మాన్ సింగ్ దంపతుల తమ చిన్న కూతురు చిన్నారి (3 నెలలు)కి పోలియో రాకుండా చుక్కలు వేసి, టీకాలు ఇచ్చారు. ఇంటికి చేరుకున్న వెంటనే చిన్నారి ముక్కులో నుంచి రక్తం వచ్చింది. వైద్య సిబ్బంది వచ్చేలోపే చిన్నారి మృతి చెందింది. డీఎంహెచ్‌వో సుదర్శనం విచారణ చేపట్టారు.

### 'యాదాద్రి' పాతగుట్టలో పవిత్రోత్సవాలు

**యాదగిరికొండ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలోని పాతగుట్ట ప్రధానాలయంలో శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఉత్సవాలకు ఆధ్యుడైన విశ్వక్సేనుడికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సంప్రోక్షణ చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. వేద మంత్రాలతో అగ్నిప్రతిష్ట చేసి దేవతా మూల మంత్రాలతో హవనం చేశారు.

# వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు

**నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ పిలుపు**

- ఘనంగా హైదరాబాద్ ఐఐటీలో 8వ స్నాతకోత్సవం
- విద్యార్థులు కొత్త విషయాలు కనుగోవాలని సూచన
- 528 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ పాసవుట్

**సాక్షి, సంగారెడ్డి:** వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చడానికి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు రావాలని నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ 8వ స్నాతకోత్సవం శనివారం సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అమితాబ్ కాంత్ మాట్లాడుతూ.. భారతదేశం టెక్నాలజీ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. తయారీ రంగంలో ఇండియా జీడీపీ 18 శాతం ఉన్నదని, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే హైదరాబాద్ ఐఐటీలో టీచింగ్‌తో పాటు రీసెర్చ్‌కు ప్రాధాన్యమివ్వడం అభినందనీయమని తెలిపారు. హెల్త్, ఎడ్యుకేషన్, రీసైక్లింగ్ ఆఫ్ వాటర్ లాంటి అంశాలలో రీసెర్చ్ జరుగుతుండటం శుభ సూచకమని చెప్పారు.

**కొత్త ఆవిష్కరణల దిశగా..**

ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కొత్త ఆవిష్కరణ దిశలో విద్యాభ్యాసాన్ని, రీసెర్చ్‌ను కొనసాగించాలని కాంత్ సూచించారు. వైద్యం, టెక్నాలజీలలో కొత్త విషయాలు కనుకొనడానికి కృషి చేయాలని సూచించారు.

**సామాజిక ప్రయోజనానికి వినియోగించాలి**

హైదరాబాద్ ఐఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఐఐటీలో హెల్త్‌కేర్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ టెక్నాలజీలో 14 వివిధ కంపెనీలు ఉన్నాయని చెప్పారు. ఈ ఐఐటీలో 35 శాతం ఫ్యాకల్టీ మెంబర్లు పీహెచ్‌డీ ఉన్నారని, దీంతో విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన బోధన అందుతోందని చెప్పారు.



విద్యార్థినికి బంగారు పతకం అందజేస్తున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం

**రీసెర్చ్‌కు ప్రాధాన్యం**

ఐఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ సుబ్రమణ్యన్ మాట్లాడుతూ.. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో టీచింగ్ తోపాటు రీసెర్చ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. దేశంలోని 23 యూనివర్సిటీల్లో హైదరాబాద్ ఐఐటీ 8వ ర్యాంకు సాధించిదన్నారు. ప్రతిష్టాత్మక వర్సిటీలకు తీసిపోని విధంగా విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. దేశ విదేశాలలోని 60 వర్సిటీలతో ఎంఓయూ ఉందన్నారు. మూడేళ్లలో మరో 2 వేల మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే విధంగా ఐఐటీలో రెండో విడత నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

**బంగారు పతక విజేతలు వీరే..**

- సుక్రుత్ శ్రీధర్‌రావు (బీటెక్)
  - భారత రాష్ట్రపతి గోల్డ్ మెడల్
- మనజిత్‌దాస్ (ఎంఎస్సీ)
  - ఇన్‌స్టిట్యూట్ గోల్డ్‌మెడల్
- వంగ రోహిణి (ఎంటెక్)
  - ఇన్‌స్టిట్యూట్ గోల్డ్‌మెడల్
- సిన్హావైభవ్ బీరేంద్రకుమార్ (బీటెక్)
  - ఎక్సలెన్స్ ఇన్ అకాడమిక్ అండ్ కో–కరిక్యులర్ యాక్టివిటీస్

వీరితోపాటు మరో 22 మంది విద్యార్థులకు పలు విభాగాల్లో సిల్వర్ మెడల్స్ ప్రదానం చేశారు. మొత్తం 528 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ పాసవుట్ అయ్యారు. వీరిలో 69 మంది పీహెచ్‌డీ విద్యార్థులున్నారు.

# 'కూలి'న బతుకుకు సాయం

**కూలీగా అవతారం ఎత్తిన సబ్ రిజిస్ట్రార్**

- వరినాట్లేసి రూ. 250 కూలి డబ్బులు తీసుకున్న వైనం
- మరింత డబ్బు కలిపి పేద కుటుంబానికి ఆర్థిక సాయం

**ములుగు:** భూపాలపల్లి, ములుగు ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శనివారం దినసరి కూలీ అవతారం ఎత్తారు. సెలవు రోజు కావడంతో తన స్వగ్రామం ములుగు మండలం రామచంద్రాపురం వెళ్లారు. కౌలు రైతు రాఘవరెడ్డి–నీలమ్మ దంపతులకు చెందిన పొలంలో ఉదయం నుంచి కూలీలతో కలసి వరి నాట్లు వేశారు. అనంతరం పొలం గట్లపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. కూలీలు తరచుగా భోజనంలో తీసుకవచ్చే ఆవకాయ పచ్చడితో తిన్నారు. సాయంత్రానికి మధ్య మధ్యలో బురద జంబు తోలారు. పని ముగించుకున్న అనంతరం రైతు రాఘవరెడ్డి నుంచి రూ.250 కూలిగా తీసుకున్నారు.

**కూలి డబ్బుకు మరింత కలిపి ఆర్థిక సాయం**

గ్రామానికి చెందిన చాకలి సారమ్మ వృద్ధాప్యంలోనూ మరుగుజ్జుగా ఉన్న తన ముగ్గురు పిల్లలను కష్టపడి పోషిస్తోంది. విషయం తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా తనకు వచ్చిన కూలి డబ్బులకు మరికొంత కలిపి ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా తస్లీమా మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, గడిచిన ఐదేళ్లలో ఏడాదిలో ఒకరోజు గ్రామాలకు వెళ్లిన సందర్భంగా రైతులతో కలసి వరి నాటు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తస్లీమా తనలో ఉన్న మరో కోణంతో ఆదర్శంగా నిలిచారు.



వరినాట్లు వేస్తున్న ములుగు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా



చాకలి సారమ్మ కుటుంబ సభ్యులతో తస్లీమా

# సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అవార్డు

- పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కృషికిగాను ఎంపిక
- ఈనెల 21న ఢిల్లీలో ప్రదానం

**సిద్దిపేట రూరల్:** సిద్దిపేట జిల్లా కలెక్టర్ పి.వెంకట్రామిరెడ్డి జాతీయ స్థాయిలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎక్సలెన్సీ ఇన్ గవర్నెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులను, పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరవేస్తూ మంచి పాలనా ప్రక్రియకు నాంది పలికే కలెక్టర్లకు ఈ అవార్డును అందిస్తారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఆధ్వర్యంలోని కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేశారు. దేశంలోని 688 జిల్లాల్లో కలెక్టర్ల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఎక్స్‌ప్రెస్ గ్రూప్ సంస్థ రెండేళ్ల కోసారి ఈ అవార్డులను ప్రకటిస్తుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కమిటీ చైర్మన్‌గా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ చైర్మన్ వివేక్ గోయెంక, రమానత్ గోయెంక సభ్యులుగా ఉన్న ఈ కమిటీ అవార్డులను ప్రకటిస్తుంది. 15 కేటగిరీలను ప్రామాణికంగా తీసుకుని జాతీయ స్థాయిలో ఉత్తమ ఐఏఎస్ అధికారులను ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరిస్తారు. అందులో భాగంగానే సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందించడంలో జిల్లాలో మెరుగైన ఫలితాలను సాధించడంతో ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ముఖ్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మెరుగైన ఫలితాలు, అక్షరాస్యత పెంపు, తదితర అంశాలను పరిశీలించిన కమిటీ కలెక్టర్‌కు ఈ అవార్డును ప్రకటించింది. ఈ నెల 21న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ఈ అవార్డును అందుకోనున్నారు.



**సమష్టి కృషికి ఫలితం: కలెక్టర్**

దేశస్థాయిలో గుడ్ గవర్నెన్స్ అవార్డు రావడం సంతోషంగా ఉందని కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సమష్టి కృషి ఫలితమే ఈ అవార్డు వచ్చిందన్నారు. సీఎం సొంత జిల్లా కావడంతో జిల్లా అధికారులమంతా ప్రణాళికబద్ధంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగామని చెప్పారు. సీఎం దిశానిర్దేశం మేరకు సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించడంలో అధికారుల సహకారం ఎంతో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

### జూరాలకు 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**గద్వాల టౌన్/ ధరూరు:** జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తోంది. శనివారం ఎగువ నుంచి 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 45 గేట్లను ఎత్తి 6.11 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. ఆదివారం 7 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. లోయర్ జూరాల జలవిద్యుత్ కేంద్రం వద్ద నీటిమట్టం పెరగడంతో గద్వాల మండలం రేకులపల్లి శివారులోని 150 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఎగువ, లోయర్ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపేశారు. గద్వాల పట్టణ సమీపంలోని నదీ అగ్రహారం పుష్కరఘాట్ మునిగిపోయింది.

## ఇసుక 'క్యూ'..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, కాటారం మండలాల్లోని రీచుల వద్ద లారీలు బారులుతీరాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచుల్లోకి నీరు చేరింది. దీంతో మహదేవపూర్, కాటారం మండలాల్లోని రీచుల నుంచి ఇసుక బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. ఇసుక లోడ్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న లారీలు ఇలా బారులుదీరాయి.**

– సాక్షి, భూపాలపల్లి

### 'పోషణ్ అభియాన్'లో సంగారెడ్డికి అవార్డు

**23న ఢిల్లీలో అవార్డు ప్రదానం**

**సాక్షి, సంగారెడ్డి:** కేంద్రం ప్రవేశపెట్టిన 'పోషణ్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా మాతా శిశు సంరక్షణ, గర్భిణుల ఆరోగ్యం, పిల్లల్లో పౌష్టికారం పెంపుదల విషయంపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించడం, ఆచరించడంలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయడంలో చూపించిన చొరవతో సాధించిన సత్ఫలితాలకు కలెక్టర్ ఎం.హనుమంతరావును కేంద్రం 2018–19కిగాను 'పోషణ్ అభియాన్'అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవడానికి ఈ నెల 23న ఢిల్లీకి రావాల్సిందిగా కేంద్రం ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ హనుమంతరావుకు శనివారం తెలియ జేసింది.



చంద్రవ్వ అంతిమ యాత్రలో పాల్గొన్న సర్పంచ్, పాలకవర్గం

# పాడె మోసిన పాలకవర్గం

**గుర్రాలగొందిలో గౌరవ అంతిమ సంస్కారం**

**అంతిమ సంస్కార ఖర్చులు భరించిన గ్రామ పంచాయతీ**

**సిద్దిపేట రూరల్:** సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో శనివారం గౌరవ అంతిమ సంస్కారాన్ని గ్రామ ప్రజలు, పాలకవర్గం సమష్టిగా నిర్వహించింది. గ్రామానికి చెందిన కంకణాల చంద్రవ్వ (85) మృతి చెందడంతో ఆమెకు గ్రామ పంచాయతీ సొంత ఖర్చులతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు పాడె మోశారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇచ్చిన స్ఫూర్తితో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉచితంగా అంతిమ సంస్కారాలు నిర్వహించి రాష్ట్రంలో మొదటి గ్రామంగా నిలిచింది. హరీశ్‌రావు తన వంతు సాయంగా రూ.50 వేలు విరాళం అందజేశారు. అలాగే ప్రజాప్రతినిధుల ద్వారా సేకరించిన విరాళాలతోపాటు ప్రభుత్వ నిధులు కలిపి మొత్తం రూ.8 లక్షలతో అంతిమ సంస్కారాల నిర్వహణ నిధిని ఏర్పాటు చేశారు.

# ఆమె త్యాగం.. 'సజీవం'

- సరితకు బ్రెయిన్ డెడ్.. అవయవాల దానం
- 5 కిలోమీటర్ల దూరం.. 10 నిమిషాల్లో గుండె తరలింపు



**ముస్తాబాద్ (సిరిసిల్ల):** తాను మరణించినా మరో నలుగురికి ప్రాణదానం చేశారా మానవతామూర్తి. కలకాలం తోడునీడగా ఉంటుందనుకున్న భార్య.. అనూహ్య రీతిలో బ్రెయిన్‌డెడ్ కాగా.. ఆమె అవయవాలు దానం చేసి త్యాగనిరతిని ప్రదర్శించారు భర్త. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన ఎరవెల్లి వినిల్ – సరిత దంపతులు. వినిల్ హైదరాబాద్‌లో దంత వైద్యుడిగా వైద్యసేవలు అందిస్తున్నారు. రెండురోజుల క్రితం సరిత అధిక రక్తపోటుకు గురై ఇంట్లో కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. తలలో రక్తనాళాలు చిట్లిపోయి తీవ్ర రక్తస్రావం జరిగినట్లు డాక్టర్లు గుర్తించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు సరిత బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు తేల్చారు. తన భార్యను రక్షించుకోలేక పోయామని భర్త వినిల్ కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఒక వైద్యుడిగా అంతకు మించి మానవతావాదిగా ఆలోచించిన భర్త వినిల్.. బ్రెయిన్‌డెడ్ అయిన భార్య సరిత అవయవాల దానానికి అంగీకరించారు. శుక్రవారం సరిత గుండె, కాలేయం, కార్నియా, మూత్ర పిండాలను వైద్యులు సేకరించారు. హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో గుండె అవసరమున్న ఓ యువతికి ఆ గుండెను అమర్చేందుకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి నుంచి 5 కి.మీ. దూరంలోని నాంపెల్లిలోని కేర్ ఆస్పత్రికి సరిత గుండెను పది నిమిషాల్లో తరలించారు. 18 ఏళ్ల యువతికి గుండెను అమర్చారు. అలాగే సరిత మూత్ర పిండాలు, కార్నియా, కాలేయం మరో ముగ్గురికి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సరిత మరణించినా ఆమె నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. సరిత స్వగ్రామం పోత్గల్‌లో ఆమె త్యాగాన్ని గ్రామస్తులు స్మరించుకుంటున్నారు. భర్త వినిల్ మానవతావాదిగా.. నాలుగు కుటుంబాలకు జీవితాన్ని ఇచ్చిన వ్యక్తిగా అభినందిస్తున్నారు.



### సాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రయాణం

**ఏర్పాట్లు చేస్తున్న అధికారులు**

**నాగార్జునసాగర్:** నాగార్జునసాగర్ టు శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సన్నాహాలు చేస్తోంది. రెండ్రోజుల టూర్‌ను వారంలో రోజుల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల అనుమతి కోసం ఫైల్‌ను పంపనున్నారు. రెండ్రోజుల ప్రయాణ ప్యాకేజీలకు సంబంధించి ఉన్నతాధికారులకు ఫైల్ పంపుతున్నామని, వారి నుంచి అనుమతి రాగానే వివరాలు వెల్లడిస్తామని లాంచీ యూనిట్ మేనేజర్ గంగారాం తెలిపారు.



## తరం మారుతున్నది.. స్వరం మారుతున్నది



పెళ్లి అంటే వధువు తల్లిదండ్రులకే అన్ని రకాలుగా భారం. కట్నం ఇవ్వాలి.. పెళ్లి ఖర్చులు పెట్టుకోవాలి.. సంసారానికి కావాల్సిన సరంజామా సమకూర్చాలి. కానీ నేటి తరం భిన్నమైన మార్గంలో పయనిస్తోందని తాజా సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా లెండ్స్ సంస్థ యువత మనోగతం తెలుసుకునేందుకు ఓ సర్వే నిర్వహించింది. 2018–19 సంవత్సరంలో యువతరం పెట్టుకున్న రుణాల దరఖాస్తుల్లో 20 శాతం వారి పెళ్లి కోసమేనని వెల్లడైంది. జీవితాంతం గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకం లాంటి పెళ్లి ఖర్చును తమ సొంత డబ్బుతోనే చేసుకోవాలన్న ఆలోచన నేటి తరంలో పెరుగుతున్నట్లు వెల్లడించింది. ఇక యువతీ యువకుల్లో ప్రపంచాన్ని చుట్టేసి రావాలన్న కోరిక బాగా ఉంది. రుణాల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ప్రయాణాల కోసమే 70 శాతం దాకా ఉన్నాయి. మిగిలినవన్నీ విద్యా రుణాలు, సొంతంగా కొత్త కంపెనీలు పెట్టేందుకు ఉన్నాయి. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మెట్రోనగరాల్లో 25–30 ఏళ్ల వయసు మధ్యనున్న వారు దేని కోసం రుణాలు తీసుకుంటున్నారో తెలుసుకునేందుకు సర్వే నిర్వహించారు. 'ఈ తరం పిల్లలు తమ కాళ్ల మీద తాము నిలబడాలని అనుకుంటున్నారు. తమ పెళ్లి కోసం రుణాలు తీసుకోవడం గతంలో ఎప్పుడూ లేదు. అమ్మాయి తల్లిదండ్రులే అన్నీ చేయాలన్న ధోరణిలో బాగా మార్పు వస్తోంది' అని ఇండియాలెండ్స్ సంస్థ సీఈవో రవ్ చోప్రా చెప్పారు. ముంబైలో అత్యధికంగా 22 శాతం పెళ్లి కోసం రుణాలు తీసుకుంటే.. హైదరాబాదీల్లో 20 శాతం మంది ప్రయాణాల కోసమే లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారట.

## సూర్యుడికి మస్కా కొట్టేలా..



మన రహదారులు నెత్తురోడుతున్నాయి. గతేడాది రోడ్డు ప్రమాదాల కారణంగా దేశవ్యాప్తంగా ఏకంగా 1.49 లక్షల మంది బలయ్యారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా బలయ్యేది యువతే. ఆ సమస్య పరిష్కారానికి కూడా యువతే నడుం బిగించింది. గాంధీనగర్ ఐఐటీ విద్యార్థులు సౌరిత్రా గర్గె, జైషాలు వినూత్నమైన పరిష్కారాన్ని కనుగొన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణాల్లో ఎండ నేరుగా కళ్లల్లో పడటం కూడా ఒకటి. ఆ సమస్యను అధిగమించేందుకు ఈ విద్యార్థులు ఓ పరికరాన్ని కనిపెట్టారు. దీన్ని వినియోగిస్తే ప్రమాదాలు తగ్గి ఎన్నో ప్రాణాలు కాపాడొచ్చని చెబుతున్నారు. కారు అద్దాల్లోంచి సూర్యకిరణాలు కళ్లల్లోకి వెళ్తే ఏమీ కనిపించదు. దాన్ని నివారించేందుకు ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారుచేశారు. కారు కిటికీ అద్దానికి దీన్ని అమరిస్తే సూర్యుడి నుంచి వచ్చే కాంతిని అది తగ్గిస్తుంది. ప్రొఫెసర్ అలాన్ సలహాతో సూర్యకాంతి నుంచి రక్షించే ఆ పరికరాన్ని తయారు చేసినట్లు ఆ విద్యార్థులు చెప్పారు. 15 రోజుల పాటు కష్టపడి స్మార్ట్ సన్‌వైజర్ అనే పరికరాన్ని రూపొందించారు. ప్రస్తుతం దీని ధర రూ.5 వేలుగా నిర్ణయించారు.

## క్లుప్తంగా...



### బంగారు ఇస్త్రీ పెట్టెలు

**నాలుగు ఐరన్ బాక్సుల్లో 9.2 కేజీల బంగారం**

**శంషాబాద్:** బంగారం అక్రమ రవాణాను అధికారులు అడ్డుకుంటున్నా.. అక్రమార్కులు మాత్రం కొత్త దారులు వెతుకుతూనే ఉన్నారు. తాజాగా దుబాయి నుంచి ఇస్త్రీ పెట్టెల్లో భారీ ఎత్తున బంగారాన్ని తీసుకువచ్చిన ఓ ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి దుబాయి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఈకే–528 విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన కస్టమ్స్ అధికారులు అతడి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించారు. రెండు బ్యాగుల్లో ఉన్న నాలుగు ఇస్త్రీ పెట్టెలను విప్పిచూడగా.. ఇస్త్రీ పెట్టెను వేడి చేసేందుకు వీ ఆకారంలో ఉండే కాయిల్స్ రూపంలో 9.2 కేజీల బంగారం బయటపడింది. బహిరంగ మార్కెట్‌లో ఈ బంగారం విలువ రూ.3.46 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.

### విహారయాత్రలో విషాదం

**కులూమనాలిలో హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు మృతి**



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

**హైదరాబాద్:** నగరానికి చెందిన ఓ వైద్యుడు హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూమనాలి విహారయాత్రకు వెళ్లి అక్కడ మృతి చెందారు. దీంతో కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ పరిధిలోని సమతాపురి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కర్నూలు జిల్లా నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్క వేమారెడ్డి–లక్ష్మిల దంపతుల చిన్న కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి(24) నగరంలోని ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఫిజియోథెరపీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సమతాపురి కాలనీకి చెందిన స్నేహితులు విశాల్, అఖిల్‌తో కలసి హిమాచల్ ప్రదేశ్‌లోని కులూ మనాలికి బుధవారం వెళ్లారు. శనివారం విహారయాత్రలో రోప్‌వేలో ప్రయాణిస్తుండగా వైర్లు తెగిపడ్డాయి. దీంతో పారాచూట్ సహాయంతో కిందికి దిగేందుకు ప్రయత్నించగా అది సరిగ్గా తెరుచుకోకపోవడంతో కిందపడి పోయారు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయాన్ని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా మాట్లాడించి మృత దేహాన్ని నగరానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# 'రామప్ప'కు టైమొచ్చింది!

- సెప్టెంబర్ 25న పరిశీలనకు యునెస్కో బృందం
- నిర్మాణం ప్రత్యేకమైందేనని భావిస్తే గుర్తింపు
- అదే జరిగితే తొలి ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు
- చార్మినార్, గోల్కొండ, కుతుబ్‌షాహీ సమాధులకు దక్కని హోదా

**సాక్షి, హైదరాబాద్:** నీటిలో తేలియాడే ఇటుకలను ప్రపంచానికి పరిచయం చేసిన 'రామప్ప'కు యునెస్కో పట్టాభిషేకం చేసే తరుణం ఆసన్నమైంది. చార్మినార్, కుతుబ్‌షాహీ సమాధులకు ప్రపంచ వారసత్వ హోదా తిరస్కరించిన ఐక్యరాజ్యసమితి విద్య, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ఈసారి రామప్ప దేవాలయాన్ని పరిగణనలోకి తీసుకోనుంది. వచ్చే నెల 25న యునెస్కో బృందం రాష్ట్రానికి రానుంది. ఆ అద్భుత దేవాలయానికి ప్రపంచ వారసత్వ హోదా కల్పించాల్సిందిగా 2017లో భారత ప్రభుత్వం యునెస్కోకు దరఖాస్తు చేసింది. దాని ప్రత్యేకతలు, అది అద్భుత నిర్మాణంగా మారటానికి అందులో నిగూఢమైన అంశాలను వివరిస్తూ డోషియర్ (దరఖాస్తు ప్రతిపాదన) దాఖలు చేసిన ఇంతకాలానికి దాన్ని పరిశీలించేందుకు ఆ సంస్థ రానుంది.

**ఈ సారి వస్తుందనే ధీమా..**

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ప్రపంచ వారసత్వ హోదా దక్కించుకున్న కట్టడాలు/ప్రాంతాలు ఏవీ లేవు. దీంతో రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలో చార్మినార్, గోల్కొండ, కుతుబ్‌షాహీ సమాధులను యూనిట్‌గా చేసి యునెస్కోకు దరఖాస్తు చేశారు. కానీ హైదరాబాద్‌కు వచ్చిన ఆ సంస్థ ప్రతినిధులు అక్కడి కబ్జాలు చూసి అవాక్కయ్యారు. కట్టాడాల్లోకి చొచ్చుకొచ్చినట్లు ప్రైవేటు నిర్మాణాలుండటం, కట్టడాలకు అతి చేరువగా వాహనాలు వెళ్తుండటం, ఓ పద్ధతి లేకుండా దుకాణాలు వెలియటంతో గుర్తింపు ఇవ్వలేమని యునెస్కో తిరస్కరించింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం రామప్ప దేవాలయాన్ని యునెస్కో దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించి కేంద్రాన్ని కోరింది. దీంతో 2017లో కేంద్రం యునెస్కోకు దరఖాస్తు చేసింది. అయితే, ఆలయ ప్రత్యేకతలకు సంబంధించిన వివరాలు సరిగా లేవంటూ యునెస్కో తిప్పి పంపింది. యునెస్కో కన్సల్టెంట్ ప్రొఫెసర్, నర్తకి, ఆర్కిటెక్ట్ అయిన చూడామణి నందగోపాల్‌ను అధికారులు పిలిపించి ఆలయ ప్రత్యేకతలపై అధ్యయనం చేయించి ఆ వివరాలను యునెస్కోకు పంపారు. దాన్ని స్వీకరించిన యునెస్కో.. ఆ వివరాలు కచ్చితంగా ఉన్నాయో లేదో పరిశీలించేందుకు బృందాన్ని పంపుతోంది.

**రామప్ప విశేషాలు..**

ఇది రామలింగేశ్వరస్వామి దేవాలయం. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి హయాంలో సైన్యాధిపతి రేచర్ల రుద్రదేవుడు దీన్ని నిర్మించారు. ఆ ఆలయానికి శిల్పిగా వ్యవహరించి అద్భుత పనితనాన్ని ప్రదర్శించిన రామప్ప పేరుతోనే దేవాలయానికి నామకరణం చేశారు. ఇలా శిల్పి పేరుతో ఆలయం మన దేశంలో మరెక్కడా లేదు. క్రీ.శ.1213లో ఆలయ ప్రాణ ప్రతిష్ట జరిగిందని అక్కడి శాసనం చెబుతోంది. పూర్వపు వరంగల్ జిల్లా, ప్రస్తుత ములుగు జిల్లాలోని పాలంపేట గ్రామశివారులో ఈ ఆలయముంది. ఆలయానికి చేరువలో రామప్ప పేరుతో పెద్ద చెరువు ఉంది. దానికి అనుబంధంగా కొన్ని ఉప ఆలయాలున్నా.. పర్యవేక్షణ లేక శిథిలమయ్యాయి. భారత్‌లో 38 యునెస్కో గుర్తించిన ప్రపంచ వారసత్వ కట్టడాలు ఉన్నాయి.



### అద్భుత నిర్మాణం..

- నర్తకి కళ్లముందే నృత్యం చేస్తున్నట్లు అనిపించేంత సహజంగా ఆలయంలో శిల్పాలు ఉంటాయి. ఆలయ స్తంభాలు, పైకప్పు, ఫ్లోర్‌పై చూడ చక్కని, అబ్బురపరిచే చెక్కడాలున్నాయి.
- దక్షిణ భారత్‌లో యునెస్కో గుర్తింపు పొందిన హంపి, హాలేబీడు, తంజావూరు ఆలయాలతో పోలుస్తూ చూడామణి నందగోపాల్ రామప్ప ప్రత్యేకతలను గుర్తించి నివేదించారు.
- హంపి, హాలేబీడు, తంజావూరులలో శిల్పాలను సిస్ట్ రాతిపై చెక్కారు. కానీ రామప్పలో కఠినంగా ఉండే డోలరైట్ రాతిపై చెక్కారు.
- శిల్పాలు అద్దం మాదిరిగా నునుపు తేలుతూ మెరుస్తూ ఉండటం నాటి శిల్పుల నిర్మాణ పనితనానికి నిదర్శనం.
- వెంట్రుక దూరేంతటి సన్నటి సందులతో కూడిన డిజైన్లు శిల్పాలపై ఉండటం దీని విశిష్టత.
- గర్భాలయ ప్రవేశ మార్గం పక్కన ఉండే వేణుగోపాలస్వామి శిల్పంపై మీటినప్పుడు సప్తస్వరాలు పలకటం నాటి పరిజ్ఞానాన్ని స్పష్టం చేస్తుంది.
- ఈ ఆలయానికి వాడిన ఇటుకలు నీటిలో తేలుతాయి. నిర్మాణ బరువును తగ్గించేందుకు ఈ ఇటుకలు రూపొందించారు.
- పూర్తి నల్లరాతితో ఆలయాన్ని నిర్మించారు. కానీ సమీపంలో ఎక్కడా అలాంటి రాళ్ల జాడ కనిపించదు. వేరే ప్రాంతం నుంచి ప్రత్యేకంగా ఆ రాళ్లను తెప్పించారన్నమాట.
- పేరిణి నృత్యం సృష్టించేందుకు ఈ ఆలయంలోని శిల్పాల నృత్య భంగిమలే ప్రేరణ.
- గణపతి దేవుడి బావమరిది జాయపసేనానీ 1250లో రచించిన నృత్య రత్నావళి గ్రంథంలోని వర్ణనకు ఈ ఆలయ శిల్పాలే ప్రేరణ.

# ప్రవాసులకు అండగా..

- ఎన్‌ఆర్‌ఐ పాలసీకి త్వరలో తుది రూపు
- మున్సిపల్ ఎన్నికల తర్వాత కొత్త పాలసీ విడుదల
- కేరళ, పంజాబ్ పాలసీ కంటే మెరుగైన నిబంధనలు

**సాక్షి, హైదరాబాద్:** వివిధ దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రవాసుల సంక్షేమం, పునరావాసం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ పాలసీ త్వరలో కొలిక్కి రానుంది. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ పాలసీకి తుది రూపు ఇచ్చి విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాలు అమలు చేస్తున్న పాలసీ విధానాల కంటే మెరుగ్గా ఉండేలా కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నేపథ్యంలో విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసుల కోసం ఎన్‌ఆర్‌ఐ పాలసీని రూపొందిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ మేరకు 2016లో నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు ఎన్‌ఆర్‌ఐ పాలసీ విధి విధానాలపై తెలంగాణ ప్రవాసులు, తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ అసోసియేషన్లు, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల వివరాలు సేకరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో జిల్లా స్థాయిలో ప్రత్యేక విభాగం చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రవాసుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేసింది. గతేడాది ఎన్‌ఆర్‌ఐ పాలసీ విడుదలవుతుందని భావించినా, వరుస ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడుతూ వస్తోంది.

**సంక్షేమం, పునరావాసమే ప్రధానం..**

విదేశాల్లో నివసిస్తున్న తమ రాష్ట్ర వాసుల కోసం ఇప్పటికే పంజాబ్, కేరళ రాష్ట్రాలు ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ పాలసీని రూపొందించి అమలు చేస్తున్నాయి. తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ విధానం అంతకంటే మెరుగ్గా ఉంటుందని ప్రభుత్వం చెబుతుండగా, తెలంగాణ ప్రవాసుల పునరావాసం, సంక్షేమమే లక్ష్యంగా ప్రతిపాదనలు ఉండాలని ఎన్‌ఆర్‌ఐ అసోసియేషన్లు కోరుతున్నాయి. ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ విభాగం ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధిని బదిలీ చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. గల్ఫ్ వంటి దేశాల నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చే వారికి రూ.5 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఎన్‌ఆర్‌ఐ అసోసియేషన్లు కోరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పాలసీ విడుదలకు ముందే రూ.2 లక్షలు మధ్యంతర పరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

### మలేసియా వలసదారులకు అండ?

ఉపాధి కోసం వెళ్లి వివిధ కారణాలతో చిక్కుకుపోయిన వారి కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గత ఆగస్టు నుంచి 3 నెలల పాటు క్షమాభిక్ష ప్రకటించింది. పాస్‌పోర్టు లేని వారు, వర్క్ పర్మిట్ వీసా గడువు ముగిసిన వారు.. తదితరులు క్షమాభిక్ష సమయంలో స్వదేశాలకు తిరిగి వెళ్లే అవకాశం లభించింది. తిరుగు ప్రయాణానికి విమాన టికెట్లు లేకపోవడంతో పలువురు తెలంగాణ వాసులు ఇబ్బందులు పడ్డారు. టీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ శాఖతో పాటు పలువురు దాతల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 600 మంది తెలంగాణవాసులను స్వరాష్ట్రానికి రప్పించింది. ఇక తాజాగా మలేసియా ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి డిసెంబర్ 31 వరకు బ్యాక్ ఫర్ గుడ్ ఆమ్నెస్టీ ప్రకటించింది. ఈ క్షమాభిక్ష కాలంలో పాస్ పోర్టు లేనివారు, వర్క్ పర్మిట్ వీసాల గడువు ముగిసిన వారికి మలేసియా వదిలి వెళ్లేందుకు అవకాశం లభించింది. ఆమ్నెస్టీ ద్వారా తమ స్వదేశాలకు వెళ్లే వారు 700 మలేసియా రింగెట్లు (రూ.12 వేలు) చెల్లించడంతో పాటు, విమాన టికెట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

## అహింసతోనే పురోగతి

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** ఉగ్రవాదం పెచ్చరిల్లుతూ ప్రపంచాన్ని వణికిస్తున్న తరుణంలో మళ్లీ విశ్వశాంతి నెలకొనాలంటే మహాత్ముడు చూపిన మార్గాన్ని అనుసరించటమే మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బ్రిటిష్ వారిని తరిమేందుకు ఆయన అహింసనే ఆయుధంగా చేసుకుని పోరాడిన తీరు ఎప్పటికీ మరవద్దని సూచించారు. ముఖ్యంగా యువత, చిన్నారులు ఆయన బాటను అనుసరిస్తే ఆ దేశం పురోగమిస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో, దక్షిణ మధ్య రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నం.1పై ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ ఛాయా చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వేతో మహాత్ముడికి విడదీయరాని అనుబంధం ఉందని, జాతీయోద్యమంలో ప్రజలను చైతన్య పరిచేందుకు ఆయన చాలా ప్రాంతాల్లో రైళ్లలోనే తిరిగారని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో ఆయనను రైలులోంచి తోసేసిన తీరు కూడా ఉద్యమం బలపడేందుకు కారణమైందని గుర్తు చేశారు. గాంధీ బాల్యం నుంచి చివరి వరకు జరిగిన ఎన్నో ఘటనలకు సాక్ష్యంగా నిలిచిన చిత్రాలను ఇందులో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం ఆనంద్ భాటియా, సీపీఆర్‌ఓ రాకేశ్, రీజినల్ ఔట్ రీచ్ బ్యూరో డైరెక్టర్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- పాక్ మాజీప్రధాని నవాజ్ షరీఫ్ (69)కు జైల్లో సకల సదుపాయాలు అందుతున్నాయి. ఆయనకు జైల్లో ఏసీ, టీవీ, వాటర్ హీటర్, వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు ఓ మీడియా శనివారం వెల్లడించింది.












## నిజం చెప్పే నాలుక

ఫుడ్ బాగుందో లేదో ఎలా తెలుస్తుంది.. నాలుకతో రుచి చూస్తేనే.. అదే విధంగా రసాయనాలను రుచి చూసేద్దామంటే మాత్రం అది దాదాపు అసాధ్యమే.. కానీ కొన్నిచోట్ల వాటి రుచి తెలిస్తే తప్ప పనులు జరగవు. మరి వీటి రుచిని చూసేదెలా.. అందుకోసం కృత్రిమ నాలుక తయారుచేస్తే పోలే అనుకున్నారు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ పరిశోధకులు. ముఖ్యంగా దీన్ని ఆల్కహాల్‌లో కల్తీని నిరోధించడానికి తయారుచేశారట. కల్తీని ఇది ఇట్టే పసిగట్టేస్తుందని.. చిన్నచిన్న తేడాలను గుర్తిస్తుందని, 99 శాతం కచ్చితత్వంతో చెబుతుందని అంటున్నారు. అంతేకాదు 12 ఏళ్లు, 15 ఏళ్లు, 18 ఏళ్ల కిందటి ఆల్కహాల్‌ల మధ్య తేడాను కూడా ఇట్టే కనిపెట్టేస్తుందట. అల్యూమినియం, బంగారం లోహాలను ఉపయోగించి దీనిని తయారు చేశారు. 'ఈ కృత్రిమ నాలుక అచ్చు మన నాలుకలాగే పని చేస్తుంది. కాకపోతే సంక్లిష్టమైన రసాయనాల మధ్య తేడాను గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అని పరిశోధకులు అలస్డేర్ క్లార్క్ వివరించారు. కృత్రిమ నాలుకను ఇప్పటికే చాలా మంది అభివృద్ధి చేశారని, అయితే రెండు వేర్వేరు రకాల నానోస్కేల్ మెటల్ రుచి గ్రాహికలను ఉపయోగించి ఒకే నాలుక పనిచేసేలా తయారు చేయడం ఇదే తొలిసారని చెప్పారు. ముందుగా ఆల్కహాల్ తేడాలను గుర్తించేందుకు వినియోగించామని, ఈ నాలుక ఏ రకమైన రసాయనాల మధ్య తేడానైనా గుర్తిస్తుందని చెప్పారు.

**ఎలా పనిచేస్తుంది..**

- బంగారం, అల్యూమినియం లోహాలతో తయారుచేసిన నానోస్కేల్ రుచి గ్రాహికలను శాస్త్రవేత్తలు తయారు చేశారు.
- విస్కీ నమూనాలను ఈ రుచిగ్రాహికలపై పోశారు. ఈ రుచిగ్రాహికలు మన నాలుకలోని రుచిగ్రాహికల కన్నా 500 రెట్లు చిన్నవి.
- ఆ తర్వాత ద్రవంలో మునుగుతున్న కొద్దీ ఆ గ్రాహికలు కాంతిని ఎలా శోషించుకుంటున్నాయో పరిశోధకులు విశ్లేషించారు.
- అవి కాంతిని శోషణం చేసుకునే తీవ్రతను బట్టి నమూనాల మధ్య తేడాలను అర్థం చేసుకోవచ్చు. ఈ పరిణామాన్ని 'ప్లాస్మోనిక్ రెసోనెన్స్'అని పిలుస్తారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

